TELUGU VOLUME TWENTY THREE

# The Voice of Truth

# సత్యవాణి

## International

బైబిలు
పేజీ - 10
ఇది నిజమా?
పేజీ - 22
పాపుల మిత్రుడు
పేజీ - 26
దేవుడు హృదయమును ఎట్లు తెరచును?
పేజీ - 33
అబానాయు ఫర్పరును
పేజీ - 37
సంఘాభివృద్ధి కొరకు సూత్రములు
పేజీ - 55
జ్యోతిష్కము
పేజీ - 68



వోయిస్ ఆఫ్ ట్రూత్ (సత్యవాణి) ఇంటర్నేషనల్
పోస్టుబాక్సు నెం. 80, కాకినాడ - 533 001. ఆం.ప్ర

# The Voice of Truth International


ఒక్క మాట :

"యేసు వారి యొద్దకు వచ్చి పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను"


## Staff :

***Editor*** : Byron Nichols

***Associate Editors*** : Jerry Bates, Louis Rushmore

***Layout Editors*** : Betty Burton Choate, Bonnie Rushmore

***Typesetting*** : Akash Printers

***Computer Consultant*** : Joshua Gootam

***Promotion*** : Sudhir Mendiratta, Dale Grissom, Oran Rhodes, Mark Posey Buck Davenport, James Warren, Ken Willis, Dennis Larson, Don Hinds, Charles Salmon

***Associate Editors for Foreign Editions*** :
Roger Dickson, South Africa
Sunny David, India
Joshua Gootam
Henry Kong, Singapore
Reuben Emperado, Philippines
Stephen Randall, Australia
Rod Kyle, New Zealand



The Voice of Truth International is published by Churches of Chirst, under the non-profit World Evangelism Foundation, U.S.A.

**వోయిస్ ఆఫ్ ట్రూత్ ఇంటర్నేషనల్**

***Telugu Edition***
***Managing Editor : Joshua Gootam***
***P.O. Box-80, Kakinada. A.P. - 533 001, India.***


Reader'srequests for articles on particular subjects will be considered. Comments and suggestions regarding the content and appearance of the magazine will be appreciated.



## Staff Writers :

George Akpabli
W.T. Allison
O.P. Baird
Leon Barnes
Wayne Barrier
Roay Beasley
V.P. Black
Maxie B. Boren
T. Pierce Brown
Ron Bryant
Salvador Cariaga
Jack W. Carter
David Chadwell
Frank Chesser
Betty Burton Choate
Jeril Cline
Charles E. Cobb
Glenn Collery
Willard Collins
Owen Cosgrove
Sunny David
Jerry Davidson
Hans Dederscheck
David Deffenbaugh
Clarence Deloach, Jr.
Roger Dickson
Bobby G. Dockery
Earl Edwards
Demar Elam
Reuben Emperado
Garell L. Forehand
Royce Frederick
E. Claude Gardner
R. Gnanasundaram
Mark Hall
Gary C. Hampton
Jack Harriman
Woodson
W. Dauglass Harris
Ray Hawk
Gordon Hogan
Tom Holland
Wayne Jackson
Ancil Jenkins
Dan Jenkins
Jerry Jenkins
Jimmy Jividen
Dayton Keesee
Tom Kelton
Dalton Key
Michael L. King
Mack Lyon
Avon Malone
Cecil May, Jr.
Bill Mc Farland
Don McWhorter
Jane McWhorter
Hollis Miller
Wayne Miller
Tim Nichols
Bill Nicks
Fenter Northern
Don L. Norwood
Basil Overton
Frances Parr
Max Patterson
David Pharr
Harvey Porter
G.F. Raines
Eulene Ramsey
John Thiesen
Betty Tucker
Ken Tyler
Don W. Walker
Tex Williams
Willeam


**THE CHURCHES OF CHRIST SALUTE YOU (Romans 16:16).**

# "Come, Let us Reason Together" (Isaiah 1:1-20)

*Byron Nichols*



The words of Isaiah and the other prophets were obviously for the benefit of the people of their day, but they were much more than that. Their words contained principles that have also been applicable and pertinent for all generations since.

The First verse of the text says, " The vision of Isaiah the son of Amoz...." Through divine guidance and revelation, Isaiah was made able to perceive the message that God wanted transmitted to His people, and he delivered that message as if the Lord Himself were speaking.

Jehovah testifies in verse two that He has cared for Judah as a loving and devoted father, In spite of the fact that He loved them and provided for them as his children, their response was ingratitude, and even disobedience and outright rebellion.

We see in verses five and six that these people were so depraved and impenitent that they are pictured as being sick and afficted from head to foot. they stubbornly refused to forsake their unrighteous ways. They were indeed a hopeless lot.

**The Lord Reacts to Their Worship**

Verses 11-15 constitute some of God's harshest statements regarding false worship in the entire Old Testament. Judah's worship was no more than an abomination to the Lord!

Perhaps the Lord's animosity reached its zenith when He stated that His soul hated their disgusting excuse for worship (verse 14). We need to remember that this is the same God that John, in 1 John. 4:8,16, described as being the very personification of love! But we see here that the God of love can become totally nauseated by the conduct of his own chosen people!

Fortunately for Judah, the

Lord didn't leave them, as it were, dangling over the fires of Hell. In spite of all of His grave reprimands, His love for them is still there. This is seen in His plea in verses 16,17 to turn away from their evil and from their pretense and hypocrisy.

God specifies nine things in verses 16, 17 that must be done in order to make their lives acceptable in His sight. Even a rather casual reading of these commands shows that acceptable worship requires much more than just doing the right acts at the right time and in the right manner when assembled for worship. We see here that people only fool themselves when they think that they can live carelessly and dishonorably through the week and then be able to offer up acceptable worship in the worship assembly.

**A Reasonable Solution is offered by Jehovah**

After this severe reprimand to Judah, the Lord again displays His mercy and willingness to forgive penitent sinners. God entreats His wayward children to accept His reasonable terms of pardon. Thus in verse 18, the loving Lord said, " Come now, and let us reason together...."

The Lord proposes that they be reasonable and acknowldege their sins and listen to His gracious offer to forgive them and accept them back into His good graces.

What an impressive gesture He is making! He stresses to them the awful contrast between purity and their sinfulness. Though the contrast is tremendous, Jehovah is more than willing to make them as pure as the snow.

**The Choice is Theirs**

The Lord wills that all men be saved (2 Peter 3:9), but He leaves it up to man to decide for himself, as He says in verses 19, 20 of our text, " If you are willing and obedient...."

Thus we come to the end of the Lord's effort here to call His wayward people to reason. Isaiah concludes our text with the impressive affirmation, "For the mouth of the Lord has spoken." The lord had spoken from the depths of His heart. In spite of all their sins, He still longed for the salvation of His people.

**Lessons for Today**


Though originally for Judah, the words of this text are so very pertinent for the church even today! Judah did not understand

that acceptable worship of a holy God can only come form holy people. Now, what about us today? We have to realize that to offer up worship that is acceptable to God we must approach Him with " clean hands and a pure heart..." (Psalm 24:4).

We each must be fully persuaded of these three things regarding worship: (1) that worship is to be offered by people whose everyday lives depict a deep and sincere commitment to Christ; (2) that worship is submitted to God for His acceptance and pleasure; and (3) that we must not only possess this understanding ourselves- it is imperative that we continually do our very best to help other Christians to also understand this.


May we never neglect to treat God in the manner which he deserves. May we faithfuly heed Him, honor him, love Him, obey Him, serve Him, thank Him, and worship Him.

**The Lord is not slack concerning His promise, as some count slackness, but is longsuffering toward us, not willing that any should perish but that all should come to repentance. But the day of the Lord will come as a thief in the night, in which the heavens will pass away with a great noise, and the elements will melt with fervent heat; both the earth and the works that are in it will be burned up. Therefore, since all these things will be dissolved, what manner of person ought you to be in holy conduct and godliness, looking for and hastening the coming of the day of god, because of which the heavens will be dissolved, being on fire, and the elements will melt with fervent heat?" (2 Peter 3:8-12)**



# The Bride of Christ

### *Jerry Bates*



Several images are used in the Bible to describe the church so that we can better understand it. Some of those images are a kingdom, a body, a temple, a flock, a family, and a priesthood. In 2 Corinthians 11:2 Paul compares the church to a bride. He writes, "for I am jealous for you with godly jealousy. For I have betrothed you to one husband, that I may present you as a chaste virgin to Christ." This imagery suggests several aspects such as a unique identity, and extremely close relationship, unlimited provisions, and unblemished beauty. However, I want to focus on another aspect, which is unquestioned loyalty.

The idea of a bride conveys faithfulness. Marriage is a commitment, a covenant that requires love and loyalty. In marriage, each partner should look out for the good of the other person. We know Christ has done that for the church. Christ gave Himself for the church just as a good husband would for his bride (Ephesians 5:23). The idea of a marriage suggests a devotion that matters more than life itself. We have heard stories of husbands and wives who chose to face death together rather than be separated. The devotion of their hearts to each other mattered more than life.

Our allegiance to Christ should be more precious than anything else. When Joseph discovered that his espoused wife, Mary, was going to have a child, he was going to put her away. Undoubtedly, he still loved her, but her supposed infidelity was more than he could stand. He was not going to marry a woman who was unfaithful. It is unthinkable for a bride to betray her husband, so Paul used it to illustrate the fidelity of a Christain towards Christ. James uses the same idea, when he referred to Christians as "adulteres" and "adulteresses" (James 4:4). He stresses that friendship fo the world is enmity or hate with God. If the things of this world become more important to us than Christ, then it is just as serious as committing

physical adultery. Christ spoke these demanding words in Luke 14:33, " So likewise, whoever of you does not forsake all that he has cannot be my disciple."

Our commitment to Christ should matter more than any other relationship. In marriage, the relationship between a husband and wife should be closer than any other relationship. Anything short of that is bound to cause problems. The same is true spiritually. Our relationship to Christ should be closer than even the relationship of our family. Christ said in Luke 14:26, " If anyone comes to me and does not hate his father and mother, wife and children, brothers and sisters, yes, and his own life also; he cannot be my disciple." They seem to be harsh words, but they only emphasize that no relationship should be more important to us than that of Christ.

As we compare the above thoughts to the church to today, we find many shortcomings, The church is no more important than the local social club for many people. They view the church as a good organization, but certainly not something that demands sacrifice or should come before one' family. Many move from one congregation or group to another, searching for whatever association satisfies their needs and desires for the present time. In the minds of many, the beliefs of family members are more important than what the Bible teaches. Even when confronted with the truth, they refuse to go against their family traditions. Many others spend far more time working and accumulating riches of this world than working for God. They excuse their lack of spiritual activity by saying they don't have time. In actuality, it only reveals what is most important to them.

How important is God in your life? Many would proclaim that God is very important to them, yet they do some of the things as described previously if a bride were to exhibit such attitudes, she would not be acceptable to her husband, and those attitudes are not going to be acceptable to our spiritual Husband either. God is indeed a loving God but He is also a God that will tolerate no rivals. As it has often been said, God will either be number one in your life, or He is not in your life at all. Let us always keep in our minds the imagery of a bride adorned for her husband. As someone once said, " Let us not just act like the bride of Christ, but let us be the bride of Christ.

" For the Lord your God is a consuming fire, a jealous God" (Deuteronomy 4:24).

# Can't See the Forest for the Trees

*By Louis Rushmore*



There is a popular expression that goes something like this: "you can't see the forest for the trees." This expression presupposes that someone is standing in the woods, and therefore, he cannot adequately see the forest composed by the mass of trees. Yet, from another vantage point, such as standing outside the woods, may be on the crest of a hill, one can see the forest and may not be able to see the individual trees that compose the forest.

Consider for a momvement applying these figures to spiritiul matters, and particularly to congregations of the Lord's church. For instance, as a visiting preacher only speaking for one, two or three class or assembly time, really, I can only see the "Forest"; for the most part, I cannot observe the "trees"- the individual members who comprise that congregation. On the other hand, someone who preaches frequently for the same congregation may more easily be able to see the "trees" and less able to see adequately the "forest" - how the congregation may be perceived by visitors or the community.

Think with me a couple of minutes about the different kinds of trees that one might find in the same forest: pines, oaks, maples, dogwoods, mimosas and many more. Furthermore, a forest will likely have in it old trees, saplings and trees of every age in between. Irrespective of the kind of trees or the age of trees, together the various trees constitute a forest. Although we humans may value or dismiss as worthless certain kinds of trees, together, the various trees nevertheless make up a forest.

There is a congregation with which I am familiar, owing to my several occasional visits over the years, that makes me think: " I

can't see the forest for the trees." In this case, that's a good thing. These "tree" - local Christians - cause in me awe and admiration.

Human tendency, even among Christians ( I Corinthians 1:10-13), is to be fussy if not divisive. Often, adults don't play well together any more than small children who sometimes fuss with each other. Small children, however, get over it shortly and play well with each other again. This little church though, functions well, despite being a "forest" comprised of various "trees."

This church is comprised of at least four races, representing directly or indirectly several nationalities and cultures. Members represent all ages and socio-economic distinctions. From a purely secular viewpoint, these people have nothing in common, but because they have Jesus Christ in common as their Savior, they are an awe-inspiring family of God meeting in their community. The point is that they (and all Christian should) have and remember Jesus Christ in common as Savior. Jesus Christ our Savior is the great equalizer; nothing matters beyond the salvation of souls from past sins and subsequent preparation to meet God in eternity (Amos 4:12).

Further observation respecting the reason behind this remarkable cohesiveness is their "out of body experience." By that I mean that this church is comprised of Christians whose interaction with each other is not limited to assemblies for Bible class and worship; they have " out of corporate body experience." They not only worship and study God's word together, but they eat together in one another's homes, they play together, and they work together to further the cause of Christ. Doesn't some of that, the frequency of interaction in one another's lives in addition to assemblies, remind you a little bit of the church of the Bible? ( Acts 2:46).

These "trees", though they differ from one another in a number of ways, make up a healthy "forest" of Christians in their community. What kind of "trees" are we, and do we contribute to a healthy " forest" of God's people in our respective communities?



# Voice of Truth Int. Vol - 23

## విషయసూచిక


| దేవుని గ్రంథము : | పేజీ |
|---|---|
| బైబిలు........................................ | 10 |
| సర్వసంపూర్ణమైనది............................ | 12 |
| బైబిలు అనబడు ఈ గ్రంథము................. | 14 |
| బెరయలోని వారు, థెస్సలోనికయ వారు....... | 16 |
| **దేవుడు :** | |
| నీవు అక్కడ వున్నావా?.......................... | 18 |
| నీ శత్రువులు చెదరిపోవుదురుగాక............... | 20 |
| ఇది నిజమా?.................................... | 22 |
| పరిశుద్ధ గ్రంథపఠనము.......................... | 24 |
| పాపుల మిత్రుడు................................ | 26 |
| **రుజువులు :** | |
| మొదటి అబద్ధము గాని ఆఖరిదికాదు............ | 30 |
| ఒక రాజు బాప్తిస్మము పొందుట................. | 32 |
| దేవుడు హృదయమును ఎట్లు తెరచును?........... | 33 |
| **రక్షణ :** | |
| రక్షణ, దేవుని ఉచితవరము....................... | 35 |
| అబానాయు, ఫర్పరును............................ | 37 |
| పాపియొక్క ప్రార్థన................................ | 39 |
| గలిలయ నుండి యొర్దానుకు...................... | 41 |
| నీతి యావత్తు జరిగించుటకు...................... | 44 |
| బాప్తిస్మము పొందినప్పుడు అనేక సంగతులు...... | 46 |
| మంచి సలహా .................................... | 47 |

**సంఘము - ఆరాధన :**


ప్రభువు దినము.................................... 48
కీర్తనలు పాడుట.................................... 50
నేనిచ్చే కానుకలు.................................... 51
క్రీస్తు సంఘ ఆర్గనైజేషన్ ఎట్లున్నది?................ 53
సంఘాభివృద్ధి కొరకు సూత్రములు................. 55
విశ్వాసము ఒక్కటే................................ 57


**క్రైస్తవ జీవితము :**


దేవుని ప్రత్యేక ప్రజలు.............................. 59
మంచి జరుగునట్లు.................................. 61
అన్నింటిలోను మొదటిస్థానము దేవునికే............ 63
గొప్ప ఆజ్ఞ ఎందువలన గొప్పదాయెను?........... 65


**ప్రత్యేకాంశములు :**



జ్యోతిష్యము.......................................... 68
ఆలాగు జరుగుట నా ప్రజలకు ఇష్టము............. 70
పౌలు యొక్క జీవిత చరిత్ర.......................... 72
అమజ్యాలాంటి మూర్ఖత్వ పంతము.................. 75
రక్తము ద్వారా విమోచన............................. 77
రక్షణను గూర్చి నీవు నిజముగా తెలిసికొనవచ్చును....... 83
ఈ యేసు ఎవరు? .................................. 46


**Editorials:**


Come, Let us Reason Togeher ................. 1
The Bride of Christ ................................. 4
Can't See the Forest for the Trees .............. 6

# బైబిలు
# (The Bible)

**- N.B. Hardeman**



చరిత్ర కాల నిర్ణయమును బట్టి ఆదికాండము మొదటి అధ్యాయము నుండి ప్రకటన గ్రంథము ఆఖరి అధ్యాయము వరకు 4100 సంవత్సరములాయెను. మొదటి లేఖకుడగు మోషే మొదలుకొని ఆఖరి లేఖకుడగు యోహాను వరకు 1600 సంవత్సరములు. ఇక్కడ 4000 సంవత్సరముల చరిత్రను నలువది మంది లేఖకులు 1600 సంవత్సరముల కాలములో లిఖించుట జరిగినది. వీరు క్రీస్తుపూర్వము 1500 సంవత్సరముల నుండి క్రీస్తుశకము 100వ సంవత్సరము వరకు జీవించిన వారు. ఈ మనుష్యులెవరు? అని మనం అడుగ వచ్చును. వారు కాలేజీ ప్రొఫెసర్లా? కాదు. మహాపండితుల గృహములలో జన్మించిన వారా? కానే కాదు! గాని వారెవరు?

ఈ లేఖకుల పూర్వీకులు ఐగుప్తు దేశములో చాలాకాలము బానిసలుగా యుండినవారే. వారు ఐగుప్తు యొక్క మండుటెండలో కొరడాలు ఝుళిపించు చుండగా కష్టపడి చెమటోడ్చిన వారే, వారు ఉల్లి, వెల్లుల్లి తినుచు సగటున మూడుమానములు పనిచేయు నవకాశము కల్గినవారు. వారి సంతతి యగు ఇంచుమించు ఆరులక్షలమంది (స్త్రీలు, పిల్లలు గాక) ఎర్రసముద్రమును

దాటి, భయంకరమైన అరణ్యమార్గమున నలుబది సంవత్సరములు పయనించి, పైనుండి దేవుడు కురిపించిన మన్నాను తినుచు నలుబది సంవత్సరములు పయనించిరి. చివరకు వారు వాగ్దానము చేయబడిన 7000 చతురపు మైళ్ళు గల చిన్న దేశములోనికి ప్రవేశించిరి. అక్కడవారు జీవిస్తు, జీవనముగడుపుచు తమ కథనమును వ్రాసిరి.

వారు గతాన్ని గూర్చి స్టడీ చేయుటకు గొప్ప గ్రంథాలయములు కలిగినవారు కాదు. అనుదిన వార్తలను విశ్లేషించి తమకు అందించే దైనిక వార్త పత్రికలు వారికి లేవు. టెలిఫోన్లు, కేబుళ్ళు టెలివిజన్లు వారికి లేవు. రేడియోలు అంతకుముందే లేవు. వారు విద్యలేని పామరులు. పెద్దగా చదువు సంస్కారములు కలిగినవారు కాదు. ఈ గ్రంథాన్ని వ్రాయుటలో వారు కలిసిపనిచేసే అవకాశం యేమిలేదు. వారందరు సర్వసాధారణమైన అంశములను గూర్చే వ్రాసారు; ఉదా: మానవుడు, అతని ఆది, విధి, గమనము మొదలగునవి. ఆ నలుబది మంది 66 పుస్తకములు వ్రాస్తు 4100 సంవత్సరముల చరిత్రను అందులో లిఖించిరి, వీటన్నిటిలోను స్వవిరుద్ధ సంగతి యేమిలేదు. చరిత్ర విషయంలోగాని నైతికతలోగాని చిన్న పొరబాటు లేకుండా వారు వ్రాసారు.


ఒక అంశాన్ని గూర్చి ఇద్దరిని వ్రాయమంటే వారు కొన్ని స్వవిరుద్ధ సంగతులు తప్పక వ్రాస్తారు. అనేక సంవత్సరముల మట్టుకు ఒకడు ఏదైనా వ్రాస్తే, తాను మధ్యలో మనసు మార్చుకొని, అంతకుముందు వ్రాసిన తప్పులను సవరించుటకద్దు, అయితే బైబిలు లేఖకుల విషయంలో అట్టిదేదీ జరుగలేదు. దీనిని గూర్చి మనం ఎట్లు చెప్పుకొనగలము? దానికి ఒకే ఒక్క జవాబున్నది. దేవుని మనుష్యులు దేవుని ఆత్మచే నడిపింపబడిన వారై ఆ గ్రంథమును వ్రాసిరి, గ్రంథకర్త దేవుడు, లేఖకులు దైవావేశ మానవులు.

– యన్.బి. హార్డిమన్



# సర్వసంపూర్ణమైనది
# (All Sufficient)

**- Roger A. Rush**



దేవునితో మానవుడు జీవించ దగునట్లు అతని సిద్ధపరచుటకు బైబిలు సర్వసంపూర్ణమైనది. (2 తిమో 3: 15-17). బైబిలు సర్వ సంపూర్ణ మనుటలో మానవుడు పాపక్షమాపణ పొందుటకు, నీతిగల జీవితమును జీవించుటకు, నిత్యజీవన సిద్ధపాటుకు కావలసినదంతా బైబిలులో యున్నదని అర్థము. మానవుడు ప్రతి సత్కార్యమును చేయుటకు అది అతని సిద్ధపరచును. దేవునితో మనకు గల సంబంధ విషయమై ఇంకా కావలసినది అందులో యేమీలేదు గనుక దేవుని నుండి క్రొత్తబయల్పాటు యేమి అవసరం లేదు.

బైబిలు సర్వ సంపూర్ణము గనుక ఏదైనా క్రొత్త బయల్పాటువుంటే, అది కావలసిన దాని కంటే ఎక్కువ, దోషసహితం, అనవసరం. లేఖనములకు మించి నాకు క్రొత్తగా దేవుడు బయలుపరిచాడని ఎవడు చెప్పుకొనినా అట్టివానిని మనం శంకించవలసినదే, వాని విషయం జాగ్రత్తగా యుండాలి.

దేవుని దరపున యిర్మియా ఇట్లు హెచ్చరించాడు: "సైన్యముల కధిపతి యగు యెహోవా ఈలాగు సెలవిచ్చు చున్నాడు - మీకు ప్రవచనములు ప్రకటించు ప్రవక్తల మాటలను ఆలకింపకుడి, వారు మిమ్ములను భ్రమ పెట్టుదురు" (యిర్మి 23:11). మరియు "స్వేచ్ఛగా నాలుకలనాడించు కొనుచు దేవోక్తులను ప్రకటించు ప్రవక్తలకు నేను విరోధిని; ఇదే యెహోవావాక్కు. మాయా స్వప్నములను ప్రకటించు వాటిని చెప్పుచు అబద్ధముల చేతను మాయా ప్రగల్భముల చేతను నా ప్రజలను దారితొలగించు వారికి నేను విరోధినైయున్నాను. ఇదే యెహోవా వాక్కు" (యిర్మి 23:32).

లేఖనములకు వేరై దేవుడు తమతో మాట్లాడుచున్నారని చెప్పుకొనేవారు నేడు కొందరున్నారు. గాని వారి ప్రగల్భాలను బైబిలు సమర్థించుటలేదు. కొన్ని ప్రశ్నలను మనం గమనించాలి. ఈ క్రొత్త బయల్పాటులు బైబిలులోని సంగతులకు విరుద్ధముగా ఉంటాయి. ఎందువలన? క్రొత్తగా బయల్పాటు కలిగినదని చెప్పే వాని సంగతులు ఇంకొక అట్టి వానితో ఎందుకు విభేదిస్తాయి? ఈ క్రొత్త బయల్పాటులకు దేవుడే ఆధారమైతే అవన్నీ సమన్వయము కలిగి యుండునుగదా? క్రొత్త బయల్పాటులు ఎందుకు కావాలి? మనం సర్వసన్నద్ధులమై యుండగా, ఇంకా యేమి తక్కువ? జీవముకు భక్తికి కావలసినవన్నీ ఆయన మనకను గ్రహిస్తే, మన కింకేమి కావాలి? (2 పేతురు 1:3)


బైబిలుపై నిర్మింపబడని విశ్వాసము నిలువబడదు. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). బైబిలు సర్వసంపూర్ణమై యున్నది. దేనినైనా బైబిలు ఆమోదించుట లేని యెడల దానిని మనం విసర్జించాలి. మనం దేవుని కొరకు మాట్లాడితే దేవుని వాక్యాన్నే మాట్లాడాలి (1 పేతురు 4:11). నీ విశ్వాసము సర్వ సంపూర్ణమైన దేవుని వాక్యమును బట్టి యున్నదా? లేక ఆధునిక అబద్ధ ప్రవక్తల మాటలను బట్టియున్నదా? దేవుని వాక్యమును బట్టియుంటే నీవు నిలబడతావు. మానవుల మాటలను బట్టియుంటే కూలబడతావు.

– రోజర్ రష్



# బైబిలు అనబడు ఈ గ్రంథము
# (This Book called the Bible)

**- Charles Box**




"పుస్తకములు అధికముగా రచింపబడును, దానికి అంతము లేదు" అని సొలొమోను చెప్పాడు (ప్రసంగి 12:12). అయినను గ్రంథములన్నిటి కంటే వేరుగా యున్న గ్రంథమొకటి కలదు, ఈ గ్రంథము దేవునిచే ముద్రింపబడి భద్రపరచబడి యున్నది. "ఆకాశమును భూమియు గతించును గాని, నా మాటలు ఎన్నటికిని గతింపవు" అని యేసు చెప్పెను (మత్తయి 24:35). భద్రపరచబడి, సంరక్షింప బడుచున్న ఈ గ్రంథము, బైబిలు, అది దేవుని యొక్క ఆత్మావేశ వాక్యము, అందువలన ఆ గ్రంథమును చదువ వలసిన బాధ్యత మనపైయున్నది. దానిని సరిగా విభజించి విశ్వసించి దాని బోధలకు మనం లోబడవలెను.

బైబిలును అర్థము చేసికొనగలమా? అవును తప్పక అర్థము చేసికొనగలము. దానిని గూర్చి కొన్ని సూక్ష్మ సంగతులు తెలిసికొంటే మనకు సహాయకరముగా యుండును. బైబిలులో పాతనిబంధన, క్రొత్తనిబంధనయని రెండు ముఖ్యభాగములున్నవి. నిజానికి వాటిలో 66 పుస్తకములున్నవి. అవన్నీ ఒకే కథనమును గూర్చి చెబుతాయి. అందలి వర్తమాన మేమనగా, "క్రీస్తు వచ్చుచున్నారు, క్రీస్తువచ్చారు, క్రీస్తుమరల రాబోవుచున్నారు". పాతనిబంధనలో 39 పుస్తకములు, క్రొత్తనిబంధనలో 27 పుస్తకములున్నవి.

పాతనింబంధనను అర్థము చేసికొన గలమా? అవును! పాత

నింబంధనలోని 39 పుస్తకములను 4 విభాగములుగా మనం చేయవచ్చును 1. ధర్మశాస్త్రములోని 5 పుస్తకములు, ఆదికాండము, నిర్గమ కాండము, లేవీయ కాండము, సంఖ్యాకాండము, ద్వితీయోపదేశకాండము. 2) చరిత్రలోని 12 పుస్తకములు-యెహోషువ, న్యాయాధిపతులు, రూతు, 1,2 సమూయేలు, I, II రాజులు, 1,2 దినవృత్తాంతము, ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు, 3 పద్య కావ్యములు 5-యోబు, కీర్తనలు, సామెతలు, ప్రసంగి మరియు పరమగీతములు 4) ప్రవచన గ్రంథములు. 17-యెషయా, యిర్మియా, విలాపవాక్యములు, యెహెజ్కేలు, దానియేలు, హోషేయ, యోవేలు, ఆమోసు, ఓబద్యా, యోనా, మీకా, నహూము, హబక్కూకు, జెఫన్యా, హగ్గయి, జెకర్యా మరియు మలాకీ గ్రంథములు. ఆత్మావేశ ఈ చరిత్రయదార్థము మరియు నమ్మతగినది.


క్రొత్త నిబంధనను అర్థము చేసికొనగలవా? అవును! క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములను నాలుగు భాగములుగ చేయవచ్చును. 1) సువార్తల రికార్డు. మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలు క్రీస్తుయొక్క జీవిత చరిత్ర తెలియజేయును. 2) అపొస్తలుల కార్యముల గ్రంథము క్రీస్తు సంఘస్థాపనను, పాపక్షమాపణను తెలియజేయును. 3) 21 పుస్తకములు



క్రైస్తవ జీవిన విధానమును గూర్చి తెలియజేయును. మరియు 4) ప్రకటన గ్రంథము దేవుని ప్రజల నిత్య విజయమును తెలియజేయును.


దేవుని వాక్యాన్ని నేర్చుకొనుటకు సమయమును వెచ్చించుము. దాని బోధలను బట్టి జీవించుము, మరణించుము. ఈ జీవితానంతరము పరలోకమునకేగుము. బైబిలు యదార్థము. దాని బోధలను నీవు నమ్మవచ్చును, వాటిపై ఆధారపడ వచ్చును. దాని బోధనలననుసరించుట వలన నీ యాత్మ క్షేమముగా యుండును.

– చార్లెస్ బాక్స్



# బెరయలోని వారు, థెస్సలోనిక లోనివారు
## (The Bereans and the Thessalonians)

**- Royce Frederick**



పౌలు, సీలాలు బెరయలో యేసు సువార్త ప్రకటించినప్పుడు "బెరయలోని వారు థెస్సలోనికలోని వారి కంటె ఘనులై యుండిరి గనుక ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును సీలయును చెప్పిన సంగతులు ఆలాగున ఉన్నవో లేవో అని ప్రతిదినమును లేఖనములను పరిశోధించుచు వచ్చిరి'' (అ.పొ.కా. 17:11).

అంటే థెస్సలోనికలో యున్న వారెవరు వాక్యమును వినుటకు పరిశోధించుటకు ఆసక్తిలేనివారని అర్థమా? బెరయలో యూదులు పాత నిబంధన లేఖనములను పరిశోధించుటకును యేసు క్రీస్తును గూర్చి తెలిసికొనుటకును ఆసక్తి కలిగియుండిరి. ఆ ప్రవచనములు యేసు క్రీస్తునందు ఎట్లు నెరవేరెనో వారు గ్రహించగల్గిరి.

ప్రవక్తయైన యెషయా గ్రంథము ఆయనచేతికివ్వబడెను" (లూకా 4:16).

బెరయవారు ఘనులై యుండుటకు కారణమేమంటే వారు ఆసక్తితో ప్రతి దినము లేఖనములను పరిశోధించిరి. పౌలు, సీలాలు దైవజనులని వారు ఎరిగియున్నను వారు చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో యని ప్రతి దినము లేఖనములను పరిశోధించిరి (అ.కా. 17:11). బోధించేవారి నిజాయితీ, వ్యక్తిత్వమునుబట్టి గాక లేఖనములతో వారి బోధలను సరిచూచుట ఘనమైన విషయము.

ఎఫె 5:25 నందు పౌలు వ్రాసిన మాటలలో సందర్భసహితమైన చక్కని సందేశమున్నది. "వాక్యముతో ఉదక స్నానము చేత దానిని పవిత్రపరచి పరిశుద్ధపరచుటకై". వాక్యపఠనము, వాక్యధ్యానము, వాక్యప్రకటన ద్వారా సంఘము పవిత్రపరచబడి, పరిశుద్ధ పరచబడి మహిమ గల సంఘమౌతుంది. అందుకే ఆయన "దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను".

"క్రీస్తు మర్మము దేవదర్శనము వలన నాకు తెలియపరచబడినదను సంగతిని గూర్చి మునుపు సంక్షేపముగా వ్రాసితిని. మీరు దానిని చదివిన యెడల దానినిబట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానము గ్రహించు కొనగలరు" (ఎఫె 3:3-4).

జె.సి.బెయిలీ వంటి ప్రియం యోధులు వారి చివరి క్షణం వరకు పరిశుద్ధ గ్రంథం పఠించారు. ఎన్నిసార్లు ఈ గ్రంథాన్ని పఠించినా, ఎన్ని సంవత్సరాలు చదివినా ఏదో ఒక నూతన భావం మనసుకు స్ఫూర్తిస్తూనే ఉంటుంది. ఎందుకంటే అది పరిశుద్ధాత్మ ప్రేరణ వలన కలిగినది.

పరిశుద్ధ గ్రంథపఠనమునకు ప్రాముఖ్యత లేదని భావించి, స్వంత సాక్ష్యాలతో, నిరర్ధకతత్వ జ్ఞానంతో, ముసలమ్మ ముచ్చటలతో కొందరు కాలాన్ని వృధా చేస్తూ ఉంటారు. "సమయము సమీపించినది గనుక ఈ ప్రవచన వాక్యములు చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులు గైకొను వారును ధన్యులు" (ప్రక 1:3). పరిశుద్ధ గ్రంథాన్ని చదువుచు, ధ్యానించుచు విధేయులమై క్రీస్తు నందలి సకలైశ్వర్యము పొందుదాం.

"ఇప్పుడు దేవునికిని, ఆయన కృపా వాక్యమునకును మిమ్మును అప్పగించు చున్నాను. ఆయన మీకు క్షేమాభివృద్ధి కలుగజేయుటకును, పరిశుద్ధ పరచబడిన వారందరిలో స్వాస్థ్యమునను గ్రహించుటకును శక్తిమంతుడు" (అ.కా. 20:32).

**– ఇ.కె.వి. ప్రసాదరావు**

# పాపుల మిత్రుడు

# (A Friend of Sinners)

**- John Stacy**

యేసు ఏ పాపము చేయక పోయినా, పాపముతో నిండియున్న లోకంలో జీవించారు. ఆయన జననము మొదలుకొని సిలువపై మరణము వరకు ఆయన జీవితమంతయు పాపముకై వెచ్చించెను. ఆయన పెదవుల నుండి పాపపు మాట ఒక్కటియైనను రాలేదు. పాపపుపని ఆయన యేమీ చేయలేదు. పాపపు తలంపులు ఆయన ఎన్నడు ఆలోచించలేదు. ఆయన పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడు (హెబ్రీ 9:25-26). తన జీవితంలో పాపమును నిరూపించుమని తనకాలము నాటివారిని ఆయన సవాలు చేసెను (యోహాను 8:46). వారు కనుగొనలేకపోయారు. ఆయన ఏ పాపమును చేయలేదు (1 పేతురు 2:21) ఏ పాపమును ఎరుగడు (2 కొరింథి 5:21) ఆయనలో పాపము ఏమియులేదు (1 యోహాను 3:5). అయినను పాపియొక్క మంచి మిత్రుడాయనే. ఎందువలన? దిగువ సంగతులు గమనించగోర్తాను.

### అతిక్రమము చేయువారితో లెక్కింపబడెను

మొదటిగా, యేసుక్రీస్తు అతిక్రమము చేయువారిలో లెక్కింపబడెను గనుక ఆయన పాపుల మిత్రుడు. ఆయన "అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను. అనేకుల పాపమును భరించుచు తిరుగుబాటు చేసినవారిని గూర్చి విజ్ఞాపనము చేసెను" అని యెషయా ప్రవచించెను (యెషయా 53:12). అతిక్రమము చేయువారిలో ఎంచబడుట యనగా పాపము చేయువారితో ఎంచబడుటయే, ఏలయనగా ఆజ్ఞాతిక్రమమే పాపము (1 యోహాను 3:4). సుంకరియైన మత్తయిని అపొస్తలునిగా యుండుటకు యేసు పిలిచెను. మత్తయి ఆయన పిలుపు



నంగీకరించి తనయింటిలో గొప్ప విందు నేర్పాటుచేసెను. అది సుంకరులతో నిండియుండెను. తనతో భోజనము నకతడు యేసును ఆహ్వానించెను. దాని నాయన అంగీకరించెను. అప్పుడు శాస్త్రులును పరిసయ్యులును అదిచూచి, "సుంకరులతోను పాపులతోను మీరేలతిని తాగుచున్నారని ఆయన శిష్యులమీద సణగిరి" (లూకా 5:27-30). "అందుకు యేసు - రోగులకే గాని ఆరోగ్యము గలవారికి వైద్యుడక్కర్లేదు మారుమనస్సు పొందుటకై నేను పాపులను పిలువ వచ్చితినిగాని నీతిమంతులను పిలువ రాలేదని వారితో చెప్పెను'' (లూకా 5:31-32). అవును, క్రీస్తు ఈ లోకములో యుండగా పాపులతో కలిసిమెలిసి తిరిగెను.

లూకా 7:36-39లో పరిసయ్యు డొకడు యేసును భోజనమునకు ఆహ్వానించిన సందర్భమును చూడగలము. ఆయన భోజనపంక్తిని కూర్చుండగా పాపాత్మురాలైన యొక స్త్రీ ఒక బుడ్డిలో అత్తరు తీసికొనివచ్చి వెనుకతట్టు ఆయన పాదముల యొద్ద నిలబడి యేడ్చుచు కన్నీళ్లతో ఆయన పాదములు తడిపి, తన తల వెండ్రుకలతో తుడిచి, ఆయన పాదములను ముద్దు పెట్టుకొని ఆ అత్తరు వాటికి పూసెను. ఆయనను పిలిచిన పరిసయ్యుడు అది చూచి- ఈయన ప్రవక్తయైన యెడల తన్ను ముట్టుకొనిన స్త్రీ ఎవతియో, ఎటువంటిదో యెరిగి యుండును; యిది పాపాత్మురాలు అని తనలో తాననుకొనెను. అవును యేసు పాపులతో కలసి మెలిసెను. అతిక్రమము చేయువారిలో ఎంచబడిన వాడాయెను.

"ఒకప్పుడు సమస్తమైన సుంకరులును పాపులును ఆయన బోధవినుటకు ఆయన దగ్గరకు వచ్చుచుండగా, పరిసయ్యులును శాస్త్రులును అదిచూచి - ఇతడు పాపులను చేర్చుకొని వారితో కూడ భోజనము చేయుచున్నాడని చాల సణుగుకొనిరి" యని లూకా 15:1-2లో వ్రాయబడి యున్నది. "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని'' యేసు చెప్పెను (లూకా 19:10). అందువలననే ఆయన పాపుల మధ్య ఎల్లప్పుడు యుండెను. ఆయన ఇద్దరు దొంగల మధ్య సిలువ వేయబడెను. పాపులలో ఒకనిగా సిలువ వేయబడెను. వారిద్దరిలో ఒకనితో, "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను'' (లూకా 23:39-43).

యేసు ప్రభువు ఎవరితో సహవాసము చేసారో, అట్టివారితో స్నేహం చేయుటకు మనం ఇష్టపడము. మన కాలమునాటి పాపులను మనం నిర్లక్ష్యం చేస్తే ఈ లోకానికి సువార్త ఎట్లు ప్రకటించగలము? మనం మనవారితోనే సహవాసం చేయ గోర్తాము. అందువలన సంఘము క్షీణించుచున్నది. సంఘమునకు


వెలుపల యున్నవారికి, లోకస్థులకు సువార్త బోధించాలి. క్రైస్తవులను చేయాలి.

**పాపనివారణకు ఆయన మరణించెను.**

రెండవదిగా, పాపుల పాపములను తీసివేయుటకు యేసుక్రీస్తు సిలువపై మరణించెను గనుక ఆయన పాపుల మిత్రుడు. "నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడినవానిగాను దేవుని వలన బాధింపబడినవానిగాను శ్రమనొందిన వానిగాను మనమతనిని ఎంచితిమి. మన యతిక్రమక్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మనదోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొర్రెలవలె త్రోవతప్పిపోతిమి. మనలో ప్రతివాడు తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనయందరి దోషమును అతని మీద మోపెను'' (యెషయా 53:4-6). ''మనము పాపముల విషయమై చనిపోయి నీతివిషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను" అని పేతురు చెప్పెను (1 పేతురు 2:24). "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను" అని పౌలు చెప్పెను (1 కొరింథీ 15:3). పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనని కూడ అతడు చెప్పెను (1 తిమో 1:15). పాపమును, అపవిత్రతను పరిహరించుటకై తీయబడు ఊటను గూర్చి జెకర్యా 13:1లో చెప్పబడినది. ''ఇమ్మానుయేలు రక్తము ఇంపైనయూటగు, ఓ పాపి యందు మున్గుము పాపంబుపోవును" అనే పాట మనందరం పాడుచుందుము. ఎంత నిజమో! పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు తన రక్తమును చిందించెను (మత్త 26:28). నిజముగా, యేసుక్రీస్తు లోకపాపములను మోసికొనుపోవు దేవుని గొర్రెపిల్లయే!

**మన కొరకు విజ్ఞాపన చేయును**

మూడవదిగా, అతిక్రమము చేయువారిని గూర్చి ఆయన విజ్ఞాపనము చేయును గనుక క్రీస్తు పాపుల మిత్రుడైయున్నారు (యెషయా 53:12). "ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించు చున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడై యున్నాడు" (హెబ్రీ 7:25). మనం పాపము చేసినప్పుడు దేవునికిని మనకును మధ్యవర్తి ఒకరున్నారు. ఆయన క్రీస్తుయేసను నరుడు (1 తిమో 2:5). మనం పాపము చేసినప్పుడు మారుమనస్సు పొంది దేవుని క్షమాపణ నడిగిన యెడల మనలను గూర్చి



యేసుక్రీస్తు దేవుని దగ్గర విజ్ఞాపనము చేయును. "ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు" (1 యోహాను 1:21). "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహాను 1:9).

"సహోదరుని కంటెను ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు" అని సాలొమోను చెప్పెను (సామెతలు 18:24). సాలొమోను చెప్పిన స్నేహితుడు యేసుక్రీస్తే! దయగల మన యేసు ఎంతో గొప్ప మిత్రుడు ! "తన స్నేహితుల కొరకు తన ప్రాణమును పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడు. నేను మీకాజ్ఞాపించు వాటిని చేసినయెడల మీరు నా స్నేహితులై యుందురు" అని యేసు చెప్పెను (యోహాను 15:13-14). యేసు పాపుల మిత్రుడు ! పాపులు ఆయన మిత్రులుగా యుండగోరుదురు.

నీవాయన చిత్తమును జరిగించిన యెడల యేసు యొక్క మిత్రుడవు కాగలవు. తనకు విధేయులైన వారందరికీ ఆయన నిత్యరక్షణకు కారకుడు (హెబ్రీ 5:8-10). మనం ఆయన యందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించుచున్నారు (యోహాను 8:24; లూకా 13:3; మార్కు 16:16). రక్షింపబడి మరణ పర్యంతము నమ్మకముగా యున్న యెడల మనం ఆయనకు మిత్రులుముగా యుండగలము (ప్రకటన 2:10).

– జాన్ స్టేసీ

# మొదటి అబద్ధము, గాని ఆఖరిదికాదు

## ( The First Lie, but not the Last)

- A.L. Franks

నిజక్రైస్తవ్యము ప్రపంచానికి గొప్ప దీవెనకరము. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు దాని కేంద్రబిందువై యున్నారు. మృతులలోనుండి యేసు క్రీస్తు భౌతికంగా సజీవముగా తిరిగి లేచెనను వాస్తవము దాని శక్తియైయున్నది. ఆయన మృతులలో నుండి పునరుత్థానుడైనందున దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడినదని అపొ.పౌలు చెప్పాడు (రోమా 1:7). యేసుక్రీస్తు గనుక తిరిగి లేపబడకపోతే, ఆయన యుగ యుగములు సజీవుడై యుండకపోతే (ప్రక 1:18), క్రైస్తవ్యమని చెప్పబడేది కుప్పకూలిపోవును. దాని విలువ యేమీ లేకపోవును.

ఆత్మావేశ అపొస్తలుడు అది జరుగకపోతే సంభవించే కొన్ని విచారక వాస్తవములు వ్రాసాడు. క్రీస్తుగనుక లేపబడకపోతే, వారుచేయు సువార్తబోధ వ్యర్థము, విశ్వాసము వ్యర్థము, బోధకులు అబద్దసాక్షులవుదురు. విశ్వాసులు ఇంకా తమపాపములలోనే యున్నారు. మరియు క్రీస్తు నందు నిద్రించిన వారును నశించిరి ( I కొరింథీ 15:14-19).అయితే యేసు క్రీస్తు నిజముగా మృతులలో నుండి తిరిగి లేచెనని లేఖనాల్లో పదేపదే బోధింప బడినది. క్రొత్తనిబంధనలోని నాలుగు సువార్తల లేఖకులు యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమును గూర్చిన సవిస్తర వివరములు మనకిచ్చుచున్నారు. మత్తయి ఇట్లు వ్రాసాడు. ఒకదూత స్త్రీలకు కనబడి, "మీరు భయపడకుడి, సిలువవేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును. ఆయన ఇక్కడలేడు; తాను చెప్పినట్టే ఆయన లేచియున్నాడు. రండి ప్రభువు పండుకొనిన స్థలము చూచి, త్వరగా వెళ్లి ఆయన మృతులలో నుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి" అని చెప్పెను (మత్తయి 28:5-7).

కొందరుస్త్రీలు యేసు సమాధి నొద్దకు వెళ్లగా తెల్లని నిలువుటంగీ ధరించుకొనిన యొక పడుచువాడు వారితో, "కలవరపడకుడి సిలువ వేయబడిన నజరేయుడగు యేసును మీరు వెదకుచున్నారు. ఆయన లేచియున్నాడు ఇక్కడలేడు" అని చెప్పెను (మార్కు 16:5-6). ఆదివారము ఉదయముననే యేసు సమాధినొద్దకు వచ్చిన వారితో, "సజీవుడైన వానిని మీరెందుకు మృతులలో వెదుకుచున్నారు? ఆయన ఇక్కడ లేడు. ఆయన లేచియున్నాడని" ప్రకాశవంతమైన ఇద్దరు మనుష్యులు ప్రకటించినట్లు లూకా వ్రాసాడు (లూకా 24: 5-6).

పేతురును, యేసు ప్రేమించిన శిష్యుడును ఆదివారము ఉదయముననే యేసు యొక్క సమాధి ఖాళీగాయుండుట కనుగొనినట్లు యోహాను వ్రాసాడు (యోహాను 20:1-10). సజీవుడైన క్రీస్తును గూర్చి క్రొత్త నిబంధన ఖచ్చితముగా బోధించుచున్నది. ఆయన మృతిజెందెను. గాని మరెన్నడును మృతిజెందకుండునట్లు సజీవుడై తిరగి లేచెను. క్రొత్త నిబంధన అంతటిలోను పునరుత్థానుడైన క్రీస్తును చూచిన వందలాది సాక్షులు మనకు కనబడతారు (I కొరింథీ 15వ అధ్యాయము చదువుము). ఇస్కరియోతు యూదా స్థానమును భర్తీచేయుటకు అపొస్తలుడుగా యుండ తగినవాడు, క్రీస్తు పునరుత్థానము యొక్క సాక్షియై యుండవలెను (అపొ.కా. 1:22).

క్రైస్తవ్యము త్వరితగతిని వ్యాపించిన విధానాన్ని బట్టి శతాబ్దముల తరబడి ప్రజలు ఆశ్చర్యపోయారు. అయితే యేసుక్రీస్తు పునరుత్థానము యొక్క వాస్తవమును గమనించిన యెడల దానిని విశ్వసించిన యెడల సువార్త వర్తమానములో అంతశక్తి ఎందుకు వున్నదో మనం గ్రహించుకోగలము. అది మొదట "యెరుషలేములోను, తరువాత యూదయ, సమరయలోను, భూదిగంతముల వరకును" అతి త్వరితముగా వ్యాపించెను. (అపొ.కా. 1:8). తదుపరి ఆకాశము క్రిందనున్న సర్వ సృష్టికి అది ప్రకటింపబడెను (కొలస్స 1:23).

క్రీస్తును బోధించుటలో ఆయన పునరుత్థానవే ముఖ్యమని మనం గమనించినప్పుడు, ఆయన నిజముగా తిరిగిలేచెనని గ్రహించినప్పుడు, మొదటి నుండియు కూడ సిలువ యొక్క శత్రువులు పునరుత్థానమమును ఎందుకు కాదనుచున్నారోకూడ మనము గుర్తించగలము (మత్తయి 28:12-15). ప్రజలు యేసుక్రీస్తును, ఆయన పునరుత్థానమును నమ్మకుండుటకు వారు గొప్పగా ప్రయాసపడుదురు!

గనుక విశ్వాసుల హృదయములలో సంశయములను రేకెత్తించి, క్రీస్తునుండి దూరము చేయ ప్రయత్నించుచున్న నిర్దేవులు, నాస్తికులు, అన్యమతస్థులు చేయు గందరగోళమును బట్టి మనం అశ్చర్యపడనవసరం లేదు. ఇంకొక మాటలో ప్రజలు దేవుని కుమారుడైన క్రీస్తునందు విశ్వసించి క్రైస్తవులు కాకుండా యుండాలని వీరు ప్రయత్నములు చేయుచున్నారు. క్రీస్తును గూర్చి అనేక అబద్ధములు వారు చెప్పుదురు. క్రీస్తు సమాధిలో ఆయన ఎముకలు దొరికెనని వారు ఒక అబద్ధమును ప్రచారము చేయసాగారు. ఇది మొదటిదేకాదు, చివరిదికూడకాదు. విశ్వాసులను అవిశ్వాసులుగా చేయుటకు అపవాది కట్టుకథలు ఎన్నిటినైన సృష్టిస్తాడు. అయితే నిశ్చయముగా మన ప్రభువు సజీవుడైయున్నారు. ఆయన సమాధి అప్పుడు, ఇప్పుడు ఖాళీగానే యున్నది. యిది వాస్తవం!!

**– A.L. ఫ్రాంక్స్**

# ఒక రాజు బాప్తిస్మము పొందుట
# (The Baptism of a King)

**- Hershel Dyer**

అది క్రీ॥శ 496వ సంవత్సరము. ఫ్రాన్స్ దేశములో రీమ్స్ అనే పట్టణం. ఫ్రాన్స్ దేశ చక్రవర్తియగు క్లోవిస్ క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెనని అతని భార్య క్లోటిల్డా పదే పదే అడుగుచుయుండేది. ఆమెయు, వారి యిద్దరు కుమారులును ఇంతకుముందే బాప్తిస్మము పొంది యుండిరి. పూర్వకాలపు ఫ్రాంకులు (ఫ్రాన్స్ దేశవాసులు) వివిధ దేవతార్చనలు చేయువారు గనుక, క్లోవిస్ చక్రవర్తి తన ప్రజల మతాచారమునుండి మరలుటకు సుముఖత చూపలేదు. అయితే అతని తలంపులలో గొప్ప మార్పు తెచ్చు సంఘటన ఒకటి జరిగెను. అతని శత్రువులగు అలెమానీయులతో యుద్ధము చేయుచుండగా క్లోవిస్ యొక్క సైన్యము యుద్ధభూమిలో ఓడిపోవుచుండిరి. అతని దేవతలకు ఎన్ని ప్రార్థనలు చేసినా, ఫలితములేకపోయెను. తదుపరి అతడు దేవునికి దిగువ ప్రార్థన చేసెను.

"క్లోటిల్డా దేవుని కుమారుడని చెప్పు యేసుక్రీస్తుకు నీవు విపత్తులో యున్నవారికి విజయమునొసగువాడవు; గనుక ప్రభువా నీ సహాయము కొరకు అభ్యర్థించుచున్నాను. నీవు నా శత్రువులపై నాకు విజయము నొసంగిన యెడల, నీ బలశౌర్యమును నేననుభవించుటయేగాక, నా ప్రజలందరికి ప్రకటింతును. నేను నీయందు విశ్వాసముంచెదను, నీ నామమున బాప్తిస్మము పొందెదను". అతని ప్రార్థన ఎట్లున్నా, యుద్ధము అతి త్వరలో అతని పక్షముగా తిరిగెను, క్లోవిస్ రాజు యొక్క సైన్యము విజయంవము సాధింపమొదలిడెను. మరియు అతని శత్రువులు అతనిని రాజుగా ఎంచుకొనిరి. క్లోటిల్డా ఈ సందర్భాన్ని తన కనుకూలముగా మార్చుకొన యత్నించి, రాజు తనకు చేసిన వాగ్దానమును నెరవేర్చవలెననికోరెను. బోధకుని ఒకని ఆమెరప్పించి, రాజుకు రక్షణ మార్గము నుపదేశించెను. వెంటనే అతడు బాప్తిస్మము పొందెను. మొదట్లో అతని అనుచరులను గూర్చిన భయం అంతమాయువైపోయెను. వారంతా "నిత్యసత్యదేవుని వెంబడించుటకు మేము సిద్ధపడి యున్నామని" తెలియజేసిరి. క్రీ॥శ 496 డిశంబరు 25వ తేదీన ఫ్రాన్స్ చక్రవర్తియగు క్లోవిస్ బాప్తిస్మపు చెరువులో దిగి నీటిలో సంపూర్తిగ "పాపక్షమాపణ నిమిత్తము'' ముంచబడెను. అతడు పాపక్షమాపణ కొరకు నిత్యజీవిత నిరీక్షణ కొరకు ముంచబడెను. ఆ రోజు అతనితో కూడ వేలాది ప్రజలు బాప్తిస్మము పొందగా అతడు అమితముగా ఆనందించెను!

- హెర్షల్ డైయర్

ఆయనే నిజముగా రక్షకుడని వారు తెలిసికొనగల్గిరి. ఆ పట్టణములో పౌలు, సీలాలు అన్యజనులకును (గ్రీకులకు, యూదులుకాని వారికి) కూడ సువార్త బోధించిరి. యూదులలో అనేకులును గ్రీసుదేశస్థులైన వారిలో చాలమందియు విశ్వసించిరి (అపొ.కా. 17:12). సువార్త వలన వారందరు సహోదరులైరి (17:14).

థెస్సలోనికలో దానికి భిన్నముగా జరిగెను. అన్యజనులలో అనేకులును, యూదులలో కొందరును అక్కడ సువార్తకులోబడిరి. అన్యజనులు తాము వెంబడించుచున్న మతాచారములను క్రీస్తు సువార్తతో పోల్చుకొన్నప్పుడు, వారు "గొప్ప ఉపద్రవమందు వాక్యము నంగీకరించిరి" ( I థెస్స 1:6). వారు మాసిదోనియలోను అకయలోను విశ్వాసులందరికి మాదిరియైయుండిరి. వారివలన ప్రతి స్థలమందును దేవుని యెడల వారికున్న విశ్వాసము వెల్లడియాయెను. ( I థెస్స 1:7-8). మరియు వారు "విగ్రహములను విడిచిపెట్టి జీవముగల వాడును సత్యవంతుడునగు దేవునికి దాసులగుటకును దేవుడు మృతులలో నుండి లేపిన యేసు పరలోకము నుండి వచ్చునని యెదురు చూచుటకును...వారు యేలాగు దేవుని వైపునకు తిరిగితిరో ఆ సంగతిని వారే తెలియజేయుచున్నారు" ( I థెస్స 1:9-10).

గనుక థెస్సలోనికలో కొందరు యూదులును అన్యజనులలో అనేకులును సువార్త వాక్యమును నిశితముగా పరిశోధించిరి. సువార్తకులోబడుట ద్వారా వారు గొప్పధైర్యమును విశ్వాసమును ప్రదర్శించిరి (గలతీ 3:26-29, ఎఫెసీ 2:11-18). అయినను దేవుని వాక్యమును వారు ఇంకా చదివినేర్చుకొన వలసి యున్నది. థెస్సలోనికలో యున్న క్రైస్తవులకు పౌలు వ్రాసిన మొదటి పత్రికలో వారు, "సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్ట" వలెనని పౌలువారిని హెచ్చరించెను (I థెస్స 5:21).

ఈనాడు అనేక జనాంగములవారు క్రీస్తువైపు తిరుగుచు ఆయనలో ఏకమవుచుండగా గొప్ప సంతోషము కలుగుచున్నది. అయినను మనము కూడ జాగ్రత్తకలిగి మెలకువగా యుండాలి. మనం వినుచున్న బోధలన్నిటిని దేవుని వాక్యమును బట్టి పరిశోధించాలి. అవి సత్యమో కాదో పరీక్షించాలి. మానవకల్పిత బోధలవలన మనము క్రీస్తు నుండియు నిత్యజీవమునుండియు తొలగిపోకుండా చూచుకోవాలి (I, కొరింధి 10:12; 9:27; హెబ్రీ 2: 1-4; 3:12-14).

- రోయస్ ఫ్రెడరిక్

# నీవు అక్కడ వున్నావా?

## (Were you there?)

- Owen D. Olbricht

యేసు ప్రభువు పునరుత్థానుడైనప్పుడు వారక్కడ లేనందున తాము పునరుత్థానము నంగీకరించడము లేదని కొందరు చెప్పుదురు. యిది మంచి లాజిక్‌గా వినబడవచ్చును గాని అట్టివారిని మనం కొన్ని ప్రశ్నలడుగవలసి వస్తాది. "నీవు వ్యక్తిగతంగా చూచిన సంగతులనే నమ్ముదువా?" అని మనం అడుగవలసి యున్నది.

అట్లయితే నీవు జన్మించినట్లు నీవు నమ్మలేవు, నీతలిదండ్రులెవరో, నీతాతముత్తాత లెవరో నమ్మలేవు. నిజానికి మనం యదార్థమని నమ్మే వాటిలో చాల మట్టుకు మనం అక్కడున్నామని గాక, మనం నమ్మదగిన సాక్షుల మాట చొప్పున వాటిని యదార్థమని మనం అంగీకరిస్తాము.

**సాక్షులు**

యేసుక్రీస్తు మృతులలో నుండి



లేవగా చూచినవారి సాక్ష్యమును బట్టి మనం క్రీస్తు యొక్క పునరుత్థానమును నమ్ముచున్నాము. ఈ రోజు ఆ సాక్షుల యొక్క సాక్ష్యము యదార్థమని దిగువ కారణములను బట్టిమనం అంగీకరించ గలము. వారు మత్తయి, యోహాను, పౌలు, పేతురు మొదలగువారు.

**1. సాక్షుల యొక్క గుణగణములు :** మనకు తెలిసినంతవరకు వారందరు సత్ప్రవర్తనగలవారు,

**2. సాక్షుల సంఖ్య :** ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటను యదార్థమని అంగీకరించవచ్చని పాత నిబంధన చెప్పియున్నది. యేసుప్రభువు తిరిగిలేచిన తరువాత 11 మంది అపొస్తలులు ఆయనను చూచిరి, మరియు ఎమ్మాయు మార్గములో మరి యిద్దరు శిష్యులు ఆయన చూచిరి, తదుపరి కొందరు స్త్రీలును, యోసేపు బర్సబ్బాయును, 500 మంది శిష్యులును ఆయనను చూచిరి.

**సాక్షుల యొక్క స్థిరత్వము :** వారి వ్రాతలన్నిటిలోను ఈ సాక్షులందరు దృఢముగా, యథార్థముగా యుండిరి

**సాక్షుల ఏకీభావము :** సువార్తలలో కొన్ని సంగతులు ఏకీభవించుట లేనట్లుగు పడుచున్నను, వాటిని జాగ్రత్తగ చదివిన యెడల అదంతయు మటుమాయమగును.

**సాక్షుల యొక్క కనుచూపు సాక్ష్యము :** యేసు ప్రభువు పునరుత్థానుడైన తరువాత ఆయనను తన కండ్లతో చూచిన వారు ఆయనను గూర్చి వ్రాసిరి.

**సాక్షుల యొక్క నమ్మకత్వము :** వారు హింసింపబడినను, చంపబడినను సాక్షులు తమ సాక్ష్యమును ఎన్నడు కాదనలేదు, పునరుత్థానమును వారెన్నడు కాదనలేదు.

**ముగింపు :** "ఈ యేసును దేవుడు లేపెను; దీనికిమేమందరము సాక్షులము" "కాగా ఆయన దేవుని కుడిపార్శ్యమునకు హెచ్చరింపబడియున్నాడు....." (అపో.కా. 2: 32-33). "ఆయన బలాతిశయము చేత క్రీస్తును మృతుల నుండి లేపి, సమస్తమైన ఆధిపత్యము కంటెను అధికారము కంటెను శక్తికంటెను ప్రభుత్వము కంటెను ఈ యుగమందు మాత్రమేగాక రాబోవు యుగము నందును పేరుపొందిన ప్రతి నామము కంటెను ఎంతో హెచ్చుగా పరలోకము నందు ఆయనను తనకుడిపార్శ్వమున కూర్చుండ బెట్టుకొని యున్నారు." (ఎఫెసీ 1:20).


– ఓవెన్ ఆల్బ్రిక్



# "నీ శత్రువులు చెదరిపోవుదురుగాక"

# (Let your Enemies be scattered)

**- Loy Mitchell**



"యెహోవా లెమ్ము; నీశత్రువులు చెదరిపోవుదురు గాక, నిన్ను ద్వేషించువారు నీ యెదుటనుండి పారిపోవుదురుగాక యనెను" (సంఖ్యా 10:35).

మోషే ఈ మాటలనెందుకు పలికెను? బాగా శిక్షణపొందిన సైన్య సమూహమునకు అతడు న్యాయకత్వము వహించెనా? వారియొద్ద అత్యాధునిక యుద్ధసామగ్రియున్నదా? అట్లు కానేకాదు, దేవుని యొక్క విశ్వాస్యతను బట్టి విజయం తథ్యమని మోషేఎరుగును! ఐగుప్తులోని సత్యము నుండి దేవుడు వారిని విడిపించారు. ఇశ్రాయేలీయులు తమ శత్రువులను ఓడించెదరని మోషేకు నమ్మకమున్నది. తమ శత్రువులు ఓడిపోవుదురు, చెదరిపోవుదురు, పారిపోవుదురు. దేవుడు వారితో యున్నందున కానాను ఇశ్రాయేలీయులకు ఇయ్యబడును.

బైబిలు చరిత్ర అంతటిలోను నీతిమంతుల యొక్క విజయాన్ని గూర్చి

మనం పదేపదే చదువుతాము. దేవుని ప్రజల యొక్క శత్రువులు అపజయం పాలవుదురు! ఎందువలన? శత్రువును జయించుట దేవుని యందలి మన విశ్వాసముపై ఆధారపడియున్నది. అది దేవునిపై ఆధారపడియున్నది. “దేవుడు లేచునుగాక. ఆయన శత్రువులు చెదరిపోవుదురుగాక, ఆయనను ద్వేషించువారు ఆయన సన్నిధి నుండి పారిపోవుదురుగాక” (కీర్తన 68:1). ఆయన “తన పరిశుద్ధాలయమందుండు దేవుడు. తండ్రిలేని వారికి తండ్రియు విధవరాండ్లకు న్యాయ కర్తయునై యున్నాడు.” (కీర్తన 68:5). అందును బట్టి మనము దేవునికి స్తోత్రగీతములు పాడ బద్ధులమైయున్నాము.

అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడు సర్వశక్తిగల దేవుడు. ఆయన గొప్ప సైన్యములను ఓడించారు. ఆయన ప్రజలేమి చేయాలి? “భూ రాజ్యములారా, దేవుని గూర్చిపాడుడి, ప్రభువును కీర్తించుడి” (కీర్తన 68:32). “దేవునికి బలాతిశయము నారోపించుడి, మహిమోన్నతుడై ఆయన ఇశ్రాయేలు మీద ఏలుచున్నాడు. అంతరిక్షమున ఆయన బలాతిశయమున్నది. తన పరిశుద్ధస్థలములలో దేవుడు భీకరుడు. ఇశ్రాయేలు దేవుడే తన ప్రజలకు బలపరాక్రమముల ననుగ్రహించు చున్నాడు. దేవుడు స్తుతి నొందునుగాక” (కీర్తన 68:34-25).



శత్రువు మనకంటె అత్యధిక సంఖ్యలో యున్నాడని నేడు మనం భయపడ నవసరం లేదు. ఈలోక జనాభాలో క్రైస్తవులు అల్ప సంఖ్యాకులని భయపడనవసరం లేదు. మనం దేవుని యందు నమ్మకముంచి ఆయన చిత్తము నకు లోబడినప్పుడు మన శత్రువులు చెదరిపోవుదురు. అవును కొన్ని క్లిష్ట సమస్యలు, కాలములు వచ్చునుగాని దేవుడు వాటిని మనం జయించునట్లు సహాయం చేయును, గనుక అనుదినం మనము ఆయనకు విధేయులమవుచు, ప్రతి తరుణములోను ఆయనను కీర్తించుదుము గాక!

- లోయ్ మిఛెల్



# ఇది నిజమా?
## ( Is it True?)

**- John Harris**

ఇదొక ప్రాముఖ్యాంశము, గనుక దీనిని మీరు గమనించగోర్తాను. తండ్రియైన దేవునికి యేసుప్రభువు ప్రార్థిస్తూ "నీ వాక్యమే సత్యమని" చెప్పారు (యోహాను 17:17). "సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయునని" కూడా ఆయన చెప్పారు (యోహాను 8:31). దేవుని గూర్చియు, క్రీస్తును గూర్చియు, పరిశుద్ధాత్ముని గూర్చియు, మానవుని రక్షణను గూర్చియునైన సత్యమును గూర్చి యేసు ప్రభువు అట్లు పలికారు. ఆయన వ్యవసాయం, వ్యాపారం మొదలగు వాటిని గూర్చి మాట్లాడలేదు.

సత్యం స్వయం విరుద్ధముకాదు. సత్యము ఏకైకమైనది. ఖచ్చితమైనది. సత్యం మార్పును ఎన్నడు సహించదు. సత్యం విషయములో ఏ ప్రశ్నకు రెండు సమాధానములుండవు. సత్యము విషయంలో రాజీపడితే పాపము. సగం సత్యం ప్రమాదకరం.

ఇప్పుడు కొన్ని ప్రశ్నలడుగుదాం. దేవుడు లేడనునది నిజమా? దేవుడు లేడని కొందరను కొనుచున్నారనునది నిజమా యని నేనడుగలేదు. కొందరట్లు చెబుతారు. అది నాకు తెలుసు. అయితే దేవుడు లేడనునది నిజమా? హెబ్రీపత్రిక లేఖకుడిట్లు చెప్పాడు. "దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడని నమ్మవలెను" (హెబ్రీ 11:6). దీన్నిబట్టి మనం దేవునియందు విశ్వాసముంచుట అత్యవసరం. "నా విమోచకుడు సజీవుడనియు ఆయన భూమి మీద నిలుచుననియు నేనెరుగుదునని" యోబు చెప్పాడు (యోబు 19:25). నేను ఊహించు చున్నానని యోబు చెప్పలేదు. గాని నేనెరుగుదునన్నాడు. "అతిశయించు వాడు దేనిని బట్టి అతిశయింపవలెననగా, భూమి మీద కృప చూపుచు నీతి న్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనేయని గ్రహించి నన్ను పరిశీలనగా తెలిసి కొనుటను బట్టియే అతిశయింప వలెనని" యిర్మియా 9:24లో దేవుడు చెప్పారు. "నేను నమ్మిన వానిని ఎరుగుదును గనుక సిగ్గుపడను; నేను ఆయనకు అప్పగించిన దానిని రాబోవుచున్న ఆ దినము వరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొను చున్నాను" అని అపొ.పౌలు చెప్పాడు (2 తిమో 1:12). "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" అని కీర్తనలు 14:1

చెప్పుచున్నది. అందువలన సత్యవాక్యమైన దైవవాక్కును బట్టి దేవుడున్నాడు!

మానవుని దేవుడు సృజించలేదు గాని పరిణామ క్రమమును బట్టి మానవుడు ఉద్భవించాడని కొందరు నిర్దేవులు తలుస్తారు. ఇది నిజమా? దేవుని వాక్యమైన బైబిలు దీనిని బోధించుచున్నదా? ఆది.కా. 2:7లో, "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మాయెను" అని చెప్పబడియున్నది. "నీ చేతులు నన్ను నిర్మించినాకు రూపు ఏర్పరచెను" అని కీర్తనలు 119:73లో వ్రాయబడియున్నది. "నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా నాకు భయమును ఆశ్చర్యమును పుట్టుచున్నవి" యని కీర్తన 139:14 చెప్పుచున్నది. "యెహోవాయే దేవుడని తెలిసికొనుడి; ఆయనే మనలను పుట్టించెను, మనము ఆయన వారము" (కీర్తన 100:3). దేవుడు మానవుని సృజించుటయేగాక, ఆయన అతనికి జ్ఞానమును వివేకమును అనుగ్రహించి నిత్యము జీవించు ఆత్మననుగ్రహించెను (మార్కు 8:36).

మానవుని ఆత్మను రక్షించుటకు దేవుడు తన వాక్యమును కూడ అనుగ్రహించెను. "లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీక రించుడి" (యాకోబు 1:21). సత్య వాక్యమైన దేవుని వాక్యము మానవుల ఆత్మలకు అత్యవసరము.

దేవుని వాక్యము లేకుండగనే మానవులు రక్షింపబడగలరని కొందరు చెబుతారు. అది నిజమా? దేవుని రాజ్యము యొక్క విత్తనము దేవుని వాక్యమని చెప్పబడింది (లూకా 8:11). దేవుని వాక్యము విత్తబడని చోట క్రైస్తవులుండరు. దేవుని వాక్యము లేకుండగనే మానవులు రక్షింపబడుట సాధ్యమైతే దానిని బోధించే బోధకులుండుట అనవసరం: బోధించడం మానివేస్తే ప్రజలు క్రైస్తవు లవుతారు! అయితే అట్లు తలంచడం బుద్ధిహీనతయే. వాక్యోపదేశము జరుగకుండగనే మానవులు క్రైస్తవులుగా మారగలిగితే, సువార్తికులు ఖండాంతర యానములు చేసి ప్రయాసపడవలసిన పని యేమున్నది? అయితే రోమాలో యున్నవారికి కూడా సువార్త అవసరమని పౌలుకు తెలుసు (రోమా 1:16). సువార్తను ప్రకటించుము అని అతడు తిమోతిని హెచ్చరించాడు (2 తిమో 4:2). పెంతెకొస్తు నాడు పేతురు ప్రకటించిన సువార్త వాక్యము ద్వారా ఇంచు మించు మూడువేల మంది క్రైస్తవులుగామారారు (అపొ.కా. 2:41). అట్టి వారిని ప్రభువు తన సంఘముతో చేర్చుకొన్నారు (అపొ.కా 2:47) యిది నిజము !

– జాన్ హేరిస్

# పరిశుద్ధ గ్రంథ పఠనము
## ( Bible Study)

- E.K.V. Prasadrao




మన జీవమునకు, భక్తికి కావలసిన సంపూర్ణ నియమము లేఖనముల యందు భద్రపరచబడి యున్నది. దైవావేశము వలన కలిగిన పరిశుద్ధ లేఖనాలే దేవుని మాటలు. సత్యమును గ్రహించుటకు, అబద్ధ బోధలను ఎదుర్కొనుటకు, రక్షణ సంకల్పాన్ని లోకానికి అందించుట కొరకు, సంఘ క్షేమాభివృద్ధి కొరకు బైబిలును చదివి అందలి ఆజ్ఞలను మనం అనుసరించ వలసియున్నది.

బైబిలు చదువుట మరియు ధ్యానించుటలో ఉన్న ఆశీర్వాదాలు పాత నిబంధనలో సహితం చదువగలం. ఎవరైతే యెహోవా ధర్మశాస్త్రమును దివారాత్రులు ధ్యానించుదురో వారు నీటికాలువల యోరను నాటబడినదై, తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుందురని, వారు చేయునదంతయు సఫలమగునని కీర్త 1:2-3 నందు వ్రాయబడింది. మనకు కార్యసిద్ధి కలుగునట్లు దేవుని వాక్యమును ధ్యానించాలని దీని భావము.

యేసుక్రీస్తు "తన వాడుక చొప్పున విశ్రాంతి దినమందు సమాజ మందిరము లోనికి వెళ్లి చదువుటకై నిలుచుండగా,

# దేవుడు హృదయమును ఎట్లు తెరచును?
## (How does the Lord open the Heart?)

**- Mike Benson**



“అప్పుడు లూదియ యను దైవభక్తి గల స్త్రీ వినుచుండెను. ఆమె ఊదా రంగుపొడిన అమ్ము తుయతైర పట్టణ స్థురాలు. ప్రభువు ఆమె హృదయమును తెరచెను. గనుక ప్రభువు చెప్పిన మాటల యందు లక్ష్యముంచెను” అని అపో.కా 16:14లో వ్రాయబడియున్నది. అయితే ప్రభువు ఒకని హృదయమును ఎట్లు తెరచును? అనునది మన ప్రశ్న.

**1. ఇక్కడ హృదయము అనుమాట లూదియ యొక్క గ్రహణశక్తిని సూచించుచున్నది :** ఒకడు వాక్యమును వినుచున్నపుడు అతడు లేక ఆమె ఆలోచించును, (మత్తయి 9:4; హెబ్రీ 4:12), గ్రహించును (మత్తయి 13:15), యోచించును (మార్కు 2:6), విశ్వాసించును (యోహాను 12:40; రోమా 10:10) అని లేఖనములు తెలియజేయుచున్నవి. అందునుబట్టి పరిశుద్ధాత్మావేశమువలన లూకా లూదియ యొక్క హృదయము తెరువ బడెనని వ్రాసినప్పుడు ఆమె వినిన వాక్యమును గ్రహించుకొనెనని తెలియజేయుచున్నాడు (లూకా 24:45


; అపొ.కా. 26:18); ఆమె సువార్త నంగీకరించుటకు సుముఖముగా యుండెను (అపొ. 8:6, 12; హెబ్రీ 12:1,2). ఎఫెసీ 1:18 లో "మీ మనో నేత్రములు వెలిగింపబడినందున" అను మాట యున్నది. అనగా మీ విజ్ఞతను బట్టి గ్రహించుకొనినందునయని దాని యర్థము.

**2. లూదియ యొక్క గ్రహణశక్తిని ప్రభువు సత్యము వలన తెరిచారు.** (రోమా 16: I కొరి 15:1,2; యాకో 1:12). యేసే రక్షకుడని లూదియ అంగీకరించు నట్లు సత్యము అన్ని అభ్యంతరములను నిర్మూలించెను. అదేరీతిగా ప్రభువు మన హృదయములను తెరచును (లూకా 18:15). నేడు కూడా అదే పద్ధతిని ఆయన వినియోగించుచున్నారు (2 థెస్స 2:13,14; కీర్త 119:104, 105, 130; 19:7; యోహాను 6:63, 8:31, 32).

**3. లూదియ వాక్యమును వినుటకును, విధేయత చూపుటకును నిరాకరించిన యెడల ఆమె హృదయమును మూసివేసికొనెనని చెప్పుకొనవచ్చును.** ఈ వచనమును గమనించుము: " నేటి వరకును మోషే గ్రంథము వారు చదువునప్పుడెల్ల ముసుకు వారి హృదయముల మీద నున్నది గాని వారి హృదయము ప్రభువైపునకు ఎప్పుడు తిరుగునో అప్పుడు ముసుకు తీసివేయబడును" (2 కొరింథీ 3:15-16).

ప్రభువు లూదియ యొక్క హృదయమును తెరచెను అనగా, గతములో ఏదో ఒక విధముగా ఆమె హృదయము మూసికొనియుండెనను అర్థము వచ్చుచున్నది. పాప జీవితము వలన ఆమె హృదయము గట్టిబడిపోయి మూసుకొని యుండలేదు, ఏలయనగా ఆమె దేవుని ఆరాధించడములో ఆసక్తిపరు రాలియైయుండెను. భక్తిగల యూదురాలి యొక్క హృదయమువలె ఆమె హృదయముకూడ క్రీస్తు విషయమై మూసుకొనియుండెను. అనేకులైన యూదులు యేసు విషయమైన సత్యమును గ్రహించక తమ హృదయములను కఠినపరచుకొని యుండిరి. ఆయన వారికి అడ్డుబండగా యుండెను (యోహా 15:44, I కొరి 1:23). అయితే లూదియ క్రీస్తును గూర్చిన సత్యవాక్యము పౌలు ద్వారా వినగా ఆమె గ్రహించుకొని, దానిని స్వీకరించి బాప్తిస్మము పొంది క్రైస్తవురాలయ్యింది. ఇవ్విధముగా దేవుడు లూదియ యొక్క హృదయమును తెరచెను.

– మైక్ బెన్సన్



# రక్షణ, దేవుని ఉచితవరము
## (Salvation, God's Free Gift)

**- Gordon Hogan**

రక్షణ గూర్చిన సత్యమును తెలిసికొనుట ప్రాముఖ్యము. ఈ విషయంలో అసత్యము నంగీకరించిన యెడల అపవాదితోను వాని దూతలతోను మనం నిత్య నరకమనుభవింపవలసి వచ్చును. గనుక యిది జీవన్మరణముల సమస్య.

యేసుక్రీస్తు యొక్క పునరుత్థానము తరువాత మొదటి పెంతెకొస్తు పండుగ నాడు యూదులు యెరుషలేములో గుమికూడి యుండిరి. అయితే వారు చిరకాలము నుండి ఎదురుచూచుచున్న మెస్సీయానే వారు చంపించిరనే సత్యాన్ని వారు ఎదుర్కొనవలసి వచ్చినది. ఈ వాస్తవము వలన వారు కలవరబడిరి. "సహోదరులారా, మేమేమి చేతుమనే" సరియైన ప్రశ్నను వారడిగిరి (అపొ.కా. 2:37).

సరియైన జవాబుకొరకు సరియైన ప్రశ్నలనడగాలి. ఈ యూదులు యేసుక్రీస్తు దేవుని కుమారుడనే సత్యాన్ని అంగీకరించిన తరువాత సరియైన ప్రశ్ననడిగారు. పరిశుద్ధాత్మ ప్రేరణవలన పేతురు, "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు"అని వారికి చెప్పాడు (అపొ.కా. 2:38). మరల "మీరు మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణ పొందుడని వారిని" అతడు హెచ్చరించెను (40వ). ఆ దినమందు ఇంచుమించు మూడు వేలమంది బాప్తిస్మము పొందిరి.

ఒకడు నశించిన స్థితితో యున్నాడనే సంగతి గ్రహిస్తేనే గాని ఎవడును రక్షింపబడగోరడు. మనం యేమిచేసినా, చేయకపోయినా దేవుడు మనలను రక్షిస్తాడని అపవాది అనేకులను మోసగించుచున్నాడు. యిది దుర దృష్టకరము. ఒక్క క్షణం ఆగి దీనిని ఆలోచించు. యిది అవునా? కాదా?

పాపము వలన మానవుడు దేవుని నుండి వేరు చేయబడియున్నాడు. దానిని పౌలు ఇట్లు విశదీకరించుచున్నాడు: " అట్టివారు సమస్తమైన దుర్నీతి చేతను, లోభము చేతను, ఈర్ష్యచేతను నిండుకొని మత్సరము, నరహత్య కలహము కపటము వైరమను వాటితో నిండిన వారై కొండెగాండ్రును అపవాదకులును దేవద్వేషులును, హింసకులును,

అహంకారులును, బింకములాడువారును చెడ్డవాటిని కల్పించు వారును, తలిదండ్రులక విధేయులును అవివేకులును మాటతప్పు వారును, అనురాగ రహితులును నిర్దయులునైరి. ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అనుదేవుని న్యాయవిధిని వారు బాగుగ ఎరిగి యుండియు వాటిని చేయు చున్నారు" (రోమా 1:29-32). ఈ లిస్టులో మనందరం ఎక్కడో ఒకచోట ఉండి యుంటాము. అయితే అట్టి క్రియలు చేయు వారందరు మరణమునకు పాత్రులు.

దేవుని మహోచిత కృపవలన మన పరలోకపు తండ్రి తన కుమారుని ద్వారా మనందరికీ రక్షణ ననుగ్రహించు చున్నారు. మనలను రక్షించు నిమిత్తము యేసుపరలోకమందలి తన గృహమును వీడి మనకొరకు వచ్చారు.

యేసు పాపులను రక్షించుటకు ఈలోకమునకు వచ్చెననునది గొప్ప సత్యము ( I యోహాను 1:15).

"ఆయన మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండ వలెనని యిచ్ఛయించుచున్నారు ( I తిమో 2:4).

మన నిత్యరక్షణ కడవరి కాలమందు బయలుపరచబడును (I పేతురు 1:5).


''మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏనామమున రక్షణపొందలేము'' (అపొ.కా 4:12).

ఈ రోజే రక్షణదినము. '' అనుకూల సమయమందు నీ మొర నాలకించితిని; రక్షణ దినమందు నిన్ను ఆదుకొంటిని అని ఆయన చెప్పుచున్నాడు గదా. ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2 కొరింధీ 6:2).

**రక్షణ ఉచితము :** ''మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే" (ఎఫెసీ 2:8). అయితే ఈ ప్రశస్తవరమును గూర్చి దేవుడు ఎవరిని బలవంతము చేయడు. విధేయత చూపుట ద్వారా ఈ రక్షణ వరమును మనం స్వీకరించాలి.

"నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షించబడును, నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని యేసు చెప్పెను (మార్కు 16:16).

– గోర్డన్ హోగన్



# అబానాయును, ఫర్పరును
## (Abanah and Pharpar)

**- Sunny David**

అబానాయును ఫర్పరును దమస్కులోని రెండు నదులు. 2వ రాజుల గ్రంథము 5వ అధ్యాయములో మన కగుపడు నయమాను అను సిరియా దేశపు సైన్యాధిపతి ఇశ్రాయేలు దేశములో యున్ననదులన్నిటికంటే ఈ రెండు నదులు శ్రేష్టమైనవని తలంచాడు.

నయమాను మహాపరాక్రమ శాలియై అతడు తనయజమానుని దృష్టికి ఘనుడై దయపొందినవాడయెనని బైబిలు చెప్పుచున్నది (2 రాజు 5:1). గాని అతడు కుష్టరోగి ! అయితే ఇశ్రాయేలు దేశము నుండి చెరగొనిన ఒక చిన్నది నయమాను యొక్క కుష్టరోగమును బాగుచేసే దైవజనుడొకడు తన దేశములో యున్నాడని వానికి తెలియజేసింది. వెంటనే సమయమును పోనీయకుండా అతడు తన గుర్రములు, రథము వెంటబెట్టుకొని ఇశ్రాయేలు దేశమునకు వచ్చెను. అతడు ప్రవక్త యింటి దగ్గరకు రాగా, నయమాను యొక్క గర్వము నణుచుటకును, తనను బాగుచేయువాడు దేవుడే గాని మానవుడు కాదని నేర్పించుటకును, ప్రవక్త తన యింటిలో నుండి సయితము బయటికి రాకుండా, నయమాను యోర్దానునదికి పోయి ఏడుమారులు మునిగిన యెడల అతని కుష్ట రోగము పోవునని కబురు పంపెను.

ఈ మాటవిని నయమాను బహురౌద్రుడై తిరిగి వెళ్లిపోవుటకు నిశ్చయించు కొని, "దమస్కునదులైన అబానాయును, ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదులన్నిటికంటే శ్రేష్టమైనవి కావా? వాటిలో స్నానము చేసిశుద్ధి నొందలేనా" యని తిరిగి వెళ్లిపోవు చుండెను. అయితే మార్గములో అతని సేవకులలో ఒకడు అతని శాంతింప జేసి యోర్దానులో ఏడుమారులు మునుగుటకు అతనికి ఒప్పించెను. నయమాను యోర్దాను నదికి వచ్చి ప్రవక్త చెప్పినట్లు ఏడుమారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను,

నయమాను ఆ రోజు నేర్చుకొనిన గొప్పపాఠము యేమంటే, దేవుడు ఏదైనా చెప్పియుంటే, దాని స్థానములో ఇంకొకటిమనము చేయరాదు. దేవుడు తన ప్రవక్త ద్వారా యోర్దాను అన్నపుడు ఆయన అబానాయు ఫర్పరును అని అనలేదు. నోవహు చితిసారకపు

మ్రానుతో ఓడను నిర్మించుమని దేవుడు చెప్పినప్పుడు నోవహు అట్లు చేసెను. దేవుడతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తుచేసెను" (ఆది కా6 :22). మరల "పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధకలుగుటకై వ్రాయబడి యున్నవని బైబిలు చెప్పుచున్నది (రోమా 15:4).

మనము ఈ నాడు నేర్చుకోవలసిన పాఠంయేమంటే మనం దేవుని వాక్యాన్ని మార్చకూడదు, దానికి కలుపకూడదు, దాని స్థానముననే వేరొకదానిని ఉంచకూడదు. (ప్రకట 22:18-19). ఉదాహరణకు "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అని మార్కు 16:16 చెప్పుచున్నది. దానిని మనం సరిగ్గానే అర్థము చేసికొనగలము. అంటే రక్షించబడాలంటే ఒకడు నమ్మాలి, బాప్తిస్మము పొందాలి.

నమ్మిబాప్తిస్మము పొందినపుడు రక్షింపబడునని యేసు చెప్పినప్పుడు ఆయన పసిబడ్డలను గూర్చి ఆ మాటలు చెప్పలేదు. పసిబిడ్డలు నమ్మలేరు గనుక వారికి ఈ యాజ్ఞ వర్తించదు. బాప్తిస్మము పొందుట అనగా నీటిలోముంచబడుట, అది చిలకరింపు, కుమ్మరింపుకాదు. 'బాప్టిజో' అను గ్రీకు పదమునకు సంపూర్తిగా ముంచుట లేకపాత పెట్టుటయని అర్థము. కొలస్స 2:12లో "మీరు బాప్తిస్మమందు ఆయనతోకూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతోకూడ లేచితిరి" యని పౌలు చెప్పాడు.

మొదట్లో నయమాను దేవుని ఖచ్చితమైన, తేలికయైన ఆజ్ఞను ఎట్లు నిరాకరించాడో, అట్లే అనేకులు సువార్తయిచ్చు తేలికయైన ఆజ్ఞలను నిరాకరించుచున్నారు. బాప్తిస్మము పొంది పాపము నుండి శుద్ధులగుటకు నిరాకరించుచున్నారు. గాని దేవుడు చెప్పినట్లు చేస్తే మంచిదని నయమానుకు తన సేవకుడు బోధించగా, అతడు దేవుని మాటలకులోబడి శుద్ధుడయ్యాడు. అదే రీతిగా నేడు మీరును యేసు ప్రభువును నమ్మి, బాప్తిస్మము పొందితే మీరును రక్షింపబడగల్గుదురు.

– సన్నీదేవిడ్



# పాపియొక్క ప్రార్థన
## (A Sinner's Prayer)

- Owen Olbricht

క్రైస్తవులు కాని వారి కోరికలను తీర్చుదునని దేవుడు వాగ్దానము చేయలేదు. కొన్ని ప్రార్థనలకు దేవుడు సానుకూలముగా జవాబీయడని లేఖనములు తెలియజేయుచున్నవి. "నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును" (కీర్తన 66:18). "వాని మీద భక్తిహీనుని అధికారిగా నుంచుము, అపవాది వాని కుడి ప్రక్కకు నిలుచును గాక. వాడు విమర్శలోనికి తేబడునపుడు దోషియని తీర్పునొందును గాక, వాని ప్రార్థన పాపమగుగాక" (కీర్తన 109:6-7). "ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించుకొను వాని ప్రార్థన హేయము (సామెత 28:9). "ప్రభువు కన్నులు నీతిమంతులు మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనలవైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడు చేయు వారికి విరోధముగా ఉన్నది" (I పేతురు 3:12; కీర్త 34:15-16).

### మనమడుగునది పొందవలెనంటే....

1. మొదటిగా ఆయన నామమును బట్టి పిలువబడు దేవుని ప్రజలుగా యుండాలి (2 దినవ 7:14). 2. ఆయన నామమును బట్టి అడగాలి (యోహాను 14:13). 3. విశ్వాసముతో అడగాలి (యాకోబు 1:6-7). 4. సరియైన సంగతుల నడగాలి (యాకో 4:3), 5. దేవుని ఆజ్ఞలను పాటించాలి. ఆయన కిష్టమైన సంగతులు చేయాలి (I యోహా 3:22), 6. ఆయన చిత్తప్రకారము అడగాలి (I యోహా 5:14). క్రైస్తవులు కాని వారు దేనినైనా అడుగవచ్చని ఎక్కడా చెప్పబడలేదు.

### పెంతెకొస్తు నాటి ప్రజలు

పెంతెకొస్తు దినమున పేతురు ప్రసంగమును విన్నవారు తమ పాపక్షమాపణ నిమిత్తము ప్రార్థించాలని చెప్పబడలేదు. యోవేలు 2:32లో చేయబడిన ప్రవచనమును పేతురు ఆనాడు ఎత్తి చెప్పుచు ప్రభువు నామమును బట్టి ప్రార్థించువాడు రక్షింపబడునని చెప్పాడు. ఈ మాటలు 'ఎపికలియో' అనుగ్రీకు పదము నుండి తర్జుమా చేయబడెను. 'ఎపికలియో' అనగా ఒక నామమును బట్టి అడుగుడి యని అర్థము; విజ్ఞాపన చేయుట యని అర్థము (అపో.కా 1:23: 7:59, 25:11,12, 28:19). గనుక ప్రభువు నామమును బట్టి సింపుల్‌గా విజ్ఞాపన

చేయువారు రక్షింపబడిపోరుగాని తండ్రి చిత్తము జరిగించువారే రక్షింపబడుదురు (మత్తయి 7:21; లూకా 6:46).

"అయ్యలారా మేమేమి చేయాలి?" యని యూదులు పేతురును మిగిలిన అపొస్తలులను అడిగినప్పుడు, వారందరు ప్రార్థన చేస్తే చాలని పేతురు చెప్పలేదు. (అపొ.కా. 2:37). సరిగదా, "మీరు మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తునామమున బాప్తిస్మము పొందుడి" యని చెప్పాడు (అపొ.కా 2:38). పౌలు మారుమనస్సు పొంది ప్రార్థించుచుండగా అతడు లేచి బాప్తిస్మము పొంది తన పాపములను కడిగివేసుకొనుమని చెప్పబడెను (అపొ.కా. 9:11; 22:16). క్షమాపణ కొరకతడు చేసిన విజ్ఞాపననుబట్టి బాప్తిస్మము ద్వారా అది అతనికి అనుగ్రహించబడెను. కొర్నేలి యొక్క ప్రార్థనలు వినబడిన తరువాత అతడు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించ బడెను (అపొ.కా. 10:43). క్రైస్తవుడు కాని వాడెవడు తన పాపములు క్షమించ బడుటకు ప్రార్థన చేయవలెనని చెప్పబడలేదు.

**పాపియొక్క ప్రార్థన :**

డినామినేషన్ల వారందరు తమ ప్రసంగము ముగింపులో ప్రజలు మారుమనస్సు పొంది నిష్కపటముగా ప్రార్థన చేస్తే వారు క్షమించబడ్తారని చెబుతారు. ఈ ప్రార్థన తతంగము ఒక గుంపునుండి వేరొక గుంపుకు తేడాగా యుంటాది. దేవుడు కోరునది యిదే అయితే ఆ ప్రార్థన ఒకే రీతిగ యుండును, దానిని గూర్చి లేఖనములలో చెప్పబడి యుండును.

"దేవా నా పాపములను గూర్చి నేను చింతించుచున్నాను, ఇప్పుడే నేను నా పాపముల నుండి తిరుగుచున్నాను. నన్ను క్షమించుము. యేసుక్రీస్తును పంపినందుకు వందనములు. నీవు నా జీవితములోనికి రమ్ము, నన్ను క్షమించి నందుకువందనములు" అనే ప్రార్థన చేస్తే దేవుడు నిన్ను క్షమిస్తాడు, నిన్ను తనకుటుంబములోనికి చేర్చుకొంటాడని డినామినేషన్లు చెబుతారు. ఈ ప్రార్థనగాని, దానితోకూడిన వాగ్దానము గాని బైబిలులో ఎక్కడా లేదు. ఈ వాగ్దానాలు మనుష్యుడు చేసాడు దేవుడు కాదు. గనుక అట్టి ప్రార్థనలు వ్యర్థము, దానికి దేవుడు బాధ్యుడు కాదు.

**ముగింపు**

దేవుని చిత్తప్రకారమున్న ప్రార్థనలనే ఆయన ఆలకించును గనుక దేవునితో మనము సరియైన సంబంధము కలిగి యుండాలి. పాపియైన వాడు రక్షింపబడే మార్గమును ఆయన తన గ్రంథమందు బయలుపరిచారు. దేవుని వాక్యమును విని (రోమా 10:17, అపొ.కా. 11:14), విశ్వసించి, బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును (మార్కు 16:16; అపొ.కా. 2:38, రోమా 10:10).

– ఓవెన్ ఆల్‌బ్రిక్ట్

# గలిలయ నుండి యోర్దానుకు
## (From Galilee to the Jordan)

**- JJ. Wheelar**

" ఆ సమయమున యోహాను చేత బాప్తిస్మము పొందుటకు యేసు గలిలయ నుండి యోర్దాను దగ్గరనున్న అతని యొద్దకు వచ్చెను" (మత్తయి 3:13).

యేసు యొక్క మాదిరి మనకు అత్యంత ప్రాముఖ్యమైనది. ఆయన దేనికి ప్రాధాన్యత యిచ్చెనో దానిని మనం గమనించి అనుకరించాలి.

యోర్దాను నది చాలా పొడవైనది. పాలస్తీన అంతా అది వ్యాపించియున్నది. అది హెర్మోను కొండలపై మొదలిడి మృత సముద్రము వరకు 156 మైళ్ల పొడవున్నది. నజరేతునుండి యోహాను బాప్తిస్మమిచ్చుచున్న స్థలముకు ఇంచుమించు 60 మైళ్ల దూరమున్నది. ఈ దూరమంతయు కాలినడకనే చేరుకొనవలెను. ఆ రోజులలో యూదులు సమరయగుండా వెళ్లకుండుటకు యోర్దాను దాటి దాని తూర్పువైపున ప్రయాణం చేసేవారు. యేసుకూడ ఈ దారినే ఎంచుకొనెనో లేదో మనకు తెలియదు. బాప్తిస్మము మిచ్చు యోహాను అద్భుతములు యేమీ చేయలేదు. అయినను యేసు సమయమును, శక్తిని, సౌకర్యములను ఎంచక ఇంత కష్టతరమైన ప్రయాణము చేసెను (యోహాను 10:40, 41). యోహాను యొక్క పేరు ప్రఖ్యాతులను బట్టి యేసు అతని యొద్దకు రాలేదు. మరియు ఆయన జన సమూహమును వెంబడించలేదు!

యోహాను చేయుచున్నదేమిటో, దానిని బట్టి యేసు అతనివైపు ఎందుకు వచ్చారో ఆలోచింతము. అతడు బాప్తిస్మమిచ్చువాడని గుర్తింపుపొందెను. అందుకే అతడు బాప్తిస్మమిచ్చు యోహానన బడెను. బాప్టిస్టు సంఘాలకు యోహానుకు యేమీ సంబంధము లేదు. యోహాను తరువాత 1500 సంవత్సరముల వరకు బాప్టిస్టు డినామినేషన్ ఉద్భవించలేదు! బాప్తిస్మమివ్వడం అతని పని, యేసుతో పోల్చుకొనుచు, "ఆయన హెచ్చవలసి యున్నది, నేను తగ్గవలసి యున్నది'' యని అతడు చెప్పాడు (యోహాను 3:30).

యోహాను యిచ్చిన బాప్తిస్మము యొక్క విధానము గమనించదగినది. విస్తారమైన నీళ్లున్న చోట అతడు బాప్తిస్మమిచ్చుచుండెను. "సలీము దగ్గర ఐనోనను స్థలమున నీళ్లు విస్తారముగా ఉండెను గనుక యోహాను కూడ అక్కడ

బాప్తిస్మమిచ్చుచుండెను" (యోహాను 3:23). అనేకులు అతని యొద్దకు వచ్చి బాప్తిస్మము పొందుచుండిరి (మత్తయి 3:5-6). "అంతట యూదయ దేశస్థు లందరును యెరూషలేము వారందరును బయలుదేరి అతని యొద్దకు వచ్చి తమపాపములు ఒప్పుకొనుచు యొర్దాను నదిలో అతనిచేత బాప్తిస్మము పొందు చుండిరి" (మార్కు 1:5).

నీటిలో ముంచబడుట యూదులకు క్రొత్తయేమీకాదు. యెరూషలేము దేవాలయము చుట్టూ అనేక నీటి మంటపములుండేవి. దేవాలయ కార్యక్రమములలో పాలుపొందే వారందరు ముందు ఆ నీటిలో మునిగి లోపలికి వెళ్లేవారు. నీటిలో ముంచ బడకుండా దేవాలయములోనికి ప్రవేశము లేదు.

యోహాను యాజక ధర్మము నిర్వర్తించు లేవీ గోత్రపువాడు. అతడు బాప్తిస్మమును ప్రకటించెను (లూకా 1:6, 13, 3:3). అతడు ఒక పట్టణములోగాక, అరణ్యములో ప్రకటించుచుండెను. ఒకే ఒక్కసారి అమలులోయున్నది అతడిచ్చిన బాప్తిస్మము. ఒకడు తనకు తానే మునుగుటకంటే ముంచడము బొందుటకు యోహానుదగ్గరకు వెళ్లవలసి వచ్చెను. ఏవిధమైన రక్తబలి లేకుండా పాపక్షమాపణ కొరకు అతడు బాప్తిస్మము ఇచ్చుచుండెను. అయినను ఒకడు తన పాపములు ఒప్పుకొనుచు యోహాను దగ్గర బాప్తిస్మము పొందుచుండెను. యోహాను రెండు సంగతులు కోరెను- మారుమనస్సు, మరియు తన వెనుక వచ్చు వాని యందు (మెస్సీయా యందు) విశ్వాసము. యివి లేకుండా అతని యొద్దకు వచ్చువానికి ప్రయోజనము యేమీ లేకుండెను (మత్తయి 3:7-12).

యేసు యోహాను దగ్గరకు ఒకే ఒక్క కారణము వలన ప్రయాణము చేసెను. యోహాను ఆజ్ఞాపించేదానికి లోబడుటయే ఆయన ముఖ్యోద్దేశ్యము. ఎందుకు? యోహాను కాదుగాని యేసు దేవుని కుమారుడు. యేసు సృష్టికర్త, యోహాను సృష్టము. రాబోవుచున్నవాడు యోహాను కాదు, గాని యేసు. అయితే యేసు ఎందుకు అతని దగ్గర తగ్గించుకోవాలి?

యోహాను యొక్క పరిచర్యలో ప్రవచన పూర్వకముగా వాగ్దానము చేయబడిన రక్షణ ఇశ్రాయేలీయులకు మొదలిడెననుగ్రహింపు అతని బాప్తిస్మము వలన కలిగెను (మత్తయి 11:13; లూకా 1:76-79; 3:3). అయితే యేసుకు ఏపాపము లేదు. అయినను అతని బాప్తిస్మము ఆయనకెట్లు వర్తించును?

మొదటిగా యోహాను యొక్క పరిచర్యకు సర్వశక్తిగల దేవుడే అధికారమును గ్రహించెను. ఇశ్రాయేలీయులు బాప్తిస్మము పొందవలెననునది దేవుని యొక్క ఆజ్ఞయై యుండెను. యేసు ఇశ్రాయేలీయుడే

గనుక, ఆయన కూడ యోహాను యొక్క పరిచర్యకు తలొగ్గవలసినదే. అట్లు చేయకపోతే దేవుని యొక్క సంకల్పమును నిరాకరించినట్లేయగును (మత్తయి 3:15; లూకా 7:29-30).

రెండవదిగా, రాబోవు రక్షకుని కొరకు ప్రజలను యెహోను సిద్ధపరచవలసియుండెను (మత్తయి 3:3; మార్కు 1:1-3). ఈ మెస్సీయ యోహాను పనిని నిర్లక్ష్యము చేస్తే, అతని పనిని ఒప్పుకొనలేనట్లగును

చివరిగా, మెస్సీయను ఇశ్రాయేలుకును లోకమునకును యోహాను యొక్క పరిచర్య వలన బయలుపరచవలసి యుండెను (లూకా 3: 4-6; యోహాను 1:31). ఇక్కడే యేసు పరిశుద్ధాత్మతో అభిషేకించబడి వాగ్దానము చేయబడిన రక్షకుడు (మెస్సీయ) ఈయనేయని అందరికీ నిరూపించబడెను (మత్తయి 3:16; అపొ.కా. 10:37, 38).

అయినను యేసు శరీరధారియైన దేవుడు, ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు, రాజులకు, రాజు, ప్రభువులకు ప్రభువు. ఆయన జన్మించగా దేవదూతలు ఆయననారాధించిరి (లూకా 2:13,14, హెబ్రీ 1:6). అయిననను సరే ఆయన తన్నుతాను తగ్గించుకొని, ఆ కష్టతరమైన దూర ప్రయాణము చేసి, పాపియైన మానవునికి లోబడి, అతని చేతులలో 'పాపములు క్షమించబడే' సందర్భములో బాప్తిస్మము పొందుటకు సిద్ధపడివచ్చెను. యేసు తన పనిని పూర్తిగా గ్రహించుకొని ఈ విషయంలో మనతో సమానునిగ చేసికొనెను (ఫిలిప్పీ 2:5-11). అందుకే తండ్రియైన దేవుడు ఆకాశము నుండి నోరు తెరచి "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేను ఆనందించుచున్నానని" గంభీరముగా ప్రకటించెను (మత్తయి 3:17). యోహాను యొక్క పని ముగించబడెను. దాని విషయమై మనం గజిబిజి అవ్వనక్కర్లేదు. అతని కృషి నెరవేర్చబడెను. నేడు ఎవరైనా అతని వలనైన బాప్తిస్మము పొంది నట్లయితే అది వ్యర్థము (అపొ.కా 19:1-7). అయినను క్రీస్తుయొక్క పనిని మనం పూర్తిగా గ్రహించుకోవాలంటే యోహానుతో మనం ఆరంభించాలి. సువార్త లేఖకులు కూడ యోహాను పరిచర్యతో ఆరంభిస్తారు. దేవుని రక్షణ సంకల్పములో అతని పాత్రను మనము సంకుచితము చేయలేము. యేసు యొక్క మాదిరి దానిని మనకు నిరూపించు చున్నది.

– J.J. వీలర్

# "నీతి యావత్తు జరిగించుటకు"
## (To Fulfill all Righteousness)

**- Russ McCullough**

లేఖనములు దైవావేశ పూరిత మైనవి (యోహాను 20:21-23; 2 తిమో 3:16). ప్రాముఖ్యము కాని లేఖన భాగములు యేమీ బైబిలు నందులేవు. గాని కొన్ని లేఖనములు మన దృష్టిని ఆకర్షించునట్లుండును. మత్తయి 3:15 అట్టిది : యోహాను దగ్గరకు బాప్తిస్మము పొందుటకు యేసురాగా అతడాయనను నివారింపజూచెను గాని "యేసు- ఇప్పటికి కానిమ్ము; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగి యున్నదని అతనికి ఉత్తరమిచ్చెను".

మన దేవుడు ఎన్నడు మార్పు జెందని వాడు. అందువలన కాలమును బట్టి ఆయన మార్పు జెందడు. ఒకటి మాత్రము దీనిని గుర్తించగలము. ఆయన ఏర్పాటుచేసిన రక్షణ సంకల్ప విషయంలో నీరు ఎల్లవేళలా ఇమిడియున్నది! మన పితరుడైన నోవహు, అతని కుటుంబము నీటి మూలముగా రక్షింపబడిరి (ఆదికా 7,8 అధ్యా; I పేతురు 3:18-22). ఇశ్రాయేలీయులను మోషే నీటి ద్వారా ఐగుప్తు బానిసత్వము నుండి రక్షించెను (నిర్గమ 14: I కొరింథీ 10:1-4), చివరిగా ఇప్పుడు రక్షింపబడ గోరు వారందరు నీటి బాప్తిస్మము పొందవలసి యున్నది (అపో.కా. 2:37-39; రోమా 6:1-7; కొలస్స 2:11-12, I పేతురు 3:21-22). దేవుడు తనకుమారుడైన యేసుక్రీస్తును యోహాను ద్వారా యోర్దాను నదిలో ముంచుటవలన నీటి బాప్తిస్మము యొక్క నిలకడ తత్వాన్ని బయలు పరిచారు. యేసు నీతి యావత్తు జరిగించుటకు బాప్తిస్మము పొందారు!

మత్తయి 3:15 మనకు మూడు ప్రాముఖ్య సంగతులను ఘోషించు చున్నది. ఆదికాండము నుండి మలాకీ వరకు ప్రకటింపబడుచున్న దేవుని చిత్తాన్ని ఈ ఏకైక క్రియ మనకు సంపూర్ణముగా చూపించుచున్నది. రాబోవు రాజ్యములో యుండగోరు వారందరు చేయవలసిన మాదిరిని అది స్థిర పరచుచున్నది. కుమారుడైన యేసు త్రియేక దేవుని చిత్తానికి సంపూర్తిగా విధేయత చూపుటలో దేవుని యొక్క ఆమోదమును పొందెనను సంగతిని అదిమనకు అది తెలియజేయుచున్నది.

"నీతి యావత్తు జరిగించుట కొరకు" అను మాటలు ఏకైకమైనవి. అవి ఆశ్చర్యమైనవి. లేఖనాల్లో ఈ మాటలు

మరొకచోట ఎక్కడా కన్పించవు. రాబోవు రాజ్యప్రవేశమునకు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము అవసరమని అవి తెలియజేయుచున్నది. పాపక్షమాపణ కొరకు అనుమాటలు 23 సార్లు బైబిలునందు మన కనబడును. "నీతి యావత్తు జరిగించుటకు " అనగా to Fulfill, గ్రీకులో Pleeroo అని యున్నది. అంటే నింపుటకు, సంపూర్ణము చేయుటకు, పూర్తిగా యిచ్చుటకు, సంపూర్తిగా నింపుటకు అని యర్థము.

"నీతియావత్తు నెరవేర్చుటకు ఈలాగు కానిమ్మని" యేసుచెప్పుటలో పాత నిబంధన అంతయు సంగ్రహించ బడి ఈ ఒక్క క్రియలోనే, అనగా ఆయన పొందిన బాప్తిస్మములోనే యున్నదని యేసు యొక్క ఉద్దేశ్యమై యుండెను. ఇక్కడ ఆయన తన బహిరంగ పరిచర్య ప్రారంభించారు, నీటి బాప్తిస్మము యొక్క ఆవశ్యకతను ఇక్కడ ఆయన ఉద్ఘాటించారు. మానవావతారుడైన ఆయనకు ఇక్కడ తండ్రి యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు ఆశీస్సులు లభించెను. ఈ సంఘటన యొక్క ప్రాముఖ్యతను తక్కువగా అంచనా వేయకూడదు.

యేసుప్రభువు యొక్క గమ్యము, కృషి అంతయు లేఖనములను నెరవేర్చుటయే (మత్తయి 5:17). ఆయన ధర్మశాస్త్రమును, ప్రవక్తల వచనములను, అనగా పాతనిబంధన నంతటిని నెరవేర్చుటకు వచ్చెను. పాతనిబంధనలో బయలు పరచబడిన దేవుని చిత్తమును క్రియారూపముగా ఆయన సంపూర్ణ ముగా నెరవేర్చుటకు వచ్చెను. ఆయనయందు దేవుని వాక్యము యొక్క సర్వసంపూర్ణత నెరవేరునట్లు ఆయన ఏతెంచెను. ఆయన దేవుని వాగ్దానము నకు నెరవేర్పుగా ఆయన విధేయత చూపించెను (మత్తయి 3:15). దేవుని వలన యేది నియమింపబడెనో, దానిని ఆయన అంగీకరించడానికి సంపూర్తిగా లోబడెను.

మానవుడు బాప్తిస్మమును అంగీకరించి దానికిలోబడాలి. ఏల యనగా పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెననునది దేవుని చిత్తము. అది దేవుని ఆజ్ఞ, దేవుని మాదిరియై యున్నది. యేసు యోహాను దగ్గర బాప్తిస్మము పొందుటలో ఆయన మనకు మాదిరిగా యున్నారు (మత్త : 3:10). దానిని క్రీస్తు అందరికీ ఆజ్ఞాపించెను (మార్కు 16:15-16), దానిని క్రీస్తు అపొస్తలులకు ఆజ్ఞాపించెను (మత్తయి 28:18-20), మరియు దానిని అపొస్తలులు కూడా ఆజ్ఞాపించిరి (అపొ.కా 2:38-41).


యొర్దానునదిలో యేసు యోహాను బాప్తిస్మము పొందిన మంచిమాదిరి వలన దేవునికిస్తోత్రము .

**- రస్ మెకల్లో**

# బాప్తిస్మము పొందినప్పుడు అనేక సంగతులు జరుగును

## (Many Things Happen at Baptism)

**- Jerome Savage**



మనము బైబిలు ప్రకారము బాప్తిస్మము పొందినప్పుడు అనేక సంగతులు జరుగును. దిగువ సంగతులు గమనించుము. :

1. యేసు యొక్క మాదిరినను సరింతుము (మత్తయి 3:15)
2. ఆయన ఆజ్ఞకు విధేయులగుదుము (అపొ.కా. 10:48)
3. మనకు పాపక్షమాపణ లభించును (మార్కు 16:16, అపొ.కా 2:38)
4. పరిశుద్ధాత్మ అను వరమును పొందుదుము (అపొ.కా 5:32)
5. క్రీస్తులో శిశువులగుదుము (1 పేతురు 2:2)
6. నూతన సృష్టి యగుదుము (2 కొరింథీ 5:17)
7. మనము తిరిగి జన్మించి, మార్పునొందుదుము (యోహాను 5:3; మత్త 18:3)
8. బాప్తిస్మము ద్వారా క్రీస్తును ధరించుకొందుము (గలతీ 3:27)
9. ఒక్క శరీరము లోనికి బాప్తిస్మము

పొందుదుము ( I కొరింథీ 12:13, ఎఫెసీ 1:22-23)

10. క్రీస్తు సంఘముతో చేర్చబడుదుము (అపో.కా. 2:47)

11. క్రీస్తు రాజ్యములోనికి మార్చ బడుదుము (కొలస్స 1:13)

12. దేవుని యెదుట నిర్మలమైన మనసాక్షి గలిగియుందుము (I పేతురు 3:21)

13. క్రైస్తవునిగా మనము దేవుని నామమును ఘనపరచుదుము ( I పేతురు 4:16)

14. మనకు అనేక ఆత్మీయ ఆశీర్వాదములు లభించును (ఎఫెసీ 1:3)

15. మనప్రార్థనలలో పరిశుద్ధాత్ముడు మనకు సహాయము చేయును (రోమా 8:26,27)

16. మనము వెలుగులోనడుతుము. యేసు రక్తము మనలను పవిత్రులనుగా చేయును (I యోహాను 1:7-9)

17. క్రీస్తునందున్న వారికి ఏ శిక్షా విధియులేదు (రోమా 8:11)

18. విశ్వసించుట ద్వారా దేవుని ప్రభావము మన జీవితములో కనబడును (కొలస్స 2:12)

క్రొత్త నిబంధనలో బాప్తిస్మమును గూర్చి కనీసము 128 సార్లు చెప్పబడియున్నది. ఇన్ని గొప్ప సంగతులు బాప్తిస్మములో సంభవించుచున్నందున బాప్తిస్మము పొందుటకు ఎవరైనా ఎందుకు నిరాకరిస్తారు?

– జెరోమ్ సేవేజ్

## మంచి సలహా
## GOOD ADVICE

హానోకు వలె నడువుము
హేబెలు వలె ఆరాధించుము
నెహెమ్యావలె పనిచేయుము
యిర్మియా వలె విలపించుము
యోబు వలె విధేయుడవగుము
మోషే వలె నడిపించుము
దానియేలు వలె ప్రార్థించుము
పౌలు వలె జయించుము

**క్రీస్తువలె జీవించుము!!**

# ప్రభువు దినము

## ( The day of the Lord)

**- Wayne Barrier**



అపో. పేతురు ఇట్లు వ్రాసాడు. "అయితే ప్రభువు దినము దొంగవచ్చి నట్లువచ్చును. ఆ దినమున ఆకాశములు మహా ధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీద నున్న కృత్యములు కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక ఆకాశములు రవులు కొని లయమైపోవునట్టియు పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవు నట్టియు దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు దానిని ఆశతో అపేక్షించుచు మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగల వారై యుండవలెను. అయినను మనమాయన వాగ్దానమును బట్టి క్రొత్త ఆకాశము కొరకు క్రొత్తభూమి కొరకును కనిపెట్టుచున్నాము; వాటి యందు నీతి నివసించును. ప్రియులారా, వీటికొరకు మీరు కనిపెట్టువారు గనుక శాంతము గలవారై ఆయన దృష్టికి నిష్కళంకులు గాను, నిందారహితులుగాను కనబడు నట్లు జాగ్రత్త పడుడి" (2 పేతురు 3:10-14).

ఈలోకము నాశనము చేయబడు కాలాంతమును గూర్చి పేతురు ఇక్కడ వివరించాడు. దొంగవలె వచ్చు ఈ దినము కొరకు సిద్ధపడి యుండుటయే మన జీవిత ధ్యేయముకావాలి. ఈ లోకజీవితము అశాశ్వతము గనుక క్రొత్త ఆకాశములు క్రొత్త భూమి కొరకు మనము అత్యంత ప్రాధాన్యత ఇయ్యాలి. పేతురు ఈ మాటలను రెండు వేల సంవత్సరముల క్రితమే వ్రాసాడు. కొందరు అతని బోధను హేళన చేసారు (2 పేతురు 3:3-4). కొందరు నిర్లక్ష్యము చేసారు. అయితే దేవుడు తన వాగ్దానమును గూర్చి నిర్లక్ష్యము చేయవాడు కాదని పేతురు ఉద్ఘాటించాడు (2 పేతురు 3:9). ఆయన చెప్పినట్లే చేయును.

ఈ లోకం అంతా గందరగోళము తో నిండియున్నది. అంతా అనిశ్చయతే. యుద్ధములు, ఆకలి, రోగము మొదలగు వాటి వలన అనేకులు శ్రమల నొందుచున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల నుండి బయటపడాలంటే క్రీస్తును, ఆయన రాజ్యమును మనం ముందు ఎంచుకోవాలి (మత్తయి 11:28-30). అనేకులుదైనందిన సాధక బాధకాలలో పట్టుబడియున్నారు. నిజానికి వాటి ఉపశమనము క్రీస్తులో యున్నది. క్రీస్తుకు మనం నమ్మకముగాయుంటే, మనకు ఈ లోకంలోను, రాబోవు లోకంలోను సుఖజీవినం వాగ్దానము చేయబడి యున్నది. పేతురు చెప్పినట్లు మనం క్రొత్త ఆకాశముల కొరకును క్రొత్తభూమి కొరకును కనిపెట్టవలయును. ఈ లోకాంతమందు అవి సంభవించును.

సిద్ధపడిన వారికి ప్రభువు దినము ఒక గొప్పదినము. గనుక మనము "మన ప్రభువైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి పొందవలెను. ఆయనకు ఇప్పుడును, యుగాంత దినము వరకును మహిమ కలుగును గాక!" (2 పేతురు 3:18). అంతము వచ్చేసరికి ఎవరు అభివృద్ధి జెందుచుయుందురో వారు పరలోకమునకు సిద్ధపడియుందురు.

**- వేయిన్ బేరియర్**



# కీర్తనలు పాడుట
## ( Singing)

**- Carrol Sites**

పస్కాపండుగ నాడు ప్రభురాత్రి భోజనమును ప్రతిష్ఠించి దాని సంబంధమైన హెచ్చరికల నిచ్చిన తరువాత మన ప్రభువు తన అపొస్తలులతో కలిసి కీర్తనపాడెను. "అంతటవారు కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్లిరి" (మత్తయి 26:30). వారేమిపాడారో మనకు తెలియదు. వారి పాటలను ఎవరు నడిపించారో కూడా మనకు తెలియదు.

పౌలు, సీలాలు ఫిలిప్పుయి చెరసాలలో బంధింపబడియుండిరి. వారి కాళ్లకు బొండాలు బిగింపబడియుండగా వారు పాటలు పాడుచుండిరి, ప్రార్థన చేయుచుండిరి, మరియుతోటి ఖయిదీలు వినుచుండిరి (అపొ.కా. 16:24-25).

"మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను; ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను" (యాకోబు 5:13). మనము మనస్సుతోను, ఆత్మతోను పాడవలెను. అనగా పాటయొక్క అర్థమును గ్రహించుకొనిపాడవలెను ( I కొరింథీ 14:15). మనము కీర్తనలు, సంగీతములు, ఆత్మ సంబంధమైన పాటలు పాడవలెను (ఎఫెసీ 5:19; కొలస్స 3:16).

క్రైస్తవ్యము పాటలు పాడే మతము. క్రొత్త నిబంధనలో ప్రతి క్రైస్తవుడు, క్రైస్తవురాలు యాజకునిగా/యాజకురాలుగా పాటలు పాడవలెను. అది ఎన్నడు వాద్యములతో మిళితము చేయబడలేదు. నాడు, నేడు కూడ క్రైస్తవులు పాటలు పాడే ప్రజలే.


పాటలు పాడుటలో యున్నశక్తి గొప్పది. అది సజీవస్వరము. వాద్యములు నిర్జీవ వస్తువులు. ఆరాధనలో, పనిలో, ఆటలో పాటలు పాడుట ఘనమైనది. దేవుడు కోరేది అదే.

- కేరల్ సైట్స్



# నేనిచ్చే కానుకలు
## ( My Giving)

- Dan R. Owen



" భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులును యెహోవావే" (కీర్తన 24:1).

సమస్తమును మనదేవునికి చెందినదే గనుక ఆయనకు యేమీ అవసరము లేదు. ఔదార్యము గల ఆయన నుండియే మనకు అన్ని యీవులు కలుగును (యాకోబు 1:17). అది నిజమే అయినను ఆయనను సేవించువారి నుండి ఆయన కానుకలు కోరడం వింత అనిపించవచ్చును. ఆయన మననుండి ఆత్మీయ సేవనుకోరుచున్నందున మనము ఆయనకు కానుకలు ఇవ్వాలని కోరుచున్నారు. ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యము తోను ఆయనను ఆరాధించలెను. కానుకలిచ్చుట ఒక ఆత్మీయమైన విషయం! దేవునికి, ఆయన పనికి యిచ్చుట మన హృదయాన్ని, భక్తిని, మన అభీష్టాన్ని తెలియజేయును.

మన ధనం మనహృదయానికి దగ్గరగా యుంటాది గనుక దానిని యిచ్చుటలో దేవునితో మనకు గల సంబంధాన్ని తెలియజేయును. "నీ ధనమెక్కడ నుండునో అక్కడనే నీ హృదయము ఉండును" అని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 6:21). మనం యిచ్చే కానుకలను దేవుని దృక్కోణం నుండి గమనించుము.

**మన కానుకలు దేవునికిచ్చే అర్పణయైయున్నవి :** దేవునికి బహుమానములు, సమర్పణలు చెల్లించుట కయీను, హేబెలుల కాలము నుండే యున్నవి. అబ్రాహాము యుద్ధములో కొల్ల సొమ్ములో పదియవ వంతును దేవుని యాజకుడైన మెల్కీసెదెకుకు సమర్పించాడు (ఆది. కా 14 : 17-20). తనకు కలిగిన దానిలో పదియవ వంతు దేవునికిత్తునని యాకోబు మ్రొక్కుకొనెను (ఆదికా 28:22). ప్రత్యక్ష గుడారము నిర్మించబడు చున్నప్పుడు దేవుడు ప్రజల నుండి అర్పణలు కోరెను. మరియు ప్రజలు తమ ఆదాయములో పదియవ వంతు దేవునికియ్యవలెనని, దానిని లేవీయులకు సమర్పించవలెనని ఆయన ధర్మశాస్త్రములో హెచ్చరించెను.

మనం దేవుని కిచ్చే యర్పణ వ్యక్తిగతమైనది, అది దేవుని యెడల మనకున్న భక్తి భావములను ప్రదర్శించునని ప్రవక్తయైన మలాకీ విశదపరచెను. గనక దేవుని మనం ఎంతమట్టుకు ఘనపరచుచున్నామో మనయర్పణ తెలియజేయును. మన యర్పణలు వ్యక్తిగతం!!

**మనయర్పణలు విధేయతకు సూచికలు :** మోషేధర్మ శాస్త్రము వివిధ రకముల యర్పణలను గూర్చి ఆజ్ఞాపించెను. ప్రవక్తల ద్వారా దేవుడిట్లు ఆజ్ఞాపించారు. "పదియవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొనిరండి" (మలాకీ 3:10). మన ఆరాధనలలో దీనిని గూర్చి ప్రార్థించుట మనము తరచుమరతుము. మన సేవలో ఎప్పుడు ఇయ్యాలో మన అనుకూలతను బట్టి నిశ్చయించుకొనవచ్చును. గాని కానుకలిచ్చుట మన అనుకూలతకాదు గాని మన ప్రభువైన యేసుయొక్క ప్రభుత్వమునకు చూపించే విధేయత అది. కొరింథులోయున్న సంఘము ప్రతి ఆదివారమున కానుకలియ్యాలని పౌలువారిని హెచ్చరించాడు ( I కొరింథీ 16:1,2). గలతీయలోని సంఘము లకును దీనిని అతడు బోధించాడు. యిచ్చుట మన బాధ్యతయైయున్నదని బైబిలు గ్రంథమంతయు బోధించుచున్నది, ఎంత ఇయ్యాలో క్రొత్త నిబంధనలో ఆయన చెప్పలేదుగాని, మనం అభివృద్ధి జెందినకొలది, హృదయములో నిశ్చయించుకొని ధారాళముగా ఇయ్యవలెనని చెప్పారు (2 కొరింధీ 9 :6-7).

మనయర్పణ ఒక పెట్టుబడి లాంటిది : కోతకోయుదుమనే నిరీక్షణతో విత్తుట అది. మనం ఆత్మీయ విషయాలలో పెట్టుబడి పెడితే, నిత్య జీవితాన్ని కోయుదుము (గలతీ 6:6-8). విస్తారముగా విత్తువాడు ధారాళముగా పంటకోయును. మనం యిచ్చే కానుకలు పరలోకమందు ధనము కూర్చుకొనుటయే.

**దేవుని పనిలో సహవాసము కొరకు మనయర్పణలున్నవి :** ఫిలిప్పయిలోని క్రైస్తవులు తమ కానుకల ద్వారా తనతో మొదటి నుండి సహవాసము కలిగియుండిరని పౌలు వారికి తెలియజేసాడు (ఫిలిప్పీ 1:3-7). నిరుపేదలకు సహాయము చేయుటకు మాసిదోనియలోని సంఘములు ఎంతో ఆసక్తిని కలిగియుండిరి. ''వారు నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను..... వారు తమ సామర్థ్యము కొలదియేగాక సామర్థ్యము కంటె ఎక్కువగాను తమంతటతామే యిచ్చిరని" పౌలు వారిని గూర్చి చెప్పెను (2 కొరింధీ 8:1-4). నేను ప్రభువుకు కానుకలిచ్చినప్పుడు దేవునితోను ఆయన పనిలోను సంఘము ద్వారా వ్యక్తిగత సహవాసము కలిగియుందును.

- దేన్ ఓవెన్స్

# క్రీస్తు సంఘ ఆర్గనైజేషన్ ఎట్లున్నది?

## (What is the Organisation of the Church?)

**- Bob Prichard**



యేసు తన సంఘమును నిర్మింతునని వాగ్దానము చేసారు (మత్తయి 16:18). మరియు తండ్రియైన దేవుడాయనను తన శరీరమైన సంఘముకు శిరస్సుగా నియమించారు (ఎఫెసీ 1:22-23). సంఘముకు క్రీస్తు ఏకైక శిరస్సుగనుక, సంఘముపై ఏ మానవునికి అధికారము లేదు. ఏ మానవుడు దానిపై అధికారిగ యుండుటకు అవకాశము లేదు. లేఖనములలో క్రీస్తు సంఘము అంతాస్థానికంగానే ఆర్గనైజ్‌చేయబడినది. స్థానిక సంఘముపై అంగీకారము చేయుటకు మరియే సంస్థకు, మానవునికి బైబిలు అవకాశమిచ్చుట లేదు.

సంఘమును నడిపించుటకు క్రీస్తు మొదట్లో అపొస్తలుల నేర్పరచారు. అపొస్తలులను నడిపించుటకు ఆయన పరిశుద్ధాత్మను పంపించారు (యోహాను 16:13). వారు చేయుచుండిన అద్భుతములు వారు దేవుని సంబంధులని ప్రజలకు ధృపపరిచాయి. అపొస్తలుల

తరువాత అపొస్తలులుగా ఎవరు నియమించబడలేదు గనుక నేడు అపొస్తలులు ఎవరు లేరు. వారి స్థానమున ఎవరును నిలబడి చెప్పుటకు అధికారము ఎవరికీ లేదు.


అపొస్తలులు మరణించిన తరువాత ప్రతిస్థానిక సంఘము స్వీయపాలన కలిగి ఒకదానితోనొకటి స్వాతంత్ర్యము కలిగియున్నది. ప్రతిస్థానిక సంఘము బైబిలును మాత్రమే అనుసరిస్తు పెద్దలు, పరిచారకుల పర్యవేక్షణలో నడిపించబడ వలెను. ప్రతిస్థానిక సంఘములోను ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ మంది పెద్దలుండవలెను. క్రొత్తనిబంధనలో ఒకస్థానిక సంఘము ఒకే పెద్దచే నడిపించబడిన మాదిరి యేదీలేదు (అపొ.కా. 20:17).

పెద్దల పర్యవేక్షణలో సేవచేయు పరిచారకులుందురు. "ఫిలిప్పీలో క్రీస్తుయేసను నందలి సకల పరిశుద్ధులకును అధ్యక్షులకును పరిచారకులకును" అని చెబుతు పౌలు వారికొక పత్రిక వ్రాసాడు (ఫిలిప్పీ 1:1). ప్రతిస్థానిక సంఘములోను పరిచారకులు కూడ బహళ సంఖ్యలోనే యుందురు. పరిచారకులను గూర్చి మొదట అపొ.కా. 6:1-6లో మనకు కనబడును. పెద్దలకు, పరిచారకుల కుండ వలసిన నిర్థిష్టమైన అర్హతలను పౌలు తన పత్రికలలో తెలియజేసాడు. వాటిని తప్పక పాటించవలెను ( I తిమోతి 3:1-9; తీతు 1).

ప్రతిస్థానిక సంఘములోను సువార్తికులుందురు. ముఖ్యముగా వారు సువార్తను చాటింతురు, దేవుని వాక్యమును బోధింతురు (2 తిమో 4:2). తిమోతి ఒక పెద్ద పాస్టర్ కాదు. అతడొక సువార్తికుడు అతడు వాక్యమును బోధిస్తూ స్థానిక సంఘములు పెద్దలు పరిచారకుల నేర్పాటు చేసుకొనుటకు సహాయపడ్డాడు.

మొదటి శతాబ్దములోని సంఘములకు భిన్నముగా నేటి సంఘములు పాలింపబడుటకు కారణం యేమీలేదు. పెద్దలు సంఘ పనిని పర్యవేక్షిస్తు, పరిచారకులు పరిచర్య చేస్తు,సువార్తికులు వాక్యమును బోధిస్తు స్థానిక సంఘాభివృద్ధి కొరకు తోడ్పడాలి. యిది దేవుని సంఘపాలన పద్ధతి. దీనికి వేరైనది మానవుని పాలన పద్ధతి.

–బాబ్ ప్రిచర్డ్



# సంఘాభివృద్ధి కొరకు సూత్రములు
## (Keys to Church Growth)

**- Ken Tyler**




ప్రేమ : దేవుని యెడలను, తోటి మానవుల యెడలను క్రైస్తవ్యములో ప్రేమ అత్యవసరము. ధర్మశాస్త్రోపదేశకుడొకడు యేసు నొద్దకు వచ్చి "ధర్మశాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞయేదని అడిగెను. అందుకాయన నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను, నీపూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెనను నదియే. ఇది ముఖ్యమైనదియు మొదటియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవని అతనితో చెప్పెను" (మత్తయి 23:36-40). సంఘములు ప్రేమించును. గనుక వారు అభివృద్ధిజెందుదురు.

ప్రార్థన : ఈ లోకమునకు లేని శక్తిని ఒక దానిని క్రైస్తవులు కలిగి యున్నారు. అది ప్రార్థనా శక్తి. "నీతిమంతుని విజ్ఞాపన మనః పూర్వకమైనదై బహుబలము గలదై యుండును" అని యాకోబు వ్రాసాడు (యాకోబు 5:16). ప్రార్థన ద్వారా గొప్ప క్రియలు సాధించబడును. పాడైపోయిన యెరూషలేము పట్టణ ప్రాకారములను

తిరిగి కట్టుటలో విజయమును సాధించుట కొరకు ప్రజలు ఎంత పట్టుదలతో ప్రార్థించిరో తెలిసికొనుటకు నెహెమ్యా గ్రంథము చదువుము. రాత్రింబవళ్లు ప్రార్థన చేసే సంఘములు అభివృద్ధిజెందును.

**స్టడీ :** మనలనను పనిచేయుటకు నడిపించేది దేవుని వాక్యజ్ఞానమే. దేవుని హెచ్చరికలను బట్టి నిర్మించుటకు సహాయము చేయునదికూడ అదియే. కొందరు వాక్యమును పఠించరు గనుక వారు యేమీ సాధించలేరు. "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించు నంతమట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" యను సంగతిని మరచి పోకూడదు (హెబ్రీ 4:12). బైబిలును స్టడీ చేసేవారు నిర్మించుటకు పూనుకొందురు. సంఘములు క్రమముగా, తరుచు కూడుకొని బైబిలును స్టడీచేయువారు గనుక అవి అభివృద్ధిజెందును,

**కానుకలు ఇయ్యాలి :** అభివృద్ధి జెందే సంఘములు యిచ్చే సంఘములు, పుచ్చుకొనేవి కావు. వారు తమ సమయాన్ని ధనాన్ని కూడా యిస్తారు. వారు పరిచర్య చేయించుకొనుటకు కాదు గాని పరిచర్య చేయుట వారి విధియని గుర్తింతురు. అపొ.కా. 20:35 ను వారెరుగుదురు, దానిని విశ్వసింతురు: "పుచ్చుకొనుట కంటె యిచ్చుట ధన్యము" అని యేసు చెప్పెను. అభివృద్ధి జెందుచున్న ఒక సంఘమును నాకు చూపించుము. ధారాళముగా యిచ్చే సంఘాన్ని నీకు చూపింతును. అభివృద్ధిజెందే సంఘాలు యిస్తారు, యిచ్చుచు యుంటారు. సహోదరులారా, మనము అభివృద్ధిజెందుదాం!!

– కేన్ టేలర్



# విశ్వాసము ఒక్కటే
## (There is one Faith)

**- Charles E. Cobb**


" విశ్వాసము ఒక్కటే" (ఎఫెసీ 4:4). మత సంబంధ విషయాల్లో ఈ లోకం గందరగోళంతో నిండి యున్నది. కొందరికి యిది ఇష్టంగానే యుండ వచ్చును. అయితే ఆత్మీయ విషయాలలో మానవుని కిష్టమైనదికాదు గాని, దేవుని కిష్టమైనది ఏదో మనం తెలిసి కోవాలి. దేవుడు తన యిష్టాన్ని తెలియజేసారని మనం మనసు నందుంచుకోవాలి.

విశ్వాసము ఒక్కటేయని బైబిలు బోధించుచున్నది. అది ఏకవచనము. క్రొత్త నిబంధనలో విశ్వాసము అను ఈ మాటలో క్రైస్తవ విధానమంతయు ఇమిడియున్నది. దీనిని గూర్చి యూదా తన పత్రికలో ఇట్లు వ్రాసాడు: " ప్రియులారా, మనకందరికి కలిగెడు రక్షణను గూర్చి మీకు వ్రాయవలెనని విశేషాసక్తిగల వాడనై ప్రయత్నపడు చుండగా, పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధనిమిత్తము మీరు పోరాడవలెనని మిమ్మును వేడుకొనుచు మీకు వ్రాయవలసి వచ్చెను" (యూదా :3).

పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధలేక విశ్వాసము నిమిత్తము పోరాడవలెనను మాటలను గమనించుము. అనేక విశ్వాసములు (బోధల) నిమిత్తము కాదు గాని ఒకే ఒక్క విశ్వాసము నిమిత్తము పోరాడాలి. అనేక బోధల నిమిత్తము పోరాడితే అంతా గజిబిజి, స్వవిరుద్ధము, అర్ధరహిత మగును. అయితే నేడు క్రైస్తవ లోకంలో యిదే జరుగుచున్నది. వారు ఏబోధ అయినా పర్వాలేదు, ఏ సంఘమయినా పర్వాలేదని చెబుతారు!

"విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము" అని పౌలు తిమోతిని హెచ్చరించాడు (I తిమో 6:12). అతడు అనేక విశ్వాసములను గూర్చి కాదుగాని ఒకే ఒక్క విశ్వాసమును గూర్చి చెప్పాడు, "విశ్వాసమును కాపాడు కొంటిని" యని పౌలు మరియొకచోట చెప్పాడు (2 తిమోతి 4:7). అన్యులకు అపొస్తలుడైన పౌలు తీవ్రమైన ఆసక్తిగలవాడై పాతధర్మ శాస్త్రమును విసర్జించి క్రొత్త నిబంధనకు హత్తుకొన్నాడు. అతడా ఒకే ఒక్క విశ్వాసము కొరకు చివరకు తన ప్రాణమును సయితము కోల్పోయాడు (2 తిమో 4:7-8).

ఒకే ఒక్క విశ్వాస క్రమముండ వలెనని, ఒకే ఒక్క రక్షణ సంకల్పము,



విమోచన పథకముండవలెనని దేవుని యొక్క ఉద్దేశ్యమై యుండెను. అది మానవ సృష్టికాదు, మానవ సంకల్పము కాదు. అది మానవుల సభల వలన మానవుల యోచన వలనగాని కలిగినదికాదు. విశ్వాసము లేక విశ్వాస క్రమము దేవుని మనస్సులో ఆరంభమై ఆయనచే సంకల్పించబడి మానవుని క్షేమము కొరకు దేవుని మహిమ కొరకు ఉద్దేశించబడినది.

బైబిలు దానికదే చక్కటి భావార్థమును చెప్పును. "ఆత్మయు ఒక్కడే" యని పౌలు చెప్పిన దానిని మనము గమనించాలి. దీనిని గూర్చి ఎక్కడా యేమీ సందేహము లేదు. అదే లేఖన భాగము "ఒకే ఒక్క విశ్వాసమున్నదని" చెప్పుచున్నది. యిదికూడ సత్యమే. విశ్వాసము ఒక్కటే ఆత్మయు ఒక్కదేయని చెప్పు లేఖనమే విశ్వాసము ఒక్కటేయని చెప్పుచున్నది.

యేసు ప్రభువు చనిపోవకముందు తన శిష్యులతో, "మీరు దేవునియందు విశ్వాసమంచుచున్నారు. నా యందును విశ్వాస ముంచుడి..... నేనే మార్గమును సత్యమును జీవమునై యున్నాను, నా ద్వారా నే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు" అని చెప్పెను (యోహాను 14:1-6)

యేసే మార్గము, సత్యము, జీవమునైయుంటే ఒకటి కంటె ఎక్కువ విశ్వాసము లెట్లుంటాయి? నేడు అనేక రకాల విశ్వాసముండుట వలన లోకమంతా గజిబిజిగా తయారైనది. కుటుంబాలు విడిపోవుచున్నవి. సమాజములు ఒకరితోనొకరు పోరాడుచున్నారు. దేశములు సయితము శాంతిలేక యున్నారు. దేవుని వాక్యమును సరిగపాటించకపోవుట వలన ఈ లోకమంతయు ఆత్మీయముగా గాయపరచబడినది.

ఒకే శరీరము, ఒకే నిరీక్షణ, ఒకే ఆత్మ, ఒకే ప్రభువు, ఒకే బాప్తిస్మము, ఒకే దేవుడు ఎట్లున్నారో అట్లే ఒకే విశ్వాసమున్నది.

–చార్ల్స్ కాబ్



# దేవుని ప్రత్యేక ప్రజలు
## (God's Special People)

- Jimmy Clark

" అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్ములను పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును దేవునిసొత్తయిన ప్రజలైయున్నారు. ఒకప్పుడు ప్రజలుగా ఉండక యిప్పుడు దేవుని ప్రజయైతిరి; ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడిన వారైతిరి" (I పేతురు 2:9-10). దేవుడు ఈ లోకములో నున్న వారినందరినీ ప్రేమించి వారి కొరకు చనిపోవుటకు తన ఏకైక కుమారుని పంపెననునది నిజమే అయినను ఆయన పిల్లలైన వారి యెడల ఆయన ప్రత్యే సంబంధము కలిగియున్నారు (రోమా 8:31-39). దేవునికి సంఘము ఎంతప్రాముఖ్యమో దానిని లోకము తెలిసికొనుట ముఖ్యము. దానివలన అందరు సువార్త పిలుపును విని దానికిలోబడి సంఘ సభ్యులగుదురు-(అపొ.కా. 2:37-47). దేవుని ప్రజలైన క్రీస్తు సంఘమును గూర్చి దేవుని తలంపులను దిగువ గమనించుము.

**1. నిత్యత్వములో దానిని సంకల్పించెను :** పేతురు తన మొదటి పత్రికను ఇట్లు ఆరంభించెను. "యేసుక్రీస్తు అపొస్తలుడైన పేతురు, తండ్రియైన దేవుని భవిష్యత్ జ్ఞానమును బట్టి ఆత్మవలన పరిశుద్ధత పొందినవారై విధేయులగుటకును యేసుక్రీస్తు రక్తము వలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచబడిన వారికి.... శుభమని చెప్పి వ్రాయునది" (I పేతురు 1:1-2).


అతని పత్రిక అందుకొనిన వారు దేవుని చేత ఏర్పరచబడినవారని అపొ. పేతురు పరిశుద్ధాత్మ ద్వారా తెలియజేయుచున్నాడు. అదే రీతిగా ఎఫెసీ పత్రికలో పౌలు కూడా ఇట్లు చెప్పుచున్నాడు; "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున పరలోకములో ప్రధానులకును, అధికారులకును, సంఘము ద్వారా తన యొక్క నానా విధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి శోధింప శక్యముకాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును సమస్తమును సృష్టించిన దేవునియందు పూర్వకాలము నుండి మరుగైయున్న ఆ మర్మమును గూర్చిన యేర్పాటు ఎట్టిదో అందరికిని తేటపరచుటకును పరిశుద్ధులలో అత్యల్పుడైన నాకు అనుగ్రహించెను" (ఎఫెసీ 3:10-11).

మరల, "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక, ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకను గ్రహించెను. ఎట్లనగా తనప్రియుని యందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు తన చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తనకోసము నిర్ణయించుకొని మనము తనయెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత ఆయనక్రీస్తులో మనలను ఏర్పరచు కొనెను" (ఎఫెసీ 1:3-6). సంఘము దేవుని యొక్క రెండవ తలంపు కాదు. అది దేవుని మహాజ్ఞానములో ముందుగానే సంకల్పించ బడినసంస్థ.

**2. దానిని తన స్వంత కుమారుని రక్తముతోకొనెను :** ఈ ప్రత్యేక ప్రజలను గూర్చి పేతురు ఇంకా ఈలాగు వ్రాసెను - "వెండి బంగారముల వంటి క్షయ వస్తువుల చేత మీరు విమోచింపబడలేదు గాని అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును నిష్కళంకము నగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తము చేత విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా" (I పేతురు 1: 18-19). దేవునికి చెందిన సంఘము ఆయన స్వరక్తముతో కొనబడెనని అపొ.పౌలు చెప్పాడు (అపొ.కా. 20:28) "దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగి యున్నది" (ఎఫెసీ 1:7). దేవుడు తన సొంత కుమారుని రక్తమిచ్చి తన సంఘమును కొన్నారు. అది అంత ప్రశస్తమైనది, ప్రత్యేకమైనది. దేవుడు ఎంచినట్లుగా దానిని మానవుడు కూడా ఎంచాలి.

**3. నిత్య జీవితము కొరకు దానిని భద్రపరిచారు :** "మృతులలోనుండి యేసుక్రీస్తు తిరిగి లేచుట వలన జీవముతోకూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు అనగా అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు తన విశేష కనికరము చొప్పున మనలను మరల జన్మింపచేసెను" అని పేతురు వ్రాసెను (1 పేతురు 1:3-4). గనుక "నమ్మకమైన సృష్టికర్తకు" మన ఆత్మలను అప్పగించుకొనవలెను

**- జిమ్మీ క్లార్క్**



# మంచి జరుగునట్లు

## (That Good May Come)

**- W.T. Hamilton**



మనకు కలుగుశోధనలు, బాధలలో నుండి ఏదోమంచి జరుగునని మనము తెలిసికోగలిగితే ఎంతో బాగుండును. గాని అది ఎంత కష్టమో. ఐగుప్తు దేశములో యోసేపు బంధింపబడినప్పుడు, ఎందు కీలాగు జరిగిందని ఆలోచించు కొనుచు పలు సంవత్సరములు గడుపవలసి వచ్చినది. నిజానికి వెంటనే దొరికే జవాబు లేదు, నిజానికి ఈ అనుభవములలో నుండి మంచే జరిగింది, తన ప్రజలను అతడు రక్షించ గలిగాడు. ఒక్కోసారి దీవెనలు మారువేషంలో వస్తాయి. శోధనలు ఎదుర్కొనిన కొందరి సాక్ష్యములను గమనించుము :

**దావీదు** : "నేను నీకట్టడలను నేర్చుకొనునట్లు శ్రమనొందియుండుట నాకుమేలు" (కీర్తన 119 :71)

**యోబు** : " నేను నడుచుమార్గము ఆయనకు తెలియును. ఆయన నన్ను శోధించన తరువాత నేను సువర్ణము వలె కనబడుదును" (యోబు 23:10).

**పౌలు** : "మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల క్రీస్తుతోడి వారసులము. మనయెడల ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్న



తగినవి కావని యెంచు చున్నాను" (రోమా 8 :17-18).

**యాకోబు :** "విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానా విధములైన శోధనలలో పడునప్పుడు అది మహానందమని యెంచుకొనుడి" (యాకోబు 1:1-3).

**పేతురు :** "ప్రియులారా మిమ్ములను శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమను గూర్చి మీకేదోయొక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి. క్రీస్తుమహిమ బయలు పరచబడినప్పుడు మహాదానందముతో సంతోషించు నిమిత్తము క్రీస్తుశ్రమలలో మీరు పాలివారై యున్నంతగా సంతోషించుడి" (I పేతురు 4 :12-13)

**హెబ్రీపత్రిక లేఖకుడు :** "మరియు ప్రస్తుత మందు సమస్త శిక్షయు దుఃఖకరముగా కనబడునేగాని సంతోషకరముగా కనబడదు. అయినను దాని యందు అభ్యాసము కలిగిన వారికి అది నీతి యను సమాధానకరమైన ఫలమిచ్చును" (హెబ్రీ 12:11).

మేఘములు చాల చీకటిగా కమ్ముకొనినను, తుఫానులు భారభరిత మైనవైనను, దేవుని నోటనుండి వచ్చు ఈ బంగారు వాక్యములను జ్ఞాపకముంచు కొనుము. నేటి శోధనలలో నుండి కలుగు మంచిని గూర్చి ఆలోచించుము. "క్షణమాత్ర ముండు మా చులకని శ్రమ మా కొరకు అంతకంతకు ఎక్కువగా నిత్యమైన మహిమ భారమును కలుగజేయుచున్నది. ఏలయనగా దృశ్యమైనవి అనిత్యములు, అదృశ్యమైనవి నిత్యములు " (2 కొరింథీ 4:18).

– డబ్ల్యు టి. హేమిల్టన్

# అన్నింటిలోను దేవునికే మొదటిస్థానము నిచ్చుట ఎట్లు
## (How to Put and keep God first)

- Marilyn Lastrape

మన ప్రభువు మత్తయి 6:33లో యిచ్చిన ఆజ్ఞను ఎరరిగియేయున్నాము: "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును", యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములో చెప్పిన మాటలను బట్టి మనం జీవించ బద్ధులమైయున్నాము. పైన యిచ్చిన ఆయన ఆజ్ఞ ప్రకారము మనం ఎంత మట్టుకు జీవించుచున్నాము?

దేవునికే మొదటిస్థానం యిచ్చి జీవించాలంటే ఆయన ఎక్కడా ఏవి విషయంలోను కూడ ద్వితీయస్థానము నంగీకరించరని మనము గ్రహించాలి. ఇశ్రాయేలీయులకు ఆయన ఇట్లు విశదపర్చారు: "నీ దేవుడైన యెహోవాను నేనే; నేనే దాసులగృహమైన ఐగుప్తుదేశములో నుండి నిన్ను వెలుపలికి రప్పించితిని, నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు" (నిర్గమ 20:1-3).

నేడు అగుపడు ఆధునిక దేవుండ్లు లేక విగ్రహములుయేమిటి? వాటన్నిటిని గూర్చి వ్రాయాలంటే ఆ లిస్టు చాల పొడవుగాయుండును. ఏలయనగా అవి ప్రతివ్యక్తికి వేరుగా యుండును. అయినను మనం వాటిలో కొన్నిటిని గమనింతము. కొందరికి తమ కుటుంబసభ్యులే దేవుండ్లు, కొందరికి సంఘసభ్యులే దేవుళ్లు! కొందరికి తమ మిత్రులు సహపనివారు దేవుళ్లు, మరికొందరికి తమ ధనము, వినోదము, ఉద్యోగము, ఆటలు, కార్లు, భూములు, దుస్తులు వగయిరా, వగయిరా దేవుళ్లు! అయితే ఇవేమీ ఆయనకంటె ప్రథమ స్థానములో ఉంచకూడదని దేవుడు చెప్పుచున్నారు.

తదుపరి మనం దేవునికి మొదటిస్థానము నియ్యవలెనంటే, బైబిలును శ్రద్ధగా చదువు వారమై యుండాలి, "నీతి కొరకు ఆకలిదప్పులు గల వారు ధన్యులు, వారు తృప్తి పరచబడుదురని" యేసు చెప్పారు (మత్తయి 5:6). దేవుని వాక్యమే మన అనుదిన ఆహారమవ్వాలి. అప్పుడప్పుడు తినేదికాదు, అనుదినము దానిన మనం భుజించాలి. యోబులాంటి ఆత్మీయ ఉన్నతస్థితికి ఎదుగుటకు మనం కాంక్షించాలి. "ఆయన పెదవుల ఆజ్ఞను నేను విడిచి తిరుగలేదు, ఆయన నోటిమాటలను నా స్వాభిప్రాయము

కంటె ఎక్కువగా ఎంచితిని" అని అతడు చెప్పుచున్నాడు (యోబు 23:12).

మూడవదిగా దేవునికి మొదటి స్థానము నియ్యవలెనంటే, మనము ఎడతెగక ప్రార్థించాలి. దానిని మనమెట్లు చేయుగలము? మన మనస్సును తలంపులును పైనున్న వాటిమీదనే కేంద్రీకరించాలి మరియు మన ప్రభువు యొక్క మాటలను మనహృదయములో భద్రముగా యుంచుకోవాలి (కొలస్స 3:16). మనం అనుదినం ఎడతెగక ప్రార్థించుచుయుంటే మనహృదయము, తలంపులు దేవుని వాక్యముతో నింపబడి ఫలభరితమైన ఆత్మీయ పొలమువలె యుందుము. "ప్రార్థనయందునిలకడగా యుండి కృతజ్ఞతగలవారై దానియందు మెలకువగా యుండుడి"యని కొలస్స 4:2 చెప్పుచున్నది. మరల I థెస్స 5:16-18లో ఇట్లు చెప్పబడియున్నది. "ప్రతి విషయమునందును కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి, ఈలాగు చేయుట యేసుక్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము".

నాల్గవదిగా, దేవునికి మొదటి స్థానము ననుగ్రహించాలంటే మన తలంపులను ఒడిసిపట్టుకొని వాటిని అదుపులో యుంచుకోవాలి. కొరింధులోని క్రైస్తవులకు పౌలువ్రాస్తు, "మేము వితర్కములను దేవుని గూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి ప్రతి ఆలోచనను క్రీస్తుకులోబడునట్లు చెరపట్టియున్నాము" (2 కొరింధీ 10:5). మనము ఏదైనా చెప్పక చేయకముందు మన ఆలోచనలను అదుపులో యుంచుకోగలిగితే మన జీవితములు ఎంతో మంచిగయుండును.

మనము చెప్పుకోవలసిన అంశములు ఇంకా చాలాయున్నవి. దేవునితో సరియైన సంబంధము కలిగియుండుటకు యేసుక్రీస్తే మనకు శ్రేష్టమైన మాదిరియై యున్నారు. ఆయన ఇట్లు చెప్పుచున్నారు. "నన్ను పంపిన వాడు నాకుతోడై యున్నాడు; ఆయనకిష్టమైన కార్యము నేనెల్లప్పుడు చేతును గనుక ఆయననన్ను ఒంటరిగా విడిచి పెట్టలేదు." (యోహాను 8:29). దేవునికే మొదటిస్థానం ఇచ్చుట అంటే అదే!

- మెరిలిన్ లాస్ట్రేప్



# గొప్ప ఆజ్ఞ ఎందువలన గొప్పదాయెను?

("Why is the Great Commission Great?)

- J. Gootam



యేసుప్రభువు మృతులలోనుండి లేచిన తరువాత పరమునకు ఆరోహణుడు కాక మునుపు తన శిష్యుల కిచ్చిన ఆజ్ఞను గొప్ప ఆజ్ఞయని అందురు. దానిని మత్తయి, మార్కు, లూకా దిగువ రీతిగా తమ సువార్తలలో రికార్డు చేసిరి.

**మత్తయి 28:18-20** " అయితే యేసు వారి యొద్దకు వచ్చి పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో యుగ సమాప్తివరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను".

**మార్కు 16:15-16-** "మరియు మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి, నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింప బడును, నమ్మనివానికి శిక్షవిధింప బడును."

**లూకా 24:46-48-** "క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు, యెరుషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును పాప క్షమాపణయు ప్రకటింప బడుననియు వ్రాయబడి యున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు".

ఈయాజ్ఞ మొదట్లో అపొస్తలులకు ఇయ్యబడినను, ఈగొప్ప ఆజ్ఞ ప్రతితరములోను సంఘము యొక్క కృషిని నడిపించుటకీయబడెను. ఈయాజ్ఞ ఎందువలన గొప్ప ఆజ్ఞగా పరిగణింతురు?

**దానిలో సమస్తజనాంగములు ఇమిడియున్నందున అదిగొప్ప ఆజ్ఞ:** మత్తయి 10:5-6లో యేసు తన 12 మంది శిష్యులను పంపుచు "మీరు అన్యజనుల దారిలోనికి వెళ్లకుడి, సమరయుల యేపట్టణములోనైనను ప్రవేశింపకుడిగాని ఇశ్రాయేలు వంశములోని నశించిన గొర్రెల యొద్దకే వెళ్లుడి" యని చెప్పెను.

మార్కు 16:15లో ఆయన మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్త ప్రకటించుడియని చెప్పెను.

మత్తయి 28:19-20లో మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను ఏయే సంగతులను మీకు ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" యని చెప్పెను.

గలతీ 3:28 -"ఇందులో యూదుడని గ్రీసు దేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు. క్రీస్తుయేసునందు మీరందరును ఏకముగాయున్నారు"

**ఆ యాజ్ఞను ప్రభువైన యేసుఇచ్చెను గనుక గొప్ప ఆజ్ఞ :** "మరునాడు మరల యోహానును అతని శిష్యులలో ఇద్దరును నిలుచుండగా అతడునడుచుచున్న యేసు వైపు చూచి - ఇదిగో దేవుని గొర్రెపిల్ల అని చెప్పెను. అతడు చెప్పిన మాట ఆ యిద్దరు శిష్యులు విని యేసును వెంబడించిరి" (యోహాను 1:35-38).

యేసు ప్రభువు పునరుత్థానుడైన తరువాత ఆ పదకొండుమంది శిష్యుల యొద్దకు వచ్చి, ఇహమందును పరమందును నాకు సర్వాధికారమీయ బడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనాంగములను శిష్యులనుగా చేయుడియని చెప్పెను (మత్తయి 28:16-18).

మీరు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్షవిధించబడునని చెప్పెను (మార్కు 16:15-16).

**ప్రకటింపబడే వర్తమానమువలన అదిగొప్ప ఆజ్ఞ :** "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాజిరి. ఏలయనగా నమ్ము ప్రతివానికి రక్షణకలుగ జేయుటకు అదిదేవుని శక్తియై యున్నది" (రోమా 1:16).

"మీరు క్షయ బీజమునుండి కాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్య మూలముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడినవారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుట చేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనిన వారైయుండి యొకని నొకడు హృదయ పూర్వకముగాను మిక్కటముగాను ప్రేమించుడి. సర్వశరీరులు గడ్డిని పోలిన వారు, వారి అందమంతయు గడ్డిపువ్వు వలె ఉన్నది; గడ్డి ఎండును దాని పువ్వును రాలును, అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడును నిలుచును, మీకు ప్రకటింపబడిన సువార్త యీ వాక్యమే" (I పేతురు 1: 22-24).


**అది యిచ్చు నిరీక్షణనుబట్టి అదిగొప్పది :-**

"పునాది మీద కట్టబడినవారై స్థిరముగా ఉండి మీరు విన్నట్టియు ఆకాశము క్రిందను సమస్తసృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్త వలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోక, విశ్వాసమందు నిలిచియుండిన యెడల ఇది మీకు కలుగును. పౌలను నేను ఆ సువార్తకు పరిచారకుడనైతిని" (కొలస్స 1:23).

"మన ప్రభువగు యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడును గాక. మృతులలో నుండి యేసు క్రీస్తు తిరిగిలేచుట వలన జీవముతో కూడిన నిరీక్షణమనకు కలుగునట్లు అనగా అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు ఆయనతన విశేష కనికరము చొప్పున మనలను మరల జన్మింప చేసెను" ( I పేతురు 1: 3-4).

ఈ గొప్ప సువార్తయే క్రీస్తు సంఘమునకు జీవమును వర్తమానమును యిచ్చుచున్నది!!


**- జె. గూటం**



# జ్యోతిష్యము

## (Astrology)

- Evan Adair



కాలారంభము నుండియు మానవుడు కొన్ని జవాబుల కొరకు వెదకుచున్నాడు. అనేకులు వారి సమస్యల జవాబు కొరకు నక్షత్రముల వైపు చూస్తు జ్యోతిషాస్త్రముపై ఆధారపడుదురు. జ్యోతిష్యమునునది క్రొత్తదేమీకాదు. ఐగుప్తును పాలించిన ఫరోల కాలము నుండియు అదియున్నది (నిర్గమ 7:11).

నేడు మనమెరిగిన జ్యోతిషాస్త్రమును పూర్వకాలపు కల్దీయులు ప్రోత్సహించిరి. వారు రాశిచక్ర సిద్ధాంతమును (Zodiac Theory) ప్రవేశపెట్టిరి. తిబెరయ, నీరో అనుచక్రవర్తులు రోమాసామ్రాజ్య కార్యకలాపములను జరిపించుటకు గాను జ్యోతిషాస్త్రముపై ఎక్కువ ఆధారపడిరి. అలాగే ప్రఖ్యాతిగాంచినవారు గాని, సామాన్యులేమి తమ జీవితంలో జవాబుకొరకు జ్యోతిష్కముపై ఆధారపడి యుండిరి.

దీనిని గూర్చి బైబిలు యేమి

చెప్పుచున్నది? మీరు 'శకునములు చూడకూడదు, మంత్రప్రయోగములు చేయకూడదు" (లేవీ 19:26). మరల, " నీ విస్తారమైన యోచనలవలన నీవు అలసియున్నావు. జ్యోతిష్కులు నక్షత్ర సూచకులు మాసచర్య చెప్పువారు నిలువబడి నీమీదికి వచ్చినవి రాకుండా నిన్ను తప్పించి రక్షించుదురేమో ఆలోచించుము. వారు కొయ్య కాలువలె నైరి. అగ్నివారిని కాల్చి వేయుచున్నది, జనుల యొక్క బలమునుండి తమ్ము తాము తప్పించుకొనలేకయున్నారు" (యెషయా 47:13-14). గనుక జ్యోతిషాస్త్రము విషయమై మనమేమీ చేయాలో దేవుని ఆజ్ఞ మనకున్నది.

మొదటిగా మన సమస్యలను పరిష్కరించుకొనుటకు జ్యోతిషాస్త్రము మన ప్రశ్నలకు జవాబీయదు. రెండవది అట్టి పనులను దేవుడు కొయ్యకాలువలె కాల్చివేయును. ఇంకా ఎక్కువ చెప్పబడవలెనా? యిర్మియా 10:2 ఇట్లు చెప్పుచున్నది. "యెహోవా సెలవిచ్చున దేమనగా - అన్యజనుల ఆచారముల నభ్యసింపకుడి, ఆకాశమందు అగపడు చిహ్నములకు జనములు భయపడును, అయితే మీరు వాటికి భయపడకుడి".

క్రొత్తనింబంధనలో అపొ.పౌలు ఎఫెసులో వాక్యమును ప్రకటించినప్పుడు అనేకులైన యూదులు, గ్రీకులు ప్రభువు నందు విశ్వసించిరి. మరియు మాంత్రిక విద్యనభ్యసించిన వారు అనేకులు తమ పుస్తకములు తెచ్చి అందరియెదుట వాటిని కాల్చివేసిరి. అవి లెక్కకు యేబదివేల వెండి రూకలాయెను (అపొ.కా. 19:17-20). జ్యోతిష్యమును గూర్చి, మాంత్రిక విద్యను గూర్చి ఇంకా మనము చెప్పుకొనవచ్చును. గానిపై లేఖనము సరిపోవును.

మన సమస్యలకు ప్రశ్నలకు జవాబు గొప్ప జ్ఞానియైన ప్రభువగు యేసుక్రీస్తు నుండి రావలెను; "శరీరము కేవలము నిష్ప్రయోజనము; ఆత్మయే జీవింప జేయుచున్నది. నేను చెప్పు మాటలు ఆత్మయు జీవమునై యున్నవని" ఆయన చెప్పారు (యోహాను 6:63)


-ఈవన్ ఎడైర్



# “అలాగు జరుగుట నా ప్రజలకు ఇష్టము

## ("And my People Love it so!)

- Mike Mays




యూదా దేశమునకు ప్రవక్తయైన యిర్మియా పలికినవర్తమానమును నేటి సంఘము గ్రహించుకొనవలసియున్నది. “ ఘోరమైన భయంకర కార్యము దేశములో జరుగుచున్నది. ప్రవక్తలు అబద్ధప్రవచనములు పలికెదరు, యాజకులు వారి పక్షమున ఏలుబడి చేసెదరు, అలాగు జరుగుట నా ప్రజలకు ఇష్టము; దాని ఫలము పొందు నప్పుడు మీరేమిచేయుదురు?” (యిర్మియా 5 :30-31). ఇట్లు జరుగుటకు బాధ్యత అంతా నాయకులదే, అయినను ప్రజలు కూడ దానికి బాధ్యులే. అలాగే జరగాలని వారు కోరుకొనుచుండిరి.

ప్రవక్తయైన యిర్మియాకాలము లో వలె నేడు కొందరు బోధకులు దేవుని నోటనుండి గాక మానవ హృదయము నుండి వచ్చిన వర్తమానమును ప్రకటించుచున్నారు. ఆనాటి యాజకుల వలెనేటి సంఘ పెద్దలు నాయకులు బైబిలు యొక్క అధికారమును ప్రక్కన బెట్టి తమ అధికారము చొప్పున దైవ కార్యములు జరిగించుచున్నారు. దిగువ సంగతులనాలోచించుము:

బాప్తిస్మము పొందకపోయినను భక్తిపరులైనవారు రక్షించబడుదురు అని కొందరు చెబుతారు. బాప్తిస్మము పొందకపోయినను మారుమనస్సుకు

తగిన జీవితం జీవించువారు దేవుని కృపలో చేర్చబడాలని వారు చెబుతారు. అయితే మనము క్రీస్తులోనికి, ఆయన మరణములోనికి ఆయన సంఘములోనికి, రక్షణకొరకు బాప్తిస్మము పొందుదుమని లేఖనములు చెప్పుచున్నవి. వారురైటా? లేఖనములు రైటా? (రోమా 6:3, I కొరింథీ 12:13, గలతీ 3:27; 2 తిమో 2:10).



కొన్ని సంఘములు తమ ఆరాధనలో వాద్య సంగీతమును ప్రవేశపెట్టియున్నారు. వాద్య సంగీతము కొరకు క్రీస్తు చనిపోలేదని వారు వాదించుదురు. ఆరాధనలో దైవానుమతి బడయని సంగతులనుపయోగిస్తే కలిగే పర్యవసానమును నాదాబు, అబీహుల నుండి వీరేమీ నేర్చుకొనరా? (లేవీ 10:1-2). మతసంబంధ కార్యము లకు దేవుని అనుమతి అవసరం అనే అజ్ఞ నేడు వర్తించదా? (కొలస్స 3:17). ఆరాధనలలో స్త్రీ బోధకులను, డ్రామాలను వేయుటకు అనుమతినిచ్చే ఆజ్ఞ ఎక్కడున్నది? లేఖనములలో ఎక్కడా లేదు!

మరింత 'వినోదదాయకమైన ఆరాధన' కావాలని కోరుకొనేవారు సత్యారాధనను విసర్జించువారు. ఆరాధనలో దేవుడు కోరుకొనేవి జరిగించాలా? లేక మానవుడు కోరుకొనేవి జరిగించాలా? ఆరాధనలో సంతోషపరచబడునది దేవుడేగాని మనకు అయితే అది స్వేచ్ఛారాధనయే. అయితే అది వ్యర్థము. సత్యారాధన ఎల్లవేళలా దేవుని సంతుష్టిపరచునదై యుండును. అది ఆయన చిత్త ప్రకారముండును. ఆరాధకుని హృదయములోనుండి వచ్చును (యోహాను 4:24; మత్తయి 15:8-9).

యూదులు యేమిచేయుదురో చెప్పుచు యిర్మియా తన ప్రశ్నను ముగించుచున్నాడు. దేవుడొక్కడే కడవరి తీర్పరి ఆయన చిత్తమును నిరాకరించు వారిని గూర్చి ఆయన వాక్యము శుభసూచనలేమీ ఇచ్చుటలేదు (యోహాను 12:48). భక్తిహీనులను సంఘములోనికి ఆకర్షించు నిమిత్తము సంఘనాయకులు గైకొను స్వకీయ సిద్ధాంత చర్యలు హేయమైనవి. అలాగు జరుగుట ప్రజలకు యిష్టమైతే అది మరింత హేయకరము!!

- మైక్ మేస్

# పౌలు యొక్క జీవిత చరిత్ర

## ( The Life of Paul)

- Luke Grffin

ఆదిమ సంఘాభివృద్ధికి కారకులైన వారిలో ముఖ్యుడు అపొస్తలుడైన పౌలు. పౌలు యొక్క జీవితం, బోధలు, సువార్త యాత్ర మొదలగువాటిని గూర్చి అతడు వ్రాసిన పత్రికలలో అక్కడక్కడా మనకు కొంత లభించును. పౌలు యొక్క సహచరుడగు లూకా వ్రాసిన అపొస్తలుల కార్యముల గ్రంథములో పేతురు యొక్కయు (అపొ.కా. 1-12 అధ్యా) పౌలు యొక్కయు (అపొ.కా. 15-28) జీవిత చరిత్ర కొంత మనకు లభించును. పౌలు యొక్క జీవితంలో సంభవించిన కొన్ని ఘటనలు దిగువ క్లుప్తముగా వివరించబడినవి. ఆయా తేదీలు బైబిలును బట్టి, చరిత్రను బట్టి ఇంచుమించుగా ఇయ్యబడినవి.

**పౌలు యొక్క ఆరంభజీవితం :**

- అతడు తార్సులో జన్మించెను (అపొ.కా. 21:39)
- యెరూషలేములో గమలియేలు నొద్ద విద్యనభ్యసించెను....(అపొ.కా. 22:3)

  సంఘమును ఘోరముగా హింసించెను
- స్తెఫనును రాళ్ళతో కొట్టించెను. (అపొ.కా. 7:57-8:1)
- సంఘమును హింసించుటకు అత్యాసక్తి కలిగియుండెను (అపొ.కా. 8:3; I కొరింథీ 15:9).
- దమస్కులోని క్రైస్తవులను హింసించుటుకు సంకల్పించెను (అపొ.కా. 9:1-2)

**పౌలు మార్పుజెందుట : (A.D.36)**

అపొ.కా. 9:1-19; 22:4-16; 26:12-20 జోసిఫస్ అనుయూదుల చరిత్రకారుడు అరెత అను రాజును గూర్చి వ్రాసెను. అరెత అనువాడు అరేబియాకు రాజు, అతని చేతిలో నుండి పౌలు క్రీ॥శ 39లో తప్పించుకొనెను. 2 కొరింథీ 11:32లో పౌలు అరెతను గూర్చి చెబుతాడు.

a . క్రీ॥శ 37-39 అతడుదమస్కులోను అరేబియాలోను వుండెను (అపొ.కా.9:17-22; 26:19-20; గలతీ 1:15-18).

b. క్రీ॥శ 39 - దమస్కు నుండి తప్పించుకొని యెరుషలేముకు మొట్ట మొదటిగా వెళ్లెను (గలతీ 1: 15-18, అపొ.కా. 9:23-26; 2 కొరింథీ 11: 32-33)

c . క్రీ॥శ 39-43 (4లేక 5సం॥లు) అతడు తార్సులోను, కిలికియలోను, సిరియాలోను వుండెను (అపో.కా. 9:29-30; గలతీ 1:21-24)

d . క్రీ॥శ 44- బర్నబాతో అంతియొకయ లో వుండెను. (అ.పో.కా. 11:25-29)

e . క్రీ॥శ 44- యెరుషలేముకు ఆర్థిక సహాయము తీసికొని వెళ్లెను (అపో.కా. 11:27-30; 12:25)

**హేరోదు అగ్రిప్ప యొక్క మరణము (క్రీ॥శ 44)**

a . క్రీ॥శ 44-47 మొదటి సువార్తయాత్ర (అపో.కా. 13:1-3),

b . క్రీ॥శ 48-49 అంతియొకయకు తిరిగివచ్చి చాలకాలము అక్కడ వుండుట. బహుశ రెండు సంవత్సరములు అక్కడగడిపెను (అపో.కా. 14:25-28)

**పౌలు యెరుషలేముకు మూడవసారి ప్రయాణం (A.D. 50) :**

పౌలు మార్పుజెందిన 14 సంవత్సరముల తరువాత యెరుషలేముకు వెళ్లినట్లు గలతీ 2:1 చెప్పుచున్నది. అంతియొకయలో క్రైస్తవులుగా మార్పుజెందిన యూదులు లేవనెత్తిన సమస్యను పరిష్కరించుటకు గాను అతడు ప్రయాణము చేసెను. అన్యజనులలో నుండి క్రైస్తవులైనవారు సున్నతి పొందుట విషయమైన సంగతిని అపొస్తలులతోను పెద్దలతోను అతడు చర్చించెను.

a . క్రీ॥శ 51-54 రెండవ సువార్త యాత్ర (అపో.కా. 15:36-41) క్రీ॥శ 52 - కొరింథులో యుంటూ I థెస్సలోని కయులకు పత్రిక వ్రాసెను ( I థెస్స 1:1; 3:6)

క్రీ॥శ 53 - కొరింథులోయుంటూ II థెస్సలోని కయులకు పత్రిక వ్రాసెను. (2 థెస్స 1:1)

b . క్రీ॥శ 54-58 మూడవ సువార్త యాత్ర (అపో.కా. 18:22-23)

క్రీ॥శ 57- ఎఫెసులో యుంటూ I కొరింథీయులకు పత్రిక వ్రాసెను (I కొరింథీ 16 : 8)

క్రీ॥శ -57 మాసిదోనియ నుంచి 2 కొరింథీయుల పత్రిక వ్రాసెను.

క్రీ॥శ - 57 శీతాకాలము -కొరింథు నుంచి గలతీయులకు వ్రాసెను

క్రీ॥శ - 58 వసంతకాలము కొరింథునుంచి రోమయులకు వ్రాసెను.

c . క్రీ॥శ 58 - యెరుషలేముకు తిరిగి వచ్చెను (అపో.కా. 21:17-26)

క్రీ॥శ 58- దేవాలయములో పౌలు బంధింపబడెను (అపో.కా. 21:27-23:11).

క్రీ॥శ 58-60 - కైసరయలో పౌలు

బంధింపబడుట.

**V ఫేలిక్సు అధిపతిగా యుండుట (క్రీ॥శ 60 లేక 61) :**

a . క్రీ॥శ 60 – ఫేలిక్సు స్థానములో ఫేస్తు అధిపతిగా చేయబడినప్పుడు పౌలు బందీగాయుండెను. ఈ సంఘటన క్రీ॥శ 60లో గాని 61లో గాని జరిగినట్లు జోసిఫస్, టేసిటస్, సుటోనియన్ అనుచరిత్రకారులు చెప్పుదురు.

b . క్రీ॥శ 60 రోమాకు ప్రయాణము (అపొ.కా. 27:1-28-28:16)

**VI. రోమాకు పౌలు చేరుకొనుట (క్రీ॥శ 61 లేక 62 వసంత కాలము) :**

ఫేస్తు అధికారములోనికి రాగానే పౌలు రోమాకు వెళ్లెను. ఈ ప్రయాణము యొక్క వివరములు అపొ.కా. 27:1-28:15లో వ్రాయబడి యున్నవి.

a . క్రీ॥శ 61-63 రోమాలో మొదటిసారిగా బంధింపబడుట (అపొ.కా. 28:16-31)

1. పౌలు ఫిలెమోనుకు పత్రిక వ్రాసెను
2. కొలస్సయులకు వ్రాసెను
3. ఎఫెసీయులకు వ్రాసెను
4. ఫిలిప్పీయులకు వ్రాసెను.

b క్రీ॥శ 63-67 రోమాలో రెండవసారి బంధింపబడకముందు కాలము

క్రీ॥శ 67 – తిమోతికి పౌలు మాసిదోనియ నుండి పత్రిక వ్రాసెను (I తిమో 1:3; 3:14-15)

క్రీ॥శ 67 – ఎఫెసునుండీ తీతుకు పత్రిక వ్రాసెను

క్రీ॥శ 68 – రోమాలో 2వసారి బంధింపబడుట (2 తిమో 1:8, 2:8-9)

క్రీ॥శ 68 – తిమోతికి రోమా నుండి 2వ పత్రిక వ్రాసెను .

క్రీ॥శ 68 – 2వ తిమోతి వ్రాసిన తరువాత, నీరో చక్రవర్తి మరణించకముందు (క్రీ॥శ॥ 68, జూన్ 9) పౌలు యొక్క మరణము (2 తిమో 4:6)

**గమనిక :** పౌలు రోమాలో బంధింపబడిన తరువాత లూకా తన వ్రాతలను ముగించెను. పౌలు యొక్క మరణ సంఘటనలను గూర్చి విద్యావేత్తలు తరుచూ లెక్కించేవారు. పౌలు బందీగృహము నుండి విడుదల పొందెనని, నాలుగైదు సంవత్సరముల వుట్టుకు తన ప్రయాణములను కొనసాగించెననునది బలమైన అభిప్రాయము. తదుపరి అతడు మరలా రోమాకు కొనిపోబడెను; అతడు బందీగానే బహుశా మరణించెను లేదా నీరో యొక్క అజ్ఞ వలన అతనికి మరణశిక్ష అమలు పరచబడెను.

**–లూక్ గ్రిఫిన్**

# అమజ్యాలాంటి మూర్ఖత్వపంతము

## ( Stubborn as Amaziah )

- Neal Pollard

నాకు తెలిసినంతమట్టుకు "అమజ్యాలాంటి మూర్ఖత్వపంతము" అనునది ఒక సామెత కాదు. గాని అది సామెత అయినా అయ్యుండవచ్చును. అతడు మనకు పరిశుద్ధ గ్రంథములో పరిచయము చేయబడినప్పుడు అతని గూర్చి ఇట్లు చెప్పబడెను. "అమజ్యాయేలనారంభించినప్పుడు ఇరువదియయిదేండ్ల వాడై యిరువది తొమ్మిది సంవత్సరములు యెరూషలేములో ఏలెను... అతడు యెహోవా దృష్టికి యథార్థముగా ప్రవర్తించెను. **గాని పూర్ణహృదయముతో ఆయనను అనుసరింపలేదు**" (2 దినవృ 25:1-2) ఇటువంటి మాటలు చెప్పబడిన రాజులు యూదాలో అనేకులులేరు. ఇశ్రాయేలు దేశములో ఎవరులేరు. అమజ్యాయెహోవా దృష్టికి యథార్థముగా ప్రవర్తించెను. గాని పూర్ణహృదయముతో ఆయనను అనుసరించలేదు. అతడు మోషే ధర్మశాస్త్రమును గౌరవించెను (25:4) గాని అతని యేలుబడిలో మొదటి దినము నుండి పోరాట తత్వమును ప్రదర్శించెను. అతడు యూదావారి నందరిని సమకూర్చి వారిని యుద్ధమునకు సన్నద్ధము చేసెను. దేశమందలి జనాభాను లెక్కించెను. మరియు ఇశ్రాయేలు దేశమునుండి లక్షమంది పరాక్రమశాలులను జీతమునకు కుదుర్చుకొనెను.

లేఖనములలో పెద్దగా గుర్తింపు లేనివాడైనను అతడు పదేపదే హెచ్చరింపబడెను. ఇశ్రాయేలు దేశము నుండి జీతగాళ్ళయిన సైనికులను అతడు కుదుర్చుకొనిన తరువాత దేవునిచేత పంపబడిన మనుష్యుడొకడు అతని యొద్దకు వచ్చెను. అతడిట్లనెను. "రాజా ఇశ్రాయేలు సైన్యమును నీతోకూడ తీసికొనిపోవద్దు, యెహోవా ఇశ్రాయేలు వారగు ఎఫ్రాయీమీయులలో ఎవనికిని తోడుగా ఉండడు. అలాగుపోవలెనని నీకున్న యెడలపొమ్ము. యుద్ధము బలముగా చేసినను దేవుడు నీ శత్రువు ఎదుట నిన్ను కూల్చును; నిలువబెట్టుటయు పడవేయుటయు దేవుని వశమేగదా" (25:7-8). దేవుని ఈ హెచ్చరిక మాటలను చివరకు అమజ్యా నిర్లక్ష్యము చేసెను.

అమజ్యా ఎదోమీయులను ఓడించి తిరిగి వచ్చుచు వారి దేవతలను తీసికొని వచ్చి తనకు దేవతలుగా నిలిపి వాటికి

నమస్కరించి వాటికి ధూపము వేసెను (25:14). అందువలన యెహోవా కోపము అమజ్యా మీద రగులు కొనెను. అమజ్యాను గద్దించుటకు ఆయన ఒక ప్రవక్తను అతని యొద్దకు పంపెను (25:15). అయితే అమజ్యా ఆ ప్రవక్త ప్రాణము తీతునని భయపెట్టెను. "నీవు ఈలాగుచేసినా నా ఆలోచనను అంగీకరింపకపోవుటచూచి దేవుడునిన్ను నశింపజేయనుద్దేశించియున్నారని నాకు తెలియునని చెప్పి'' ఆ ప్రవక్త ఊరకుండెను (25:16). ఈ హెచ్చరికను అతడు లెక్కపెట్టినట్లు లేఖనములలో ఎక్కడాకనబడదు.

సరిగదా అతడు ఇశ్రాయేలు రాజైన యెహోయాషును యుద్ధమునకు సవాలుచేసెను. యెహోయాషు నీతి మంతుడు కాకపోయినను అతనికొక చిన్న ఉపమానము చెప్పి, ''నీ హృదయము నీవు గర్వించి ప్రగల్భము లాడునట్లు చేయుచున్నది. యింటి యొద్ద నిలిచియుండుము; నీవును నీతోకూడ యూదావారును అపజయ మొందుట యెందుకు?'' అని జవాబిచ్చెను (25:19). అయితే అమజ్యా విననొల్లక యుద్ధమునకుపోగా అతడు ఇశ్రాయేలువారి యెదుట నిలువలేక ఓడిపోగా, అతడును అతని ప్రజలును కొల్లగొట్టబడిరి. ఇశ్రాయేలురాజు దేవుని మందిరములోనున్న వెండి అంతయు, బంగారమంతయు, జీతగాండ్రయిన సైనికులును తనతో తీసికొనిపోయెను (25:21-24). తదుపరి పదిహేను సంవత్సరముల తరువాత అతడు కుట్రవలన ప్రజలతో చంపబడెను (25:27).

మూర్ఖత్వము పట్టుదలకు గొప్ప ఉదాహరణగా అమజ్యామనకు కనబడు చున్నాడు. మన సంగతియేమిటి? జ్ఞానయుక్తమైన మంచి సలహాలను గుర్తించి వాటిని పాటించుట మనకు చేతనగునా? లేదా అమజ్యావలె కఠిన పాఠములను నేర్చుకొనవలసి వచ్చునా? జాగ్రత్త! పనికిమాలిన పంతము యొక్క మూల్యము చాలా గొప్పది. నిజానికి లేఖనములలో అనేకులు ఇట్టి పంతమును ప్రదర్శించినట్లు మనకు కనబడుచున్నది. అది ఎన్నడు మంచిదికాదు. మోషేను ఎదురించిన ఫరోరాజు అందులో ప్రథముడు. మరియు న్యాయాధిపతుల కాలములో ఇశ్రాయేలీయులు మరొక ఉదాహరణ మనం గజిబిజిగా యుండకూడదు. మరియు మంచి సలహాలను గుర్తించి పాటించదగిన వారముగాయుండాలి. అమజ్యావలె మూర్ఖత్వపు పంతము పాటించవద్దు!

–నీల్ పోలార్డ్



# రక్తము ద్వారా విమోచన

## ( Redemption by Blood )

- Gerald Paden



రక్తబలి అర్పణ ద్వారా పాపవిమోచన కలుగునను భావమును చెరగని రీతిగా లేవీయకాండము తెలియజేయుచున్నది. రక్తమును తినకూడదని దేవుడు ఇశ్రాయేలీయులను నిషేధించినట్లు లేవీ 17:11లో మనము చూడగలము. "రక్తము దేహమునకు ప్రాణము. మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయునట్లు బలిపీఠము మీదపోయుటకై దానిని మీకిచ్చితిని. రక్తము దానిలోనున్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము చేయును. కాబట్టి మీలో ఎవడును రక్తమును తినకూడదనియు మీలో నివసించు ఏ పరదేశియు తినకూడదనియు నేను ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించితిని" (లేవీ 17:10-12). "పాపము చేయు వాడే మరణము నొందునని" ఆయన చెప్పినప్పుడు,

పాపమువలన ఒకడు చనిపోవును లేదా తనస్థానములో దేవునికి ఆమోద యోగ్యమగు వేరొక దానిని తనకు బదులుగా అర్పించును. యిట్టిది త్యాగపూరిత ప్రాయశ్చిత్తము అనబడును. అందువలన ఒక జంతువు తన రక్తము నర్పించినప్పుడు, అదితన ప్రాణము నర్పించును.

### భవిష్యత్తులో జరుగు గొప్ప బలియాగము

నిజానికి యిదంతా యేసుప్రభువు ఇష్ట పూర్వకముగా మానవజాతి రక్షణార్థము తనప్రాణమును ధారపోవు దానికి సాదృశ్యముగా యున్నది. రక్తము ద్వారా విమోచనయను భావాన్ని లేవీయ కాండము దృఢముగా నిరూపించు చున్నది. మోషేధర్మశాస్త్రము పాపపు సమస్యను పరిష్కరించగలిగినది కాదని లేవీకాండము బలపరచుచున్నది. అదట్లు జరిగించాలని ఎన్నడు ఉద్దేశించబడలేదు. "ఏలయనగా ఎడ్ల యొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" అని హెబ్రీ పత్రిక లేఖకుడు తెలియజేయు చున్నాడు (హెబ్రీ 10:4). గనుక అర్పింపబడే ఈ జంతుబలులన్నిటి వెనుక, పాపము యొక్క సమస్యను ఇక లేకుండా పరిష్కరించు ఒకే ఒక్క గొప్పబలి రాబోవుచున్నదనే వాస్తవము బహిర్గతము చేయబడుచుండెను. ఆ కడవరిబలి యేసుక్రీస్తే.

మరియు ఈ బల్యర్పణ పద్ధతిలో, మోషేధర్మశాస్త్రము శాశ్వతముగా నిలుచుండేది కాదని కూడ బహిర్గతము చేయబడుచుండెను. అది తాత్కాలికం, అశాశ్వతం, మోసికొనిపోబడుచున్న ప్రత్యక్షగుడారము మోషే ధర్మశాస్త్రము యొక్క తాత్కాలిక స్థితిని చెప్పకనే చెప్పుచు చివరకు అది అంతమొందించబడునని సూచించుచున్నది.

### రెండు రకములైన ప్రవచనములు :

అందువలన లేవీ యాజక ధర్మము ఒక ప్రవచనముగాయున్నది. అది యేసు క్రీస్తును గూర్చిన ప్రవచన పద్ధతి మరియు ఒక విధముగా క్రైస్తవులను గూర్చికూడ అది ప్రవచించుచున్నది.

పాతనిబంధనలో ముఖ్యముగా రెండు రకములైన ప్రవచన విధానము మనకు కనబడును. ఒకటి వాక్పూర్వక ప్రవచనము (Verbal Prophecy). యిది సూక్ష్మముగా నోటిమాటలతో చెప్పే ప్రవచనము. రాబోవు మెస్సీయను గూర్చి, ఆయన జీవితమును గూర్చి సాధారణంగా నోటిమాటలతో పలుకు ప్రవచనము ఉదా: కీర్తనలు 2:6-7లో, దేవుడు "నేను నా పరిశుద్ధ పర్వతమైన సీయోనుమీద నా రాజును ఆసీనునిగా చేసియున్నాను. కట్టడను నేను వివరించెదను. యెహోవా నాకీలాగు సెలవిచ్చెను - నీవు నా కుమారుడవు నేడు నిన్ను కని యున్నాను" అని చెప్పెను. గనుక యిది క్రీస్తు పునరుత్థానము యొక్క ప్రవచనము.

అపొ.కా. 2లో అపొ.పేతురు ఈ ప్రవచనమును ఎత్తి చూపించాడు. దేవుడు తన పరిశుద్ధుని పాతాళములో విడువలేదని ఆయన తన పరిశుద్ధునికి కుళ్లుపడనియ్యడని దాని వివరణను పేతురు అక్కడ యిచ్చెను.

దీనిని 16వ కీర్తన వాక్పూర్వక ప్రవచనముగా మనకు చెప్పుచున్నది.

క్రీస్తు ఒక కన్యకు జన్మించునని, ఆయునకు ఇమ్మానుయేలను పేరు పెట్టబడునని యెషయా 7:14లో ప్రవచింపబడెను. కీర్తన 22:16-18లో క్రీస్తు సిలువను గూర్చిన వాక్పూర్వక ప్రవచనమున్నది.

"వారు నా చేతులు నా పాదములు పొడిచియున్నారు. నా యెముకలన్నియు నేను లెక్కింపగలను. వారు నిదానించుచు నన్ను తేరి చూచుచున్నారు. నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు, నా అంగీకొరకు చీట్లువేయుచున్నారు".

క్రీస్తుయొక్క త్యాగపూరిత బలిని గూర్చిన ఈ వివరణలు కొన్ని వందల సంవత్సరముల ముందే ప్రవచ నాత్మకముగా బయలు పరచ బడెను. మెస్సీయ బేత్లెహేములో జన్మించునని మీకా 5:2లో వందలాది సంవత్సరముల ముందే ప్రవచింపబడెను. యివి నోటిమాట ద్వారా బయల్పరచ బడిన ప్రవచనముల ఉదాహరణగా యున్నవి.

## పద్ధతిప్రకార ప్రవచనము
## (System Prophecy)

వాక్పూర్వక ప్రవచనమేగాక పద్ధతి ప్రకారమైన వేరొకరకమైన ప్రవచనము కలదు. పద్ధతి ప్రకారమైన ప్రవచనములో అనేక సంఘటనలు వ్యక్తులు, కార్య కలాపములు, సందర్భములు వగయిరా కలిసి ఒక విషిష్టమైన ప్రవచనముగా సూచించబడును. ఇట్టివి చరిత్రాత్మక సందర్భమును బట్టి భవిష్యత్తు లో క్రీస్తును గూర్చి సూచించును. ప్రవచించును.

ఇందును గూర్చిన ఒక ఉదాహరణ : సంఖ్యాకాండము 21:6 లో ఇశ్రాయేలీయులు అల్పవిశ్వాసమును బట్టి దేవునికి వ్యతిరేకముగా సణగిరి. దేవుడు వారి మధ్యకు విషసర్పములను పంపగా అనేకులు వాటివలన కాటువేయబడి మృత్యువాతబడిరి. మరణకరమైన ఆసర్ప కాటునుండి వారిని రక్షించుటకు, దేవుడు ఇత్తడి సర్పము నొకదానిని చేయించుమని మోషేకు ఆజ్ఞాపించెను. "ఆసర్పము యొక్క ప్రతిమను చేయించి స్తంభము మీద పెట్టుము, అప్పుడు కరవబడిన ప్రతి వాడును దానివైపు చూచి బ్రతుకునని" ఆయన మోషేకు చెప్పెను (సంఖ్యా 21:8).

జరిగిన ఈ సంఘటన శీర్షికను యేసు యొక్క సిలువకు సూచనగా యోహాను దానిని ఉదహరించియున్నాడు.

"అరణ్యములో మోషేసర్పమును ఏలాగు ఎత్తెనో ఆలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్యజీవము పొందునట్లు మనుష్య కుమారుడు ఎత్తబడవలెను" (యోహాను 3:14-15).

సంఖ్యాకాండము 21లో జరిగిన సంఘటనలను యేసు క్రీస్తుసిలువ యొక్క ప్రవచనముగా యోహాను పరిగణించి యున్నాడు. ఆ విషసర్పముల యొక్క సంఘటన యేసుక్రీస్తును గూర్చిన గురుతు, పద్ధతి ప్రకారమైన ప్రవచనము.

## ఇశ్రాయేలీయుల అరణ్య అనుభవము

నిర్గమకాండములో జరిగిన సంఘటనల శీర్షిక అంతయు ఒక పద్ధతి ప్రకారమైన ప్రవచనమే. నిజానికి నిర్గమకాండమంతయు ఇట్టి ప్రవచనమే. ఇశ్రాయేలీయులను మోషే ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించి, వారిని అరణ్యములోనికి కొనిపోవచ్చాడు. వారు వాగ్దాన దేశమునకు ప్రయాణమై పోవుచుండిరి. హెబ్రీపత్రిక 3,4 అధ్యాయములు యేసు ఆరంభించిన క్రొత్త నిర్గమమును మనకు వర్ణిస్తాయి. యేసుప్రజలను తమ పాపముల 'ఐగుప్తు' నుండి విడుదల చేసి క్రీస్తుయొక్క రాజ్యములోనికి నడిపించు చున్నారు. గనుక నిర్గమకాండము యొక్క సంఘటనలన్నియు క్రీస్తును గూర్చి ఆయన అనుగ్రహించు విముక్తిని గూర్చిన ప్రవచన శీర్షికయై యున్నది.

## ప్రవచనాత్మకమైన పస్కా

మరల లూకా 22:15లో యేసుప్రభువు చరిత్రాత్మకమైన పస్కాను ఆచరించుట మనము చూడగలము. యేసును తన అపొస్తలులును దానిలో పాల్గొనిరి. "అప్పుడాయన - నేనుశ్రమ పడకమునుపు మీతో కూడా ఈ పస్కాను భుజింపవలెనని మిక్కిలి ఆశపడితిని, అదిదేవుని రాజ్యములో నెరవేరువరకు ఇక ఎన్నడును దాని భుజింపనని మీతో చెప్పుచున్నానని వారితో చెప్పెను" (లూకా 22:15-16). యేసుయొక్కమాటలను బట్టి పస్కాను ఆయన ప్రవచనముగా భావించెనని అది ఆయన యందు నెరవేరవలసియున్నదని ఆయన ఎరిగియున్నారని మనం గ్రహించగలము. ప్రవచనము కోరేది అదే... దానినెరవేర్పే! ప్రవచనము నెరవేరవలెను లేదా దానిని గూర్చిన ఆకాంక్ష విఫలమగును. పస్కాలో ఇమిడియున్న ప్రవచనములను ఆయన నెరవేర్చ వలసియున్నదని యేసు ఎరిగి యుండెను, అందుకే "క్రీస్తు అనుమనపస్కా పశువు వధింపబడెను గనుక పాతదైన పులిపిండితోనైనను, దుర్మార్గతయు దుష్టత్వమునను పులిపిండి తోనైనను కాకుండ నిష్కాపటమును సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతము" అని I కొరింథీ 5:7-8లో పౌలు చెప్పెను. ఇంకొకమాటలో హెబ్రీయులకే కాదు, క్రైస్తవులకు కూడా పస్కాయున్నది. హెబ్రీయులు ఒక

మచ్చలేని గొర్రెపిల్లను పస్కా పశువుగా వధించేవారు. మనగొర్రెపిల్ల అయితే మచ్చలేని దేవుని గొర్రెపిల్ల యగుప్రేమమూర్తియైన యేసుక్రీస్తే. ఆయన రక్తము విశ్వాసము ద్వారా మన హృదయ ద్వారబంధముల మీద చిలకరింపబడెను, పాపము యొక్క బానిసత్వము నుండి మనము విడుదల చేయబడియున్నాము. మనం ఇప్పుడు వాగ్దానము చేయబడిన పరలోకము వైపు ప్రయాణించు చున్నాము. యిదంతా సంఘట నాత్మకమైన పద్ధతి ప్రవచనమే!

**యేమీ విరుగని ఎముకలు**

హెబ్రీయుల పస్కా గొర్రెపిల్ల విషయమైన ఆసక్తిజనక వాస్తవం ఒకటియేమంటే, దాని ఎముకలలో ఒక్కటి కూడా విరుగకూడదు (నిర్గమ 12:46). నిజానికి దాని ఎముకలలో ఏదియు విరుగకూడదు అనే ఆజ్ఞలో ప్రత్యేకతయేమీ వున్నట్లగుపడదు. గాని అంతతేలికగా కనబడుచున్న ఆజ్ఞ సిలువపై యేసు యొక్క ఎముకలలో ఏదియు విరుగకుండుటలో గొప్ప భావార్థమును సంతరించుకొనుచున్నది. "అతని యెముకలలో ఒకటైనను విరువ బడదు అను లేఖనము నెరవేరునట్లు ఇవి జరిగెను" (యోహాను 19:36). సైనికులు వచ్చి యేసుతో కూడ సిలువ వేయబడిన వారి యిద్దరి కాళ్లను విరుగగొట్టిరి. వారు యేసు నొద్దకు వచ్చి అంతకుముందే ఆయన మృతి పొందియుండుట చూచి ఆయన కాళ్లను విరుగ గొట్టలేదు'' (యోహాను 19:22-33). సైనికులు వచ్చుసరికి ఆ యిద్దరు దొంగలు ఇంకా బ్రతికేయుండిరి. పస్కానాడు వారు సిలువపై వ్రేలాడ కుండునట్లు సైనికులు వారి కాళ్లను విరుగగొట్టి వారి మరణమును వేగవంతముచేసిరి. అయితే యేసు అప్పటికే మృతిబొంది నందువలన వారాయన ఎముకలను విరుగగొట్టలేదు. ఇశ్రాయేలీయుల పస్కాలో యేసు సిలువపైనే నిజముగా మృతి బొందునట్లు దేవుడు ఏర్పాటు చేసెను. యేసుసిలువపై స్పృహకోల్పోయెనని, నిజముగా పునరుత్థానము జరుగలేదని సాతాను కల్పించబోయే కట్టుకథకు దేవుడు ఆదిలోనే అంతమును సంకల్పించెను. ఇవ్విధమైన పద్ధతి ప్రకారమైన సంఘటనాత్మక ప్రవచనము మన విశ్వాసాన్ని బలపరుచును, చరిత్రను స్థిరపరచును.

పునరుత్థానమును శంకించువారు బయలుదేరుదురని దేవుడెరిగిన వాడై యేసు యొక్క ఎముకల విషయమైన సంఘటనలో దేవుడు వారికి ఖచ్చితమైన రుజువును సమర్పించి వారి అపోహలను పటాపంచలు చేసెను.

**ప్రవచనాత్మక జలప్రళయము**


ఆదికాండము 7లో సంభవించిన జలప్రళయమునకును క్రైస్తవుల బాప్తిస్మముకును సారూప్యమున్నదని

అపొ. పేతురు సవిస్తరముగా మనకు తెలియజేయుచున్నాడు. ఈ లోక మంతయు పాపముతో నిండి పొంగిపొర్లు చున్నందున, దేవుడు ఈ పాపపు ప్రజలను గొప్ప జలప్రళయముతో నాశనము గావించారు. అయితే ఆ జల ప్రళయములో ఎనిమంది మాత్రమే రక్షింపబడ్డారని కూడా అపొ. పేతురు చెప్పుచున్నాడు. (I పేతురు 3:20). 21వ వచనములో దాని యొక్క ఆత్మీయ భావార్థము నతడు చెబుతు "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" యని అతడు చెప్పెను. నోవహు కాలమునాటి పాప ప్రపంచము భౌతికంగా జలప్రళయ ములో నశించెను. ఇప్పుడు దానికి సాదృశ్యముగా యున్న పాపలోకమును బాప్తిస్మము ద్వారా దేవుడు నశింప జేయుచున్నారు. గనుక ఈ రెండింటికి ఒక సమానాంతర మున్నది. పాత నిబంధన జలప్రళయములో క్రైస్తవ బాప్తిస్మము యొక్క సాదృశ్యమున్నది. నోవహుకాలము నాటి జలప్రళయము నాటి పాప ప్రపంచము నుండి దేవుడు వారిని ఎట్లు రక్షించెనో అట్లే పాపియైన వాడు బాప్తిస్మము పొంది రక్షింపబడ వచ్చును. బాప్తిస్మము పొందు వానిని రక్షించేవాడు యేసుక్రీస్తే.

## యెషయాలో పద్ధతిప్రవచనము

గనుక ఈ భౌతిక సంఘటనలు ఆయాశీర్షికలుగా ఆత్మీయ భావార్థముతో నిండియున్నవి. యెషయా 35వ అధ్యాయ మును చదివిన యెడల క్రీస్తు వాక్యము యొక్క వివరములను అక్కడ కనుగొనగలవు. "అక్కడ దారిగా నున్న రాజమార్గమేర్పడును. అది పరిశుద్ధమార్గ మనబడును. అది అపవిత్రులుపోకూడని మార్గము. అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును. మూఢులైనను దానిలో నడుచుచూ త్రోవ తప్పకయుందురు" (యెషయా 35:8). 'క్రీస్తు తన ప్రజల కనుగ్రహించు ఆత్మీయ వాస్తవములను భౌతిక సంగతులతో యెషయా అక్కడ ఉదహరించాడు. ఎడారిలో ఎండిన భూమి బహుగా పూయుచు ఉల్లసించును. చెవిటి వారి చెవులు విప్పబడును, గ్రుడ్డివారి కన్నులు తెరువబడును. కుంటివారు గంతులు వేయుదురు అని అతడు వర్ణించెను. ఇవన్నియు యేసు క్రీస్తులో నెరవేర్చ బడబోవు ఆత్మీయ సంగతులకు ఈయబడిన భౌతిక వర్ణనలు. పాపముతో నిండియున్న మన ఎడారి భూమిని యేసు ఫలభరితమైన ఏదెనువనమువలె చేయును.

– జెరాల్డ్ పేడెన్



# రక్షణను గూర్చి నీవు నిజముగా తెలిసికొనవచ్చును

(You can be sure about Salvation)

- Billy Bland

" నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు; నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగియున్నామని (పేతురు) ఆయనతో చెప్పెను" (యోహాను 6:68-69). ఒకడు నిజముగా విశ్వసించి తెలిసికొనవలసిన విషయాల్లో రక్షణ కంటే ప్రాముఖ్యమైనది మరొకటి లేదు. మానవునికొక ఆత్మయున్నది. అతని శరీరము మరణించినను ఆత్మమాత్రము పరలోకములో గాని నరకములో గాని నిత్యము ఉనికి కలిగి యుండును. అతడు రక్షింపబడెనో లేదో యను దానిపై అతడు నిత్యత్వమును ఎక్కడ గడుపునో ఆధారపడియుండును. "రక్షణపొందుటకు నేనేమి చేయవలెను?" అను ప్రశ్నకు అతడెట్లు జవాబిచ్చునో యను దానిపై అతని నిత్యగమ్యము నిర్ధారించబడును.

మానవుని ఆత్మయొక్క ప్రాముఖ్యతను యేసు ఇట్లు వక్కాణించారు: "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును (ఆత్మను) పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా నేమి ఇయ్యగలడు?'' (మత్తయి 16:26). ఈ లోకమంతయు సంపాదించుకొనుట లాభదాయకముగా యుండినను అది అతని ఆత్మకంటే యేమీ ప్రాముఖ్యము కాదు. యిది చాలా ప్రాముఖ్యము. నీ ఆత్మకంటే విలువైనది యేదీలేదు. విచారం యేమంటే, అనేకులు తమ ఆత్మ యొక్క విలువను ఎరుగరు. ప్రజలు తమ ఆత్మను తరుచు నిర్లక్ష్యము చేయుదురు. బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించు కొందుము? అట్టి రక్షణ ప్రభువు బోధించుట చేత ఆరంభమై దేవుడు తన చిత్తానుసారముగా సూచకక్రియల చేతను మహత్కార్యముల చేతను నానావిధములైన అద్భుతముల చేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుట చేతను వారితోకూడ సాక్ష్యమిచ్చుచుండగా వినిన వారిచేత మనకు దృఢపరచబడెను'' (హెబ్రీ 2:2-4). తరువాత అనేకులు వారి ఆత్మ రక్షించబడెనో లేదో నిర్ధారించుకోరు. వారు ఏదో ఒక బోధకుని, ఉపదేశకుని మాటలు వింటారు, బైబిలుతో వారి మాటలను సరిచూడరు. రక్షణను గూర్చి నీవు నిజముగా తెలిసికోవచ్చునను అంశమును ఈ పాఠములో మనం గమనించుదాము.

## రక్షణ యొక్క ఆవశ్యకత

ఈలోకంలో మనం జన్మించినప్పుడు పాపము లేనివారము. పాపమును వారసత్వము వలన పొందము. ప్రవక్తయైన యెహెజ్కేలు ద్వారా దేవుడిట్లు సెలవిచ్చారు: "పాపము చేయువాడే మరణము నొందును; తండ్రియొక్క దోష శిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోష శిక్షను తండ్రి మోయడు. నీతిపరుని నీతి ఆనీతిపరునికే చెందును. దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును' (యెహెజ్కే 18:20). యేసు తన రాజ్యములో ప్రవేశించువారిని చిన్న బిడ్డలతోపోల్చారు.

"ఆ కాలమున శిష్యులు యేసు నొద్దకు వచ్చి పరలోక రాజ్యములో ఎవడుగొప్ప వాడని అడుగగా ఆయన యొక చిన్న బిడ్డను తన యొద్దకు పిలిచి వారి మధ్యను నిలువ బెట్టి యిట్లనెను- మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. కాగా ఈ బిడ్డవలె తన్ను తాను తగ్గించుకొను వాడెవడో వాడే పరలోకములో గొప్పవాడు'' (మత్తయి 18:1-4). మరల ఆత్మీయముగా బిడ్డలు పవిత్రులేయనుచు బైబిలు ఈ ఉదాహరణ నిచ్చుచున్నది. "కొందరు చిన్న పిల్లలను ఆయన యొద్దకు తీసికొని వచ్చిరి. ఆయన శిష్యులు తీసికొని వచ్చిన వారిని గద్దింపగా యేసు - చిన్న పిల్లలను ఆటంక పరచక వారిని నా యొద్దకు రానియ్యుడి; పరలోక రాజ్యము ఈలాటి వారిదని వారితో చెప్పెను" (మత్తయి 19:13-14). చిన్న పిల్లలు పాపము గలవారైతే, యేసు అట్టివారిదే పరలోక రాజ్యము అని అనకపోవును!

ప్రజలు పాపము చేసిన తరువాత పాపులవుదురు, రక్షణ వారికవసరము. అయితే పాపమనగా నేమిటి? మనం పాపుల మెట్లుఅవుదుము? "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమేపాపము" అని దేవుడు చెప్పుచున్నారు (I యోహాను 3:4). ఆజ్ఞను అతిక్రమించుట పాపము. అది దేవుడేర్పాటు చేసిన సరిహద్దులను మీరుటయగును. మరల సకల దుర్నీతియు పాపమని నిర్వచింపబడినది. "సకల దుర్నీతియు పాపము; అయితే మరణ కరముకాని పాపము కలదు" (I యోహాను 5:17). దుర్నీతి అనగా సరియైనది చేయక, అక్రమమైనది చేయుట. మరల "మేలైనది చేయనెరిగియు అలాగు చేయని వానికి పాపము కలుగును'' అని యాకోబు చెప్పుచున్నాడు (యాకోబు 4:17). దేవుని నిర్వచన ప్రకారము పాపము వారసత్వము వలన గాక ఒకడు చేయవలసినది చేయక పోవుట, లేక చేయకూడనిది చేయుట వలన పాపము కలుగును. అది వ్యక్తిగతము.

మనందరం ఏదో విధముగా

పాపము చేసినవారమే యని బైబిలు బోధించుచున్నది. మనం దేవుని ఆజ్ఞను అతిక్రమించాము లేదా చేయవలసినది చేయకున్నాము. తద్వారా పాపులము, అందువలన అందరము పాపులమే. యేసు ప్రభువు మన పాపముల పరిహారార్థముగా ఈ లోకమునకు రావలసిన ఆవశ్యకతను గూర్చి రోమీయులకు వ్రాయబడిన పత్రిక తెలియజేయుచున్నది. ఒకటి, రెండు అధ్యాయాల్లో యూదులు, అన్యజనులు అందరు పాపము చేసిన వారేనని చూపిస్తు, పౌలు ఇట్లు వ్రాసాడు; "అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23).

శుభవార్త యేమంటే పాపములను పరిహరించుటకు యేసు ఈలోకమునకు వచ్చారు. యోహాను యేసు తన వద్దకు వచ్చుట చూచి, "ఇదిగో లోకపాపములను మోసికొని పోవు దేవుని గొర్రెపిల్లయని" ప్రకటించాడు (యోహాను 1:29). దేవుడు పాపమును ఉపేక్షించుట కాదు, ఆయన దానిని క్షమించును, పరిహరించును. దేవుడు యధార్థ వంతుడు అనగా ఆయన ఆజ్ఞల అతిక్రమణను ఉపేక్షించడు శిక్షవిధిస్తాడు. న్యాయాధిపతులు అక్రమము చేసిన వారిని శిక్షించకపోతే మనం వారిని గౌరవించము గదా. దేవుడు యధార్థవంతుడే అయినను ఆయన మనలను నీతిమంతులుగా చేయువాడు. పౌలు ఇట్లు వ్రాసాడు: "కాబట్టినమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడు చున్నారు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున ఆయన తననీతిని కనుపరచవలెనని క్రీస్తుయేసు నందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను. దేవుడిప్పటి కాలమందు నీతిని కనుబరచు నిమిత్తము తాను నీతిమంతుడును యేసు నందలి విశ్వాసము గలవానిని నీతిమంతునిగా తీర్చువాడునై యుండుటకు ఆయన ఆలాగుచేసెను'' (రోమా 3:24-26).

దేవుడు మన రక్షణను కోరు చున్నారు. మనుష్యులందరు రక్షింపబడి సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము కలిగియుండాలని ఆయన కోరుచున్నారు (I తిమో2:4). మనము రక్షింపబడు నిమిత్తము యేసును దేవుడు ఈ లోకమునకు పంపెను. ''దేవుడు లోకమునెంతో ప్రేమించెను; కాగా ఆయన తన అద్వితీయకుమారుని యందు విశ్వాసముంచువాడెవడును నశింపక నిత్యజీవముపొందు నట్లు ఆయననను గ్రహించెను'' (యోహాను 3:16).

## మనమెట్లు రక్షింపబడుదుము?

మనం రక్షింపబడాలంటే అటు దేవుని పక్షము ఇటు మనపక్షము ప్రయత్నించాలి. దేవుని పక్షములో ఆయన దయ, కృప, ప్రేమ, దీర్ఘశాంతము, యేసుయొక్క బలిదానము మొ॥నవి ఇమిడి యున్నాయి. ఈ దైవ లక్షణాలు లేకుండా మనం రక్షింపబడలేము. అయితే మానవుని పక్షముగా కూడ కొన్ని ఉన్నాయి. రక్షింపబడటానికి మనం యేమీ చేయ నక్కర లేకపోతే అందరూ రక్షింప బడుదురు. అయితే రక్షణ కొరకు మనము చేయవలసినవి కొన్ని యున్నాయని యేసుచెప్పుచున్నారు. "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పర లోకములో చేరడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించునని" ఆయనచెప్పారు (మత్త 7:21). పరలోక రాజ్యములో ఎవరు ప్రవేశిస్తారని యేసు చెప్పారు? "పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే". అయితే రక్షణ పొందడానికి మనం యేమి చేయాలి? మొదటిగా మనం దేవుని వాక్యమును వినాలి. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తు వాక్యము వలన కలుగును" యని పౌలు రోమా 10:17లో చెప్పాడు. దేవుని వాక్యము వినుట వలన విశ్వాసము కలుగును, గాని పరిశుద్ధాత్మ ప్రక్రియ వలనగాని, ఇంకేదో వింత అనుభూతి వలనగాని కలుగదు. వినుట ద్వారాను, నేర్చుకొనుట ద్వారాను దేవుని యొద్దకు ఆకర్షింపబడుదుము. యేసు ఇట్లు చెప్పారు; " నన్ను పంపిన తండ్రివానిని ఆకర్షించితేనే గాని యెవడును నా యొద్దకు రాలేడు; అంత్యదినమున నేను వానిని లేపుదును, వారందరును దేవుని చేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడియున్నది గనుక తండ్రి వలన విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును" (యోహాను 6:44-45).

ఒకడు రక్షింపబడాలంటే యేసు ప్రభువు నందు విశ్వాస ముంచవలెను. "కాగా మీ పాపములలోనే యుండి చనిపోవుదురని మీతో చెప్పితిని, నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములలోనే యుండి చనిపోవుదురని యేసువారితో చెప్పెను" (యోహాను 8:24). తదుపరి ఒకడు తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను, యేసు ఇట్లు చెప్పెను; "మీరు మారు మనస్సు పొందని యెడల మీరందరు ఆలాగే నశింతురు" (లూకా 13:3). "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచిచూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని ఆయన మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా. 17:30). మారుమనస్సు అనగా హృదయ మార్పు. తద్వారా జీవితములో మార్పు సంభవించును.

ఒకడు రక్షింపబడవలెనంటే యేసు ప్రభువని, దేవుని కుమారుడని మనుష్యుల యెదుట మనం ఒప్పుకొనాలని కూడా దేవుడు చెప్పారు; "ఏలయనగా నీతి కలుగునట్టు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును " (రోమా 10:10). అపొ.కా. 8:37లో దీని ఉదాహరణ మనము చూడగలము. "ఫిలిప్పు నీ పూర్ణ హృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు – యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తర మిచ్చెను" (అపొ.కా. 8:37).

చివరిగా ఒకని రక్షణలోనికి, క్రీస్తులోనికి ప్రవేశింపజేయునది బాప్తిస్మము. యెరూషలేము పట్టణములో యేసును సిలువవేసిన ప్రజలకు మొట్టమొదటిగా సువార్త ప్రకటింపబడగా వారు తమపాపమును గ్రహించుకొనిరి. వారు "సహోదరులారా, మేమేమి చేతుమని" అడిగారు. పరిశుద్ధాత్మ ప్రేరణతో పేతురు వారితో, "మీరు మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అనువరము పొందుదురు" అని జవాబిచ్చెను (అపొ.కా. 2:38). యేసు నందు విశ్వాసముంచిన వీరు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని చెప్పబడెను. ఎందుకు? తమ పాపములు క్షమించబడుటకు. అంతకుముందుగానే యేసు తన శిష్యులనిట్లు హెచ్చరించారు: "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్షవిధించబడును" (మార్కు 16:15-16). విశ్వాసము, బాప్తిస్మము కూడ రక్షణకు అవసరమని యేసు చెప్పారు. బాప్తిస్మము ద్వారా ఒకడుక్రీస్తులో ప్రవేశించును గనుక దాని ప్రాముఖ్యతను మనము గ్రహించు కోవచ్చును. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారని" పౌలు చెప్పెను (గలతీ 3:27).


క్రీస్తులో మాత్రమే రక్షణ యున్నది. "నేనే మార్గమును, సత్యమును జీవమును, నా ద్వారా నే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని యేసు చెప్పెను (యోహాను 14:6). "ఏర్పరచ బడిన వారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తుయేసు నందలి రక్షణ పొందవలెనని నేను వారి కొరకు సమస్తము ఓర్చుకొను చున్నానని" పౌలు చెప్పాడు (2 తిమో 2:10). క్రీస్తులో మాత్రమే రక్షణ యున్నందున, ఒకడు క్రీస్తులో యుండుట ప్రాముఖ్యము. అలాగే, ఒకడు క్రీస్తులో యుంటే నిజముగా రక్షింపబడినట్టు తెలిసి కొనగలడు!

– బిల్లీ బ్లేండ్

# ఈ యేసు ఎవరు ?

## (Who is this Jesus?)

- Richard N.Ady



రెండువేల సంవత్సరముల క్రితము బెత్లేహేము చిన్నగ్రామములో ఒక శిశువు జన్మించి పశువుల తొట్టిలో పరుండ బెట్టబడెను. ఈనాడు ప్రపంచములో సగము మంది ఆయనను ఘనపరుస్తారు.

గలిలయ కొండల ప్రాంతములో నజరేతను చిన్నవూరిలో యేసు పెరిగెను. అయినను 30వ సంవత్సరము వచ్చువరకు ప్రసిద్ధి గాంచిన వానిగ అగుపడలేదు. తదుపరి మూడున్నర సంవత్సరముల మట్టుకు ఆయన బహిరంగ సువార్త జీవితాన్ని జీవించారు. ఆ పరిచర్య వలన ప్రపంచ చరిత్రే మార్చబడింది.

ఆయన జ్ఞానోపదేశకుడు, సామాన్య ప్రజలు ఆయన మాటలను

ఆసక్తితో వినేవారు (మార్కు 12:37). "ఆయన వారి శాస్త్రుల వలెగాక అధికారము గలవాని వలె వారికి బోధించెను" (మత్త 7:27).

యేసు తన్ను గూర్చి ఆశ్చర్యమైన, కలవరము రేపే సంగతులు చెప్పుకొనే వారు. ఆయన మానవుని కంటే ఉన్నతుడ నని, బోధకుని కంటే ఘనుడనని, ప్రవక్త కంటే ఘనుడనని తన్ను గూర్చి చెప్పేవారు. ఆయన దేవుడనని, దేవుని కుమారుడననీ భావమిచ్చేటట్లు బోధించేవారు. అది ఆయన బోధ యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

**మనుష్యకుమారుడు, దేవుని కుమారుడు :**

యేసు యొక్క పరిచర్య ఆరంభ దినాల్లో నీకోదేము అను ఒక మనుష్యుడు ఆయన యొద్దకు వచ్చాడు. నీకోదేము ఒక పరిసయ్యుడు, యూదులు సమాజ మందిరపు సభ్యుడు. అతడు యేసునొద్దకు రాత్రివేళ వచ్చి, "బోధకుడా, నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలు ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను" (యోహాను 3:1-2).

"అందుకు యేసు అతనితో ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 3:3). మరల యేసు అతనితో "ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 3:5).

క్రొత్త జన్మ ఒక నూతన జన్మయని వివరించిన తరువాత యేసు ఇట్లు చెప్పారు : " మరియు పరలోకము నుండి దిగివచ్చినవాడే అనగా పరలోకములో ఉండు మనుష్య కుమారుడే తప్ప పరలోకమునకు ఎక్కిపోయిన వాడెవడును లేడు. అరణ్యములో మోషే సర్పమును ఏలాగు ఎత్తెనో, ఆలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్యజీవమును పొందునట్లు మనుష్యకుమారుడు ఎత్తబడవలెను. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:13-16). తదుపరి ఆయనే ఆ ఏకైక కుమారుడనని యేసు అతనికి బోధించెను (యోహాను 3:18).

నీ కొదేము యేసును రబ్బీ అనగా బోధకుడా అని సంబోధించాడు, గాని యేసు అతనికి ఒక క్రొత్త మార్గములో బోధించారు. "ప్రభువు ఈలాగు సెలవిచ్చుచున్నాడు" అనిగాక

"నిశ్చయముగా నేను నీతో చెప్పుచున్నాను'' అని ఆయన బోధించారు. అధికారము కొరకు బోధకుల మాటలు చెప్పుటగాక, పాతనిబంధన లేఖనముల నధిగమించే దైవాధికారము ఆయన కున్నట్లు ఆయన బోధించారు. అంటే, ఆయన దేవుని మాటలనే పలుకుచున్నట్లు చెప్పారు. అట్టి ఆరోపణ విప్లవాత్మకమే.

తనను గూర్చి తాను 'మనుష్య కుమారుడనని' చెప్పుకొన్నప్పుడు ఆయన పరిపూర్ణ మానవుడనని మాత్రమే గాక దానియేలు వర్ణించినయట్లు ఆయన మెస్సీయ యని కూడ చెప్పుకొనెను. దానియేలుకు కలిగిన దర్శనమును అతడింకా చూడగా ఆకాశమేఘారూఢుడై మనుష్యకుమారుని పోలిన యొకడు వచ్చి ఆ మహావృద్ధుడగు వాని సన్నిధిని ప్రవేశించి, ఆయన సముఖమునకు తేబడెను. సకల జనులును రాష్ట్రములును ఆయాభాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. అదెన్నటికిని తొలిగిపోదు: ఆయన రాజ్యము ఎప్పటికిని లయముకాదు" (దానియేలు 7:13-14).

తాను మనుష్యకుమారుడనని చెప్పుకొనుటలో, యేసుతాను పరలోకములో నుండి దిగివచ్చిన మెస్సీయనని తెలియజేసుకొనెను. మరియు తన నిత్య రాజ్యము నేలుటకు తండ్రి యొద్దకు తిరిగి వెళ్లుదునని చెప్పుకొనెను. తాను దేవుని ఏకైక అద్వితీయ కుమారుడనని వర్ణించుకొనుట వలన తాను దైవత్వములోని వ్యక్తినని చెప్పుకొనెను. దీని వలన యూదుల నాయకులు ఉద్రేక భరితులైరి.

**మతనాయకులతో యేసు సంబంధము :**

కొండమీద చేసిన ప్రసంగములో యేసుతరచు " అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా గాని నేను చెప్పునదేమనగా" యని చెప్పేవారు (మత్త 5:21, 27, 31, 33, 38, 43). గతంలోను ప్రస్తుతంలోను యూదుల బోధకులు చేయుచున్న సంప్రదాయ బద్ధమైన బోధలను ఆయన సవాలు చేసారు.

ఒక సందర్భములో ఆయన, "నోట పడునది మనుష్యుని అపవిత్ర పరచదు గాని నోటనుండి వచ్చునదియే మనుష్యుని అపవిత్రపరచునని చెప్పెను" (మత్తయి 15:11). ఇక్కడ పవిత్ర, అపవిత్ర భోజ్యములను గూర్చి పాతనిబంధన బోధను ప్రక్కకు నెట్టేసారు. పాతనిబంధన బోధను తొలగించి దాని స్థానంలో తనస్వంత బోధను ప్రవేశపెట్టే యితడు ఎట్టివాడు? క్రొత్తనిబంధనను ప్రవేశపెట్టుచున్న ఈయన ఎవడు?

**దేవుని వ్రేలితో:**

ఒకనాడు యేసు మూగ

దయ్యమును వెళ్లగొట్టగా ఆ దయ్యము వదిలిపోయిన తరువాత మూగవాడు మాటలాడెను. ప్రజలు ఆశ్చర్యపడిరి గాని వారిలో కొందరు "ఆయన దయ్యముల అధిపతియైన బయెల్జెబూలు వలన దయ్యములను వెళ్లగొట్టుచున్నాడని చెప్పుకొనిరి" (లూకా 11:14-15). ఒక అద్భుత కార్యము జరిగెనని వారు కాదనలేకపోయిరి గాని ఆ క్రియ సాతాను శక్తివలన సాధ్యమాయెనని ఆరోపించిరి.

"ఆయన వారి ఆలోచనల నెరిగి వారితో ఇట్లనెను- తనుకు తానే వేరైపోయిన ప్రతిరాజ్యము పడిపోవును. తనకు తానే విరోధమైన ప్రతియిల్లు కూలిపోవును. సాతాను తనకు తానే వేరుపడిన యెడల వాని రాజ్యమేలాగు నిలుచును? నేను దేవుని వ్రేలితో దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల మీ కుమారులు ఎవని వలన వెళ్లగొట్టు చున్నారు? అందుచేత వారే మీకు తీర్పరులై యుందురు. అయితే నేను దేవుని వ్రేలితో దయ్యములను వెళ్ళగొట్టుచున్న యెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది" (లూకా 11:16-20).

యేసు దేవుని వ్రేలిని వినియోగించుచున్నట్లు విదితమే. ఆయన దేవుని శక్తిని బట్టి పనిచేయుచున్నారు. సాతానుపై ఆయనకున్న శక్తిని బట్టి దేవుని రాజరికము (రాజ్యము) నకు అది ఆరంభ సూచన యని ఆయన చెప్పెను.

## తండ్రి కుమారుల అవగాహన :

గలిలయ ప్రాంతములో పరచర్య చేస్తూ యేసు, "సమస్తమును నా తండ్రిచేత నా కప్పగింపబడియున్నది. తండ్రిగాక యెవడును కుమారుని ఎరుగడు; కుమారుడు గాకను, కుమారుడెవనికి ఆయనను బయలుపరచ నుద్దేశించునో వాడుగాకను మరి ఎవడును తండ్రిని ఎరుగడు" అని చెప్పెను (మత్తయి 11:27). యేసు యొక్క స్వీయ అవగాహనము గూర్చి యిది మనకేమి చెప్పుచున్నది? ఆయన తానే దేవుని ఏకైక కుమారుడనని భావించు చున్నట్లును, ఆయన మాత్రమే తండ్రియైన దేవుని మానవులకు బయలు పరచువాడైనట్లును తెలియజేయుచున్నది.

## అబ్బా, తండ్రీ:

దేవునికి ప్రార్థించుచు యేసు అరామిక్ భాషలో అబ్బా అనగా తండ్రీయని సంబోధించేవారు. యిది వారిద్దరి మధ్యయున్న సన్నిహిత సంబంధమును తెలియజేయుచున్నది. అది ప్రేమ పూర్వకముగా పిలిచే పదము.

క్రొత్తనిబంధన కాలములో యూదులు దేవుని నామమును ఎంత గౌరవించే వారంటే తమ పెదవులతో ఆయన నామమును అపవిత్ర పరచెదమేమో యనే భయంతో దానిని ఉచ్చరించే వారుకాదు. గాని యేసు దేవుని అబ్బా, తండ్రీయని ఉచ్చరించుటయే

గాక, ఆయన శిష్యులకు కూడ దానిని నేర్పించారు. దేవునితో ఆయన సన్నిహిత సంబంధము కలిగియుండుటయే గాక, అట్టి సంబంధమును మనమును కలిగియుండునట్లు ఆయన సాధ్య పరచారు. ఆయన దేవుని ప్రేమపూర్వక కుమారుడని యేసు ఎరుగును. అందువలన ఆయన సన్నిహిత సంబంధ పదజాలము లను వినియోగించి ప్రార్థించేవారు.

**దేవునితో సమానుడు :**

ఒక సబ్బాతు దినమందు యెరూషలేములో బెతెస్థ కోనేటి దగ్గర యేసు ఒకని స్వస్థపరచారు. అతడు 38 సంవత్సరముల నుండి వ్యాధిగ్రస్థుడై యుండెను. సబ్బాతు దినమందు స్వస్థపరచినందున యూదులు ఆయనను విమర్శింపగా, యేసు "నా తండ్రి యిది వరకు పనిచేయుచున్నాడు; నేనును చేయుచున్నానని వారికుత్తరమిచ్చెను" (యోహాను 5:17).

ఈ మాట వినగానే యూదులు అత్యాగ్రహులై ఆయనను చంపజూచారు. ఆయన విశ్రాంతి దినాచారము మీరుటయేగాక, దేవుడు తన సొంత తండ్రియని చెప్పి తన్ను దేవునితో సమానునిగా చేసికొనినందున యూదులు ఆయనను చంపవలెనని మరిఎక్కువగా ప్రయత్నము చేసారు (యోహాను 5:18).

**"నీవు మనుష్యుడవే, దేవుడనని చెప్పుకొనుచున్నావు" :**

యెరూషలేములో ప్రతిష్ఠిత పండుగనాడు "యూదులు ఆయన చుట్టుపోగై ఎంతకాలము మమ్మును సందేహపెట్టదువు; నీవు క్రీస్తువైతే మాతో చెప్పుమనిరి" (యోహాను 10:24).

" అందుకు యేసు – మీతో చెప్పితిని గాని మీరు నమ్మరు. నేను నా తండ్రి నామమందు చేయుచున్న క్రియలు నన్నుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి. అయితే మీరు నా గొర్రెలలో చేరిన వారు కారు గనుక నన్ను నమ్మరు. నా గొర్రెలు నా స్వరము వినును. నేను వాటి నెరుగుదును. అవి నన్ను వెంబడించును. నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను. గనుక అవి ఎన్నటికిని నశింపవు. ఎవడును వాటిని నా చేతిలో నుండి అపహరింపడు. వాటిని నా కిచ్చిన తండ్రి అందరికంటె గొప్పవాడు గనుక నా తండ్రి చేతిలో నుండి యెవడును వాటిని అపహరింపలేడు. నేనును తండ్రియు ఏకమై యున్నామని వారితో చెప్పెను" (యోహాను 10:25–30).

ఈమాట వినగానే వారు ఆయనను కొట్టవలెనని రాళ్లు చేతపట్టుకొనగా "యేసు తండ్రియొద్ద నుండి అనేకమైన మంచి క్రియలను మీకు చూపితిని; వాటిలో ఏక్రియ నిమిత్తము నన్ను రాళ్లతో కొట్టుదురని వారినడిగెను" (యోహాను 10:32). " అందుకు యూదులు – నీవు

మనుష్యుడవై యుండి దేవుడనని చెప్పుకొనుచున్నావు గనుక దేవదూషణ చేసినందుకే నిన్ను రాళ్లతో కొట్టుదుము" అని జవాబిచ్చిరి (యోహా 10:33). యేసు తండ్రియైన దేవునితో సమానునిగా చేసికొనుచున్నాడని వారు గ్రహించిరి.

**పాపములు క్షమించే అధికారము :**

కపెర్నహూములో యేసు ఒక యింటవున్నాడని వినవచ్చినప్పుడు అనేక జనులు కూడి వచ్చిరి. గనుక వాకిటయైనను వారికి స్థలము లేకపోయెను. ఆయన వారికి వాక్యము బోధించుచుండగా పక్షవాయువు గల మనుష్యుని నలుగురిచే మోయించుకొని ఆయన యొద్దకు తీసికొని వచ్చిరి. చాలమంది కూడియున్నందున వారాయన యొద్దకు చేరలేక ఆయన యున్నచోటికి పైగా ఇంటిపై కప్పు విప్పి సందుచేసి పక్షవాయువు గల వానిని పరుపుతోనే దింపిరి. యేసువారి విశ్వాసము చూచి, కుమారుడా నీ పాపములు క్షమింపబడియున్నవి అని అతనితో చెప్పెను (మార్కు 2:1-5).

అక్కడున్న శాస్త్రులలో కొందరు "ఇతడు ఇట్లెందుకు చెప్పుచున్నాడు? దేవదూషణ చేయుచున్నాడు కదా? దేవుడొక్కడే తప్ప పాపములు క్షమింప గలవాడెవడని తమ హృదయములో అనుకొనిరి" (మార్కు 2:7).

యేసువారి ఆలోచనల నెరిగి వారితో "ఈ పక్షవాయువు గలవానితో నీ పాపములు క్షమింపబడియున్నవని చెప్పుట సులభమా? నీవులేచి నీ పరుపు నెత్తికొని నడువుమని చెప్పుట సులభమా? అయితే పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్యకుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెనని చెప్పి పక్షవాయు గలవాని చూచి నీవు లేచి నీ పరుపు నెత్తికొని యింటికి పొమ్మని నీతో చెప్పుచున్నాననెను. తక్షణమే వాడులేచి, పరుపెత్తుకొని వారందరి యెదుట నడిచిపోయెను. వారందరు విభ్రాంతి నొంది మనమీలాటి కార్యములను ఎన్నడును చూడలేదని చెప్పుకొనుచు దేవుని మహిమపరచిరి'' (మార్కు 2:8-12).

ఆ మనుష్యుని పాపములు క్షమించుట వలన యేసుతానే దేవుడనని చెప్పుకొన్నారు. ఆయన విమర్శకులు సరియే. దేవుడు మాత్రమే పాపములు క్షమించగలరు. ఆయద్భుతము చేయుట ద్వారా ఆయన శరీరము దాల్చిన దేవుడని, దేవునికుమారుడని యేసు నిరూపించెను.

**యూదుల మహాసభ యెదుట యేసుసాక్ష్యము :**

యూదుల మహాసభ యెదుట యేసునకు తీర్పుతీర్చబడుచుండగా. ప్రధానయాజకుడు ఆయనను చూచి, "నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ

మాట మాతో చెప్పుమని జీవము గల దేవుని తోడని నీకు ఆనబెట్టు చున్నాననెను" (మత్తయి 26:63). "అందుకు యేసు - నీవన్నట్టే ఇది మొదలుకొని మనుష్య కుమారుడు సర్వశక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు ఆశాక మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురని" చెప్పెను (మత్త 26:64).

ఈ మాటవిని ప్రధాన యాజకుడు తన వస్త్రములు చింపుకొని వీడు దేవదూషణ చేసెను; మనకిక సాక్షులతో ఏమిపని? యని అరచెను (26:65). యేసు తాను దేవుని కుమారుడనని చెప్పగానే దాని అర్థాన్ని యూదుల నాయకులు గ్రహించారు. తాను దైవవ్యక్తినని, దేవుని తత్వములో, భాగస్థుడనని ఆయన చెప్పుకొనెను. ఆయన కుమారుడైన దేవుడు.

### నేనే ఆయనను (I Am) :

తాను దేవుడనని చెప్పుకొనుటలో యేసు "నేనే ఆయనను' అనే పేరును ఎక్కువ వినియోగించుకొన్నారు. దేవుడు మండుచున్న పొద ద్వారా మోషేకు కనబడి ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించే బాధ్యత అతనికి అప్పగించినప్పుడు మోషే దేవునితో "చిత్తగించుము; నేను ఇశ్రాయేలీయుల యొద్దకు వెళ్లి, మీ పితరుల దేవుడు నన్ను మీ యొద్దకు పంపెనని చెప్పగా వారు, ఆయన పేరేమి అని అడిగిన యెడల వారితో నేనేమి చెప్పవలెను?" అని అడిగెను. అందుకు దేవుడు నేను ఉన్నవాడను అనువాడనై యున్నాని మోషేతో చెప్పెను. మరియు ఆయన ఉండునను వాడు మీ యొద్దకు నన్ను పంపెనని ఇశ్రాయేలీయులతో చెప్పుమనెను" (నిర్గమ 3:13-15).

యావే అనునది హెబ్రీపదము. ఉన్నవాడని దాని యర్థము. దేవుడు నిత్యుడు, స్వయంజీవుడు, ఇప్పుడు ఎల్లప్పుడు తన ప్రజలతో యుండువాడని ఆయన పేరు యొక్క భావం, ఈ పేరును యేసు తనకు తానే యూదులతో, "నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీ పాపములోనే యుండి చనిపోవుదురని చెప్పెను" (యోహాను 8:24). "మీరు మనుష్యకుమారుని (సిలువ) పైకెత్తినప్పుడు నేనే ఆయనని గ్రహింతురు" (యోహాను 8:28).

ఆయన యూదులతో "మీ తండ్రియైన అబ్రహాము నా దినము చూతునని మిగుల ఆనందించెను, అది చూచి సంతోషించెననెను" (యోహాను 8:56).

"అందుకు యూదులు నీకింకను ఏబది సంవత్సరములైనను లేవే, నీవు అబ్రాహామును చూచితివా అని ఆయనతో అనగా, యేసు అబ్రాహాము పుట్టక మునుపేనేనున్నాని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 8:57-58). కాబట్టి వారాయన మీద

రువ్వుటకు రాళ్లు ఎత్తిరి గాని యేసు దాగి దేవాలయములో నుండి బయటికి వెళ్లిపోయెను.

**యేసు తన ఆరోపణలను బలపరచెను :**

యేసు తన్ను గూర్చి చెప్పుకొనిన మాటల మీదనే గాక, ఆ మాటలను ఆయన ఎట్లు బలపరచారో దానిపై మన స్పందన ఆధారపడియుండును. ఆయన తన్నుగూర్చి చెప్పుకొన్నవి ఎవరైనా చెప్పుకోవచ్చును గాని ఆ మాటలు వారు బలపరచగలగాలి.

"యేసు జీవాహారము నేనే, నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు. నాయందు విశ్వాసముంచు వాడు ఎప్పుడును దప్పిగొనడని" చెప్పెను (యోహాను 6:35). ఆయన ఐదు రొట్టెలు రెండు చిన్న చేపలతో 5000 మందికి ఆహారము పెట్టిన తరువాత పైమాటలు చెప్పెను (యోహాను 6:35; 6:1-13).

"నేను లోకమునకు వెలుగును" అని యేసు చెప్పారు (యోహా 8:12). రాత్రివచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయలేడు. నేను లోకములో ఉన్నప్పుడు లోకమునకు వెలుగునని యేసు చెప్పెను (యోహా 9:4-5). అట్లు చెప్పి ఆయన ఒక గ్రుడ్డివానికి చూపునను గ్రహించెను (9:6-8).


"యేసు పునరుత్థానమును జీవమును నేను, నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును, బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు అని చెప్పెను (యోహాను 11:25-26). ఆయన అట్లు చెప్పి చనిపోయిన లాజరు సమాధి దగ్గరకు వచ్చి, "లాజరూ బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా, చనిపోయినవాడు ప్రేత వస్త్రములతో కట్టబడిన వాడై బయటికి వచ్చెను (యోహాను 11:43-44). లాజరు చనిపోయి అప్పటికి నాలుగు దినముల నుండి సమాధిలో యుండెను. యేసు నిజముగా జీవమును, పునరుత్థానమునై యున్నానని నిరూపించెను.

"నేను గొర్రెలకు మంచికాపరిని, మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణము పెట్టును" అని యేసు చెప్పెను (యోహాను 10:11;17-18). ఆయన ఈ మాటలు చెప్పిన అనతికాలములోనే ఆయన సిలువపై ఇష్టపూర్వకముగా మనకొరకు తన ప్రాణమర్పించెను.

**సంగ్రహము :**

తన గుర్తింపు కొరకు యేసు ఎన్నడు ఆందోళన జెందలేదు, తాను దేవుని ఏకైక కుమారుడని ఆయన ఎరుగును. మానవులను పాపము నుండి విడుదల చేయు నిమిత్తము దేవుడాయనను పంపెనని ఆయన ఎరిగియుండెను (యోహాను 8:31-32, 34,36).

దేవుడాయనలో యుండి



పనిచేయుచుండెనని, ఆయన ద్వారా మాటలాడుచుండెనని, ఆయనను నడిపించుచుండెనని యేసు ఎరుగును. యేసు మాట్లాడినప్పుడు దేవుని మాటలనే పలికెను. ఆయన పనిచేసినప్పుడు, దేవుడే ఆపని చేసెను.

**ముగింపు :**

"ఆది యందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెనని" అందుకే యోహాను తన సువార్త గ్రంథము నారంభించెను (యోహాను 1:1-2). "ఆ వాక్యము శరీరధారియై కృపా సత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను. తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:14).

"ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను" (యోహాను 1:18).

యేసును గూర్చి నీయభిప్రాయ మేమిటి? ఆయన ఎవరి కుమారుడు? (మత్త 22:42).

**- రిచర్డ్ ఏడీ**

# Delicate, Fragile Treasures

Have you seen them?
Those fragile,
minutely designed,
exquisitely colored
flowers
God created?
Some are so tiny,
so thin of fabric,
so easy to be broken,
If I had made such fragility
I would have built around them
thick......glass....cases,
Protecting them day and night
From nature's harsh
and careless touch.



But God had different thoughts:
He planted treasures
delicate, fragile treasures
In the desert's heat
and barrenness,
In the tundra's cold
and wasted wilds,
In the jungle's wet
and monstrous growth.
And everywhere
God's jewels
survive and thrive, and seem doubly,
triply
precious
because they live
where fragile gems should never grow.
And in those wild and barren soils
They speak of God.



- Betty Burton Choate

# GOSPEL PREACHING ON TELEVISION & RADIO

Telugu : Subhavartha Channel Sunday 6.00 p.m.
Rakshana Channel Wednesday 6.30 p.m.
Rakshana Channel Thursday 2.30 p.m.
Speakers : Ricky, Ronnie & Joshua Gootam

Hindi : Shubhasandesh Channel Sunday & Tuesday 7.00-7.30 p.m.
Speakers : Francis, Vinay, & Sunny David
P.O. Box. 3815, New Delhi - 110049.

Malayalam : Jai Hind Channel Saturday 6.00-6.30 a.m.
Speaker : P.K. Varghese

Tamil : Tamilan T.V. Tuesday 9.30-9.45 p.m
Sunday 6.45-7.00 p.m.
Holy Cross T.V. Sunday 6.30-6.45 a.m(Only in Puducherry)
King of Glory T.V. Sunday 6.15-6.30 a.m (in Tirunelveli Distt.)
Speakers : Philemon & Kingsley

Tamilan T.V. Monday 7.00-7.15 a.m
Thursday 9.30-10 p.m.
Saturday 7.15-7.30 a.m
Speaker : Rajanayagam

Tamilan T.V. Monday 6.00-6.15 a.m,
Saturday 6.15-6.30 p.m.
Speaker : Arjunan

**TAMIL RADIO PROGRAMS FROM SRI LANKA RADIO**
Sunday to Wednesday 5.30 -5.45 p.m.
Speakers : Douglas & P.R. Swamy
Saturday 5.30-5.45 p.m., Speaker : Arjunan

Please write to these addresses for
Bible correspondence courses, Magzines, and
other Christian literature in your language.

All of these Programmes are sponsored
by
CHURCH OF CHRIST